


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 6.00

సంపుటి: 12 సంచిక: 216

ఆదివారం 27-10-2019







SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన ప్రజా కృతజ్ఞత సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్

# లెక్క కుదరలేదు..

**ఆర్టీసీ జేఏసీ నేతలతో చర్చలు విఫలం.. ● అర్ధంతరంగా నిష్క్రమించిన జేఏసీ నేతలు, అధికారులు**

- కోర్టు చెప్పిన 21 అంశాలపైనే చర్చిస్తామన్న అధికారులు
- అన్నింటిపై చర్చించాల్సిందేనని జేఏసీ నేతల పట్టు
- ముందు అధికారులే వెళ్లిపోయారని ఆరోపణ
- బయటకెళ్లి వస్తామని తిరిగి రాలేదన్న అధికారులు

“ ఫోన్లు కూడా లాగేసుకుని, పోలీసు పహారా పెట్టి జరిపేవి చర్చలెలా అవుతాయి. యూనియన్ల డిమాండ్లు పక్కన పెట్టి తమ ఎజెండా ప్రకారమే చర్చ జరగాలని అధికారులు చెప్పడం దారుణం.
– కార్మిక సంఘాల జేఏసీ

హైకోర్టు సూచించినట్లే ఎజెండా సిద్ధం చేశాం. కానీ వాటిపై చర్చకు జేఏసీ నేతలు ఇష్టపడలేదు. అన్ని డిమాండ్లపై చర్చకు పట్టుబట్టారు. అదెలా సాధ్యం. చర్చలకు మళ్లీ వస్తామని వారు తిరిగి రాలేదు.
– అధికారులు

సాక్షి, హైదరాబాద్

**22** రోజుల సమ్మె తర్వాత పట్టువిడుపుల ధోరణి ప్రదర్శిస్తూ ఇటు ప్రభుత్వం చర్చలకు పిలవడం, వెంటనే కార్మిక సంఘాలు స్వాగతించడంతో.. ఆర్టీసీ సమ్మెకు పరిష్కారం వస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. కానీ చర్చలు ఇటు జేఏసీ నేతలు, అటు అధికారులు సమావేశమందిరంలో కూర్చున్న కొద్దిసేపటికే అర్ధంతరంగా ఆగిపోయాయి. ఎవరి పట్టు వారు ప్రదర్శించడంతో చర్చలు విఫలమయ్యాయి. అధికారులది తప్పంటూ కార్మిక సంఘాల జేఏసీ, జేఏసీ తీరు సరికాదంటూ అధికారులు ప్రకటించి నిష్క్రమించారు. మళ్లీ చర్చలకు పిలిస్తే తాము సిద్ధమని జేఏసీ పేర్కొనగా, తాము చర్చల హాలులోనే ఉన్నా మళ్లీ జేఏసీ నేతలు రాలేదని అధికారులు

మిగతా 2వ పేజీలో ▶



చర్చలు విఫలమైనట్లు ప్రకటిస్తున్న అశ్వత్థామరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

# నీళ్లేవో, పాలేవో తేల్చారు

## సైదిరెడ్డికి భారీ విజయం చేకూర్చిన హుజూర్‌నగర్ ప్రజలకు ధన్యవాదాలు

### ప్రజా కృతజ్ఞత సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

- గోదావరి నీళ్లను సాగర్ ఎడమ కాలువలో వేస్తాం
- రాష్ట్రవ్యాప్తంగా 600 లిఫ్టులను ప్రభుత్వం టేకోవర్ చేస్తుంది
- నియోజకవర్గంపై వరాల జల్లు
- గ్రామ పంచాయతీకి రూ. 20 లక్షలు, మండల కేంద్రానికి రూ.30 లక్షల చొప్పున మంజూరు
- హుజూర్‌నగర్ మున్సిపాలిటీకి రూ. 25 కోట్లు, నేరేడుచర్ల మున్సిపాలిటీకి రూ. 15 కోట్లు కూడా..

సాక్షి ప్రతినిధి, సూర్యాపేట

'హుజూర్‌నగర్ ముద్దు బిడ్డలకు రాష్ట్ర ప్రజల పక్షాన, నా పక్షాన, టీఆర్‌ఎస్ పక్షాన హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. మీరు అందించిన విజయం తప్పకుండా మాలో ఉత్సాహాన్ని, సేవాభావాన్ని పెంచడంతోపాటు మరింత అంకితభావంతో పనిచేసే స్ఫూర్తి కలిగించింది. ఇది మామూలు విజయం కాదు. ఎన్నో అపోహలు, అనుమానాలు, అపవాదులు, ఎన్నో నీలాపనిందలు అన్నింటినీ విశ్లేషణ చేసి మీరు నీళ్లేవో.. పాలేవో తేల్చిచెప్పారు. బల్లగుద్ది మరీ హుజూర్‌నగర్ తీర్పు చెప్పింది. అందుకు మీ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు చెబుతున్నా'అని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ప్రజా కృతజ్ఞత సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కార్యకర్తలు, ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్ నుంచి హుజూర్‌నగర్ చేరుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ కాన్వాయ్ వెంట వెయ్యికిపైగా వాహనాలు వచ్చాయి. ఈ సభలో మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, ఎంపీలు సంతోష్, బడుగుల లింగయ్య యాదవ్, మాలోతు కవిత, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నేతి విద్యాసాగర్, కర్నె ప్రభాకర్, తేరా చిన్నపరెడ్డి, ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, శానంపూడి సైదిరెడ్డి, గ్యాదరి కిశోర్, చిరుమర్తి లింగయ్య, భాస్కర్‌రావు, రవీంద్ర నాయక్, కంచర్ల భూపాల్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జెడ్పీ చైర్మన్లు, సందీప్‌రెడ్డి, గుజ్జా దీపిక, మాజీ మంత్రులు వేణుగోపాలాచారి, పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. సీఎం ప్రసంగం ఆయన మాటల్లోనే..

**ఫలితానికి సరి సమానంగా అభివృద్ధి..**

''హుజూర్‌నగర్‌లో 141 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో ఏడు మండల కేంద్రాలను తీసేస్తే 134 గ్రామ పంచాయతీలు ఉంటాయి. మీరు ఎలా అయితే ఉవ్వెత్తున ఉత్సాహపరిచే ఫలితం ఇచ్చారో దానికి సరిసమానంగా సైదిరెడ్డి నాయకత్వంలో హుజూర్‌నగర్ అద్భుతమైన

మిగతా 2వ పేజీలో ▶

## సెలవు

దీపావళి సందర్భంగా నేడు సాక్షి కార్యాలయానికి సెలవు. కావున సోమవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం.








# 'చెప్పుకోలేని బాధకు'... చలించిన ప్రజాప్రతినిధులు

**'సాక్షి' కథనానికి స్పందిస్తూ తక్షణ చర్యల దిశగా అడుగులు**

- గూడూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో టాయిలెట్ల నిర్మాణానికి ఎంపీల్యాడ్స్ ఇస్తానన్న సంతోష్
- అదనపు టాయిలెట్ల నిర్మాణానికి మంత్రి సబిత ఆదేశం
- కలెక్టర్‌ను వివరణ కోరిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి...
- రూ.1.75 లక్షల సాయానికి ముందుకు వచ్చిన ఏపీలోని మంగళగిరి ఎమ్మెల్యే

**సాక్షి, హైదరాబాద్:** మహబూబాబాద్ జిల్లా గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు అక్కడ ఉన్న ఒకే టాయిలెట్‌తో ఇక్కట్లు పడుతున్న అంశం ప్రజాప్రతినిధులను కదిలించింది. ఈ ఇబ్బందిపై 'చెప్పుకోలేని బాధ'శీర్షికతో శనివారం 'సాక్షి' ప్రధాన సంచికలో ప్రచురించిన కథనానికి వారు చలించారు. రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ ట్విట్టర్ వేదికగా దీనిపై స్పందిస్తూ విద్యార్థినులు టాయిలెట్ కోసం చాంతాడంత క్యూలైన్ పాటించాల్సిన దుస్థితి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తక్షణ చర్యల్లో భాగంగా తన ఎంపీ నిధుల నుంచి మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులను విడుదల చేస్తానని ప్రకటిస్తూ 'సాక్షి' కథనాన్ని ట్వీట్ చేశారు.టాయిలెట్ల నిర్మాణానికి తాను బాధ్యత తీసుకుని పూర్తి చేయిస్తానని, ఈ మేరకు అధికారులకు సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి స్పందిస్తూ ఆ పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణం కోసం రూ.1.75 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు.

**ఏటీఆర్ కోరిన కేంద్రమంత్రి**

టాయిలెట్ అంశంపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డి స్పందించారు. సమస్య పరిష్కారం దిశగా

మిగతా 2వ పేజీలో ▶




స్కూల్ విద్యార్థినుల సమస్యపై శనివారం సాక్షి సంచికలో ప్రచురితమైన కథనం

# రాసిస్తేనే మీకు మద్దతిస్తాం

## మహారాష్ట్రలో సీఎం పీఠం కోసం బీజేపీపై శివసేన ఒత్తిడి

- ఆదిత్య ఠాక్రేకు సీఎం పదవి, మంత్రివర్గంలో సమాన వాటాకు డిమాండ్
- బీజేపీ లిఖితపూర్వక హామీ ఇవ్వాల్సిందేనని స్పష్టీకరణ
- ముఖ్యమంత్రి కుర్చీ తమదేనంటున్న బీజేపీ

- 5లో













## ఇదండీ సంగతి



తెల్లవార్లూ అలా కాకరొత్తులు తిప్పుతూనే ఉంటారట.. దోమలు కుట్టకుండా...!



## ఇల్లంతా.. చెర్రింత

దీపావళి సందర్భంగా కొత్త ఇంట్లోకి వెళ్తున్న హీరో రామ్‌చరణ్‌తో 'సాక్షి' ఇంటర్వ్యూ

- ఫ్యామిలీలో



## ఫైనల్ చేరుకున్న సాత్విక్-చిరాగ్ జోడీ

ఫ్రెంచ్ ఓపెన్ సెమీస్‌లో ఐదో సీడ్ జపాన్ జంటపై సంచలన విజయం

- స్పోర్ట్స్‌లో

# బీసీ విద్యార్థులకు దీపావళి కానుక

**సాక్షి, హైదరాబాద్:** బీసీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుక ఇచ్చింది. పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకారవేతన, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం బకాయిలకు సంబంధించి పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేసింది. ప్రస్తుత వార్షిక సంవత్సరంలో నిర్దేశించిన బడ్జెట్‌కు అనుగుణంగా రూ.1,196.58 కోట్లకు సంబంధించిన బీఆర్వో (బడ్జెట్ రిలీజింగ్ ఆర్డర్)లను విడుదల చేసింది. ఈమేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి పార్థసారథి ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు వెలువడడమే తరువాయి బీసీ సంక్షేమ శాఖ తక్షణ చర్యలు చేపట్టింది. ఈ నిధులతో 2017-18, 2018-19 విద్యా సంవత్సరాల్లో పేరుకుపోయిన బకాయిలను దాదాపు క్లియర్ చేయనుంది. ఎస్సీ అభివృద్ధి శాఖ, గిరిజన సంక్షేమ శాఖలకు ప్రత్యేక అభివృద్ధి నిధి కింద నిధుల కేటాయింపులు సంతృప్తికరంగా ఉండడంతో ఆమేరకు విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వీలైనంత త్వరితంగా విడుదల చేస్తున్నప్పటికీ, బీసీ సంక్షేమ శాఖకు నిధుల కేటాయింపుల్లో జాప్యం జరుగుతుండడంతో పంపిణీ ఆలస్యమైంది. తాజాగా ఆమోదించిన పద్దుల్లో బీసీ, ఈబీసీ విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలతో పాటు బీసీల కులాంతర వివాహ ఆర్థిక సాయం తదితరాలున్నాయి. ఇందులో ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్ కేటగిరీల్లో నిధులు విడుదల చేయడంతో ప్రాధాన్యతా క్రమంలో సమాన నిధులు ఇచ్చే వీలుంటుంది.

# కొత్త మెడికల్ సీట్లకు కేంద్ర సాయం

- 790 ఎంబీబీఎస్, 150 పీజీ మెడికల్ సీట్లకు రూ. 1,128 కోట్ల నిధులు
- ప్రతిపాదించాలని వైద్య విద్యా సంచాలకులకు కేంద్రం ఆదేశం
- ఒక్కో మెడికల్ సీటుకు రూ. 1.20 కోట్లు ఇవ్వనున్న కేంద్రం

- వివరాలు 13లో

epaper.sakshi.com

సాక్షి
రౌండప్
నల్లగొండ | ఆదివారం |
అక్టోబర్ | 27 | 2019 |
www.sakshi.com



## ఆ వెలుగుల్లో ఎన్నో రంగులు

అమావాస్యనాడు వచ్చే పున్నమి రోజు. దీపాల కాంతులు వెదజల్లే రోజు దీపావళి. ఈ పండుగని మన దేశంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా జరుపుకుంటారు. దంతేరాస్ నుంచి మొదలై భాయ్ దూజ్ లేదంటే భగినీ హస్త భోజనంతో ఐదు రోజులపాటు ఈ పండుగని ఉత్తరాదిన అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. దీపావళి మర్నాడు జరిగే గోవర్ధన్ పూజ భార్యాభర్తల బంధాన్ని బలోపేతం చేసేదైతే, ఆ మర్నాడు నిర్వహించే భగినీ హస్త భోజనం అన్నా చెల్లెళ్ల అనుబంధానికి నిదర్శనం.

- ఉత్తరప్రదేశ్‌లోని పుణ్యక్షేత్రమైన కాశీలో దేవ దీపావళి పేరుతో జరుపుకుంటారు. ఈ రోజు ముక్కోటి దేవతలు గంగానదిలో స్నానమాచరిస్తారని వారి నమ్మకం. అందుకే ఆ రోజు గంగమ్మకి అత్యంత వైభవోపేతంగా హారతినిస్తారు.
- పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో దీపావళికి కాళీ పూజ ఎంతో ప్రత్యేకమైంది. మందారపూలతో కాళీ మాతని పూజించి మాంసం, చేపలు నైవేద్యంగా పెడతారు.
- అస్సాంలో దీపావళి అంటే ఊరంతా రంగవల్లులు తీర్చిదిద్ది వాటి మధ్యలో దీపాలను ఉంచి వేడుక నిర్వహిస్తారు.
- గుజరాత్‌లో దీపావళి అంటే లక్ష్మీపూజే. ఆ రాష్ట్రంలో వర్తకులు ఎక్కువగా ఉండటంతో లక్ష్మీదేవి తమ ఇంటిని విడిచి వెళ్లకూడదని దీపాలు వెలిగించి పూజలు చేస్తారు. దీపావళి మర్నాడు నుంచి వారికి నూతన సంవత్సరం మొదలవుతుంది.
- మహారాష్ట్రలో దీపావళి రోజు గోమాతల్ని పూజిస్తారు. ఆ మర్నాడు కార్తీకమాసం శుభకరమైన మాసం కావడంతో వివాహాలు చేసుకోవచ్చన్న సంప్రదాయంతో తులసి మొక్కకు వివాహం జరిపిస్తారు.
- మధ్యప్రదేశ్‌లో దీపావళి పండుగతో కొత్త సంవత్సరం ప్రారంభం అవుతుంది. దీపాల వెలుగుల్లో వారు కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతారు.
- తమిళనాడులో దీపావళి ఆచారాలు కాస్త విభిన్నంగా ఉంటాయి. దీపావళి లేహ్యం అని తయారు చేసి అందరూ తింటారు. ఈ లేహ్యంతో సర్వరోగాలు దూరమైపోతాయని వారి నమ్మకం.

## పచ్చని మొక్కలు తోడుంటే..



టపాసుల కాలుష్యానికి భయపడి నాలుగు గోడల మధ్య ఉండే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. అయితే బహిరంగ ప్రదేశాల్లో కంటే ఇంట్లోనే ఐదు రెట్లు ఎక్కువ కాలుష్యం ఉంటుందంటున్నారు నిపుణులు. ధ్వని, వాయు కాలుష్యానికి భయపడి నాలుగు గోడల మధ్యే ఉండిపోతే పోలా అనుకోకండి. అది మరింత ప్రమాదకరం. అందుకే ఇంటిని కాలుష్య రహితంగా మలచుకునేందుకు కొన్ని ప్రత్యేకమైన ఇండోర్ ప్లాంట్స్ ఉన్నాయి. ఈ మొక్కలు ఎయిర్ ప్యూరిఫయర్స్. కాలుష్యాన్ని హరించి, స్వచ్ఛమైన ఆక్సిజన్‌ని మనకందిస్తాయి. వాటిని ఇంట్లో పెట్టుకుంటే సరి ఇవి కాలుష్య రహితమే కాకుండా అందానికి అందం, ఆనందానికి ఆనందం మీ ఇంటి సొంతం అవుతుంది. అలాంటి మొక్కల్లో అలోవేరా, బోస్టన్ ఫర్మ్, స్నేక్ ప్లాంట్, బాంబూ పామ్, వార్నెక్ డ్రాకేనా, స్పైడర్ ప్లాంట్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ మధ్యకాలంలో వీటికి బాగా డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా అపార్ట్‌మెంట్‌లలో ఉండేవాళ్లు వారి బాల్కనీల్లో ఇలాంటి మొక్కల్ని పెంచుతున్నారు.




శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన ప్రజా కృతజ్ఞత సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

# నీళ్లేవో, పాలేవో తేల్చారు

మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గం అనే పరిస్థితి రావాలి. ఇందుకోసం ప్రతి గ్రామ పంచాయతీకి రూ. 20 లక్షల చొప్పున ముఖ్యమంత్రి ప్రత్యేక నిధుల నుంచి మంజూరు చేస్తున్నా. రేపో, ఎల్లుండో జీఓ విడుదల చేస్తాం. అలాగే ప్రతి మండల కేంద్రానికి రూ. 30 లక్షలు మంజూరు చేస్తున్నాం. హుజూర్‌నగర్ మున్సిపాలిటీకి సీఎంగా నా నిధుల నుంచి రూ. 25 కోట్లు, నేరేడుచర్ల మున్సిపాలిటీకి రూ. 15 కోట్లు మంజూరు చేస్తున్నా. హుజూర్‌నగర్, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ ప్రాంతాల్లో కొంత పోడుభూముల సమస్య ఉంది. దీనిపై అన్ని జిల్లాలకు నేనే వెళ్తున్నా. మొత్తం మంత్రివర్గం వచ్చి ప్రజాదర్బార్ పెట్టి కొద్దిరోజుల్లోనే ఈ సమస్యను పరిష్కరిస్తుంది.

### 3 ఫీట్ల జగదీశ్‌రెడ్డి కాళేశ్వరం నీళ్లు తెచ్చిండు..

హుజూర్‌నగర్‌ను అభివృద్ధి బాటలో పెట్టడానికి వచ్చా. మాటలు మాట్లాడేవారు దుర్మార్గంగా ఆరోపణలు చేశారు. జగదీశ్‌రెడ్డి మూడు ఫీట్లు లేడని మాట్లాడారు. ఆయన ఎంత ఉన్నాడో అంతే ఉన్నడు. కానీ ఇక్కడ ఏడు ఫీట్లు ఉన్న నేత చేసింది చెబితే మీరు (ప్రజలు) నవ్వుతారు. కానీ ఇవ్వాళ మూడు ఫీట్లు ఉన్న మంత్రి 300 కి.మీ. దూరాన ఉన్న కాళేశ్వరం నుంచి నీళ్లు తెచ్చి పెన్‌పహాడ్ మండలంలోని చివరి గ్రామాలు, తుంగతుర్తి వరకు, నడిగూడెం, కోదాడ వరకు జిల్లా



భూములను పునీతం చేస్తుండు. రూ. 30 వేల కోట్లతో నిర్మాణమవుతున్న యాదాద్రి అల్ట్రా మెగా విద్యుత్ ప్లాంట్‌ను దామరచర్ల మండలానికి తెచ్చాడు. ఇది పూర్తయితే ఈ జిల్లా ఆర్థిక ముఖచిత్రమే మారుతుంది.

### సాగర్ ఆయకట్టును కాపాడుకుంటాం

నాగార్జునసాగర్ ఆయకట్టును నల్లగొండ జిల్లాలో కాపాడుకోవాలి. ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టును తీసుకున్నాం. దీని ద్వారా ఖమ్మం జిల్లా ఆయకట్టు బాధలు తొలగుతాయి. నల్లగొండ జిల్లాలోని ఆయకట్టు బాధలు శాశ్వతంగా పోవాలి. దీనికోసం గోదావరి నీళ్లు సాగర్ ఎడమ కాలువలో పడాలి. ఈ నీళ్లతో రెండు పంటలు ఏటా పండాలి. ఇందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం. నాలుగేళ్లు అహోరాత్రాలు పనిచేశాం. కాళేశ్వరం ప్రాజెక్టు విజయవంతమైంది. ఇప్పుడు కేసీఆర్ దెబ్బ సాగర్ ఆయకట్టుపై పడుతుంది. కచ్చితంగా తిరుగుతా. ఎమ్మెల్యేలను వెంటవేసుకొని వచ్చే 15–20 రోజుల్లో నేనే స్వయంగా వచ్చి కోదాడ నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టు వరకు పర్యటన చేస్తా. ప్రజలను, రైతులను కలుస్తా. ఈ బడ్జెట్‌లో, వచ్చే బడ్జెట్‌లో కొన్ని నిధులు మంజూరు చేసి శాశ్వతంగా సమస్యను పరిష్కరిస్తాం. ఏ ఎత్తిపోతలు కావాలో అన్నీ మంజూరు చేస్తాం. కాలువల లైనింగ్‌లు చేస్తాం. ఈ పనులన్నీ త్వరలో జరుగుతాయి. నవంబర్ మొదటి వారంలో జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఇంజనీరింగ్ నిపుణులు, నాగార్జునసాగర్ సీఈ నర్సింహతో తిరిగి పరిశీలించాలి.

### ఎత్తిపోతల రైతాంగానికి శుభవార్త..

ఐడీసీ, నీటిపారుదలశాఖ కింద ఎత్తిపోతల బాధ్యతలు సొసైటీలు, ఎన్జీఓల పరిధిలో ఉన్నాయి. రైతులపై పైసా భారం లేకుండా వాటన్నింటినీ ప్రభుత్వమే టేకోవర్ చేస్తుంది. అందులోని సిబ్బందినీ ప్రభుత్వమే తీసుకుంటుంది. వారి జీత భత్యాలూ ప్రభుత్వమే చెల్లిస్తుంది. రాష్ట్రంలోని 600 ఎత్తిపోతలకు ఈ ఉపశమనం ఉంటుంది. రైతాంగమంతా సంతోషిస్తుంది. హుజూర్‌నగర్ ప్రజా కృతజ్ఞత సభ వేదికగా తెలంగాణ రైతాంగానికి ఈ శుభవార్త చెబుతున్నా.



సభా వేదికపై కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

### కర్రు కాల్చి వాత పెట్టారు..

సైదిరెడ్డికి మీరు (ప్రజలు) 40 వేలకుపైగా మెజారిటీ ఇచ్చారు. కొందరు దుర్మార్గులు ఆయనది గుంటూరు జిల్లా అన్నారు. ఆయనది గుంటూరు జిల్లా కాదు కాబట్టే మీరు కర్రు కాల్చి వాత పెట్టారు. మీ అందరి దీవెనలు ఇలానే ఉంటే ఎవరు ఏమన్నా భయపడకుండా, వెరవకుండా ఇంకా మరిన్ని సేవలు చేస్తాం. మళ్లీ వచ్చినప్పుడు జాన్‌పహాడ్ దర్గా, మట్టపల్లి ఆలయం దర్శనం చేసుకుంటా. ఈ రెండు పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేస్తాం. కులాలు, మతాలు లేకుండా అందరినీ సమానంగా గౌరవిస్తూ ముందుకు పోతున్న రాష్ట్రాన్ని చూసి కొందరు అవాకులు చవాకులు మాట్లాడుతున్నరు. ఓర్వలేక అసంబద్ధ ప్రేలాపనలు చేస్తున్నరు. వారందరికీ దీటైన సమాధానం చెప్పి అద్భుతమైన మెజారిటీతో మా అభ్యర్థి సైదిరెడ్డికి విజయం చేకూర్చి కేసీఆర్ రైట్.. కేసీఆర్ గో ఎహెడ్ అని చెప్పిన హుజూర్‌నగర్ ప్రజలకు ధన్యవాదాలు. రాష్ట్ర ప్రజల సేవలో తరిస్తాం''.

## ఇంటర్ ఫీజు గడువు నవంబర్ 4వరకు పెంపు

సాక్షి, హైదరాబాద్: మార్చి–2020లో జరిగే ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఫీజు గడువును నవంబర్ 4 వరకు పొడిగిస్తున్నట్లు బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిర్దేశిత గడువు వరకు విద్యార్థుల నుంచి ఫీజు స్వీకరించాల్సిందిగా జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ఫీజు మొత్తాన్ని ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా ఇంటర్ బోర్డుకు నవంబర్ 5లోగా చెల్లించాలని స్పష్టం చేశారు.

## వయోపరిమితి తగ్గించొద్దు: నిరుద్యోగులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగ నియామకాల ప్రక్రియలో అభ్యర్థుల వయోపరిమితిని తగ్గించొద్దని నిరుద్యోగ ఫ్రంట్ చైర్మన్ చనగాని దయాకర్ డిమాండ్ చేశారు. శనివారం ఉస్మానియా వర్సిటీలో విద్యార్థులు, నిరుద్యోగులతో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం మాట్లాడారు. ఓపెన్ కేటగిరీని 34 ఏళ్లకు, రిజర్వ్ కేటగిరీలను 39 ఏళ్లకు పరిమితం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం క్రమం తప్పకుండా ఉద్యోగాల భర్తీ చేపట్టడం లేదని, అభ్యర్థుల వయోపరిమితి తగ్గిస్తే ఉద్యోగ అవకాశాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ఆధారంగా నూతన జోనల్ విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## 'చెప్పకోలేని బాధకు'... చలించిన ప్రజాప్రతినిధులు

మొదటి పేజీ తరువాయి

చర్యలు తీసుకోవాలని ఆ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ఏటీఆర్) తనకు సమర్పించాలని సూచించారు.

### అన్ని స్కూళ్లలో అవసరమైనన్ని టాయిలెట్లు : మంత్రి సబితారెడ్డి

గూడూరు పాఠశాలలోని టాయిలెట్ల సమస్యపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఆ జిల్లా కలెక్టర్‌తో ఫోనులో మాట్లాడారు. పాఠశాలలో అదనంగా మరికొన్ని మరుగుదొడ్లు నిర్మించి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా మరుగుదొడ్లను నిర్మించాలని, ఈ మేరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. శనివారం ఆ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి బృందం సందర్శించి కలెక్టర్‌కు నివేదిక సమర్పించింది.

## క్రిమినల్ కేసులుండగా శాఖాపర విచారణ చేయొచ్చు

- చిగురుపాటి హత్య కేసులో పోలీసులకు ఎదురుదెబ్బ
- తీర్పు వెలువరించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ప్రవాస భారతీయుడు, ప్రముఖ వ్యాపారవేత్త చిగురుపాటి జయరాం హత్య కేసులో ప్రధాన నిందితుడికి సహకరించిన ముగ్గురు పోలీసు అధికారులకు హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాకేశ్‌రెడ్డికి సహకరించారన్న అభియోగాల నేపథ్యంలో డీజీపీ జారీ చేసిన చార్జిమెమోను సవాల్ చేసిన డీఎస్పీ మల్లారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు ఎస్.శ్రీనివాసులు, ఎం.రాంబాబులు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. ఉద్యోగులపై క్రిమినల్ కేసులు విచారణలో ఉండగా ప్రభుత్వం శాఖాపరమైన విచారణ జరపవచ్చునని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు తీర్పులో వెలువరించారు. జయరాం హత్య కేసులో ప్రధాన నిందితుడు రాకేశ్‌రెడ్డికి ఆ ముగ్గురు పోలీసు అధికారులు సహకరించారని క్రిమినల్ కేసు నమోదైనప్పటికీ శాఖాపరంగా విచారణ చేయొచ్చని, రెండింటికీ సంబంధం లేదని స్పష్టం చేశారు. క్రిమినల్ కేసు పరిష్కారమయ్యే వరకూ శాఖాపర విచారణ నిలుపుదల చేయాలన్న పిటిషనర్ల వాదనను ఆమోదించలేకపోతున్నామని తేల్చి చెప్పారు. ఉద్యోగుల విధుల నిర్వహణలో జరిగిన తప్పిదాలపై శాఖాపరంగా విచారణ జరుగుతుందని, సమాజంలో జరిగిన నేరంపై నమోదు అయ్యే క్రిమినల్ కేసుల్ని కోర్టులు విచారిస్తాయని వివరించారు. పోలీసులపై మచ్చ లేకుండా ఉన్నప్పుడే ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## బీసీలను కులాల వారీగా లెక్కించాలి

**జనగణన– 2020పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి**

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం జరిపే జనగణన 2020లో కులాల వారీగా బీసీలను లెక్కించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య కోరారు. ఈమేరకు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం శనివారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డిని కలసి వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంత్రి జి.కిషన్‌రెడ్డితో జనాభా లెక్కల విషయమై చర్చించారు. అనంతరం ఆర్.కృష్ణయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణలు మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం సంవత్సరం క్రితం బీసీ కులాల వారీగా లెక్కలు సేకరించాలని హోంశాఖ మంత్రివర్గ కోర్‌కమిటీ సమావేశం నిర్ణయించిందని, ఆ తర్వాత సర్క్యులర్ కూడా జారీ చేసిందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం హోంశాఖ ద్వారా జారీ చేసిన నమూనా పత్రంలో ఎస్సీ/ఎస్టీల వివరాలు కాలం, హిందూ, ముస్లిం, క్రైస్తవ తదితర మతాల కాలమ్స్ వివరాలు, ఇతర వివరాలకు సంబంధించిన కాలమ్స్ నమూనా పత్రాన్ని జారీ చేశారని తెలిపారు. కానీ ఈ జనాభా లెక్కల బీసీ కులాల వివరాలకు సంబంధించినవి పెట్టలేదని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లుపెట్టి, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వారికి 50% రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లలో 50% సీట్లు పెంచాలని కోరారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీల అభివృద్ధికి ప్రత్యేక పథకాలను రూపొందించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, బైన కిరణ్, గుజ్జ వెంకటేశ్, ర్యాగ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్‌గా జస్టిస్ ఎం.ఎస్. రామచంద్రరావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు నియమితులయ్యారు. ఆయన పేరును రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నామినేట్ చేయడంతో ప్రభుత్వ కార్యదర్శి వి.నిరంజన్‌రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 14 నుంచే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం తెలిపింది.

## కేఏటీ ఫలితాల్లో శ్రీ చైతన్య రికార్డు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా జరిగిన కేఏటీ–2019 (నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్)లో తమ విద్యార్థులు రికార్డు స్థాయిలో రెండో దశకు అర్హత సాధించారని శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత డాక్టర్ బి.యస్. రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 18,528 మంది విద్యార్థులు ఎంపికవ్వగా శ్రీ చైతన్య స్కూల్స్ నుంచే 8,565 మంది విద్యార్థులు అర్హత సాధించారని వెల్లడించారు.

# లెక్క కుదరలేదు..

మొదటి పేజీ తరువాయి

పేర్కొనటం విశేషం. వెరసి మళ్లీ చర్చలపై ప్రతిష్టంభన నెలకొంది. ఆదివారం దీపావళి కావటం, సోమవారమే కోర్టుకు నివేదించాల్సి ఉండటంతో పరిస్థితి అయోమయంగా మారింది. విఫలం కావాలన్న ఎజెండాతోనే ప్రభుత్వం ఈ తరహా చర్చలకు ప్లాన్ చేసిందని జేఏసీ ఆరోపించింది. సమ్మె యథాతథంగా సాగుతుందని, 30న సకల జనుల సమర భేరి భారీ స్థాయిలో నిర్వహించే ఏర్పాట్లు సాగుతున్నాయని జేఏసీ నేతలు వెల్లడించారు.

### ఉదయమే చర్చలపై సమాచారం..

శుక్రవారం సాయంత్రం ఆరుగురు సభ్యుల అధికారుల కమిటీ ఇచ్చిన నివేదికపై ప్రగతి భవన్‌లో అధికారులతో సీఎం దాదాపు 5 గంటల పాటు సమీక్షించి చర్చలకు పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే. కానీ అధికారికంగా ప్రకటించలేదు. శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వరరావు జేఏసీ నేతలను చర్చలకు ఆహ్వానిస్తూ ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్‌శర్మ సంతకంతో ఉన్న లేఖలు అందజేశారు. మధ్యాహ్నం 2 గంటలకు చర్చలుంటాయని, ఎండీ కార్యాలయం ఉన్న ఎర్రమంజిల్‌లోని రోడ్లు, భవనాల శాఖ ఈఎన్‌సీ కార్యాలయాన్ని వేదికగా పేర్కొన్నారు. దీనికి జేఏసీ నేతలు సమ్మతించి అఖిలపక్ష నేతలతో భేటీ అయి చర్చల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. మధ్యాహ్నం 2 గంటలకల్లా జేఏసీ నేతలు 16 మంది ఆ కార్యాలయ ప్రాంగణానికి చేరుకున్నారు. అప్పటికే పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించి ఉన్నారు. గేట్ వద్దనే వారిని ఆపేసి జేఏసీలోని నాలుగు సంఘాల నుంచి ఒక్కొక్కరు చొప్పున నలుగురు మాత్రమే హాజరు కావాలని పేర్లను పిలిచారు. దీంతో కన్వీనర్ అశ్వత్థామరెడ్డి, కో–కన్వీనర్లు రాజిరెడ్డి, వీఎస్‌రావు, వాసు దేవరావులు చర్చలకు వెళ్లడంతో మిగతావారు బయటే ఉండిపోయారు. లోపలికి వెళ్లిన వారి ఫోన్లు బయటే డిపాజిట్ చేయాలని ఆదేశించారు. ఇది పద్ధతి కాదని, అవసరమైతే తాము వెలుపల ఉన్న నేతలతో మాట్లాడాల్సి ఉంటుందని, ఫోన్లు అనుమతించాలని కోరినా అధికారులు అంగీకరించలేదు. వాటిని స్విచ్ఛాఫ్ చేసి పెట్టిన తర్వాతే అనుమతించారు. ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్‌శర్మ, రవాణా శాఖ కమిషనర్ సందీప్ కుమార్ సుల్తానియాలు చర్చలకు సిద్ధమయ్యారు. హైకోర్టు సూచించినట్లు 21 అంశాలపై చర్చలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. అదెలా సాధ్యమని, అసలు హైకోర్టు 21 అంశాలపైనే చర్చించాలని చెప్పలేదని, జేఏసీ సూచించిన 26 అంశాలపైన అయినా, కోర్టులో మరో పిటిషన్‌దారు అయిన టీఎంయూ పేర్కొన్న 45 డిమాండ్లపైన అయినా చర్చించాలని జేఏసీ నేతలు కోరారు. కోర్టు మధ్యంతర ఉత్తర్వు ఆధారంగానే ఈ చర్చలుంటాయని, అన్ని డిమాండ్లపై సాధ్యం కాదని తేల్చి చెప్పారు. ఇదే విషయంలో దాదాపు రెండు గంటలు గడిచాక జేఏసీ నేతలు వెలుపలికి వచ్చారు. మీడియా ప్రతినిధులను కూడా గేట్ వద్దనే పోలీసులు ఆపేయటంతో, వారు గేట్ వద్దకు వచ్చి చర్చలు మొదలు కాకుండానే అర్ధంతరంగా ఆగిపోయినట్లు వెల్లడించారు. తాము అధికారులు పిలిస్తే ఎప్పుడైనా చర్చలకు వచ్చేందుకు సిద్ధమని, వారి పిలుపు కోసం ఎదురు చూస్తామని చెప్పి నిష్క్రమించారు. వారు వెళ్లిన గంటన్నర తర్వాత చర్చల్లో పాల్గొన్న ఇద్దరు అధికారులు కూడా మీడియా ప్రతినిధులతో మాట్లాడి నిష్క్రమించారు.

### మళ్లీ వస్తామని వెళ్లిపోయారు: చర్చల్లో పాల్గొన్న ఐఏఎస్ అధికారులు

చర్చలు ఫలవంతమయ్యేలా మేం ప్రయత్నించాం. కానీ జేఏసీ నేతలే సహకరించలేదు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం సాధ్యం కాదని ప్రభుత్వం ఎప్పుడో తేల్చి చెప్పింది. కోర్టుకు కూడా విన్నవించింది. అది మినహాయించి మిగతావాటిల్లోని 21 అంశాలపై చర్చించాలని కోర్టు సూచించింది. ఆ మేరకే 21 అంశాలపై చర్చిద్దామని పేర్కొన్నాం. కానీ అన్ని డిమాండ్లపై చర్చించాలని వారు పట్టుపట్టారు. కాసేపు బయటకు వెళ్లి మాట్లాడుకుని వచ్చారు. మళ్లీ అదే పట్టుపట్టారు. మేం మళ్లీ అదే విషయాన్ని వారికి చెప్పాం. దీంతో తమ వారితో మాట్లాడి వస్తామని చెప్పి వారు వెళ్లిపోయారు. సాయంత్రం ఆరున్నర వరకు వేచి చూశాం. వారు రాలేదు. దీంతో ఇక వారు చర్చల నుంచి నిష్క్రమించినట్లు భావించి మేం కూడా వెలుపలికి వచ్చేశాం. సమావేశంలో ఆర్టీసీ ఈడీలు ఉండాలని ఎక్కడా రూల్ లేదు. ఫోన్లను అనుమతించటానికి వేరే కారణమేమీ లేదు. సమావేశం మధ్యలో ఫోన్లు వస్తుంటే ఇబ్బందిగా ఉంటుందన్న ఉద్దేశంతోనే వాటిని అనుమతించకూడదనుకున్నాం'

### కోర్టు ఉత్తర్వును వక్రీకరించారు: జేఏసీ నేతలు

'ప్రభుత్వానికి చర్చలు ఫలించాలన్న ఆలోచన లేదని ఈ చర్చల తంతుతో తేలిపోయింది. చర్చలు విఫలమయ్యేలా సొంత ఎజెండా రూపొందించింది. చర్చల సారాంశాన్ని సోమవారం హైకోర్టుకు నివేదించాల్సి ఉన్నందున, జేఏసీ నేతలే చర్చలను విఫలం చేశారని కోర్టుకు చెప్పే ఆలోచనలో ఉన్నట్లు స్పష్టమవుతోంది. అసలు కోర్టు ఆదేశించింది వేరు.. ఇక్కడ జరిగింది వేరు. 21 అంశాలపైనే చర్చించాలని కోర్టు చెప్పలేదు. జేఏసీ సూచించిన 26 అంశాలపై చర్చించమని కోరాం. వాటిల్లో మేం, అధికారులు ఏయే విషయాల్లో పట్టువిడుపులతో వ్యవహరిస్తారనేది తర్వాత సంగతి. ముందు చర్చిస్తే తేలిపోతుంది కదా.. దానికి అధికారులు సిద్ధంగా లేరు. వారు 21 అంశాలపైనే చర్చిస్తామని పట్టుపట్టి కూర్చున్నారు. సమ్మెకు పూర్వం జరిగిన చర్చల్లో 16 మందిని అనుమతించారు. ఇప్పుడు వారిని బయటే ఆపారు. ఫోన్లు లాగేసుకున్నారు. దీనిపై మేం మాట్లాడుతుండగానే అధికారులే సమావేశ మందిరం నుంచి వెళ్లిపోయారు. వారు మళ్లీ వస్తారని కాసేపు అక్కడే కూర్చుని, సిబ్బందితో టీ తెప్పించుకుని తాగాం. అధికారులు రాకపోవటంతో మేం బయటకొచ్చాం. శత్రు దేశాల మధ్య చర్చలు కూడా ఇంత దారుణంగా ఉండవు. చర్చల తంతు మొత్తం వీడియో రికార్డు చేయించాం. ఆ వీడియోను కోర్టుకు సమర్పించాలని డిమాండ్ చేస్తున్నాం. దాన్ని చూస్తే ఎవరు చర్చలను విఫలం చేశారో తెలుస్తుంది'

epaper.sakshi.com

## క్లుప్తంగా...

### ఉత్తమ్ చాలా ధైర్యవంతుడు: జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: సైన్యంలో పని చేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చాలా ధైర్యవంతుడని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఉప ఎన్నికల ఫలితాలు ఎప్పుడైనా అధికార పార్టీకి అనుకూలంగా వస్తాయని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు రూ. 30 కోట్లు సిద్ధంగా ఉంటేనే పోటీ చేయాలన్నారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో ఓడిపోయినా ఉత్తమ్ పదవికి ఎటువంటి ఇబ్బంది లేదని వివరించారు.

### చర్చలను ప్రభుత్వం విఫలం చేసింది: సీపీఎం

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ సమ్మెపై హైకోర్టు ఇచ్చిన సానుకూల ఆదేశాలను వక్రీకరించి శనివారం నాటి చర్చలను రాష్ట్ర ప్రభుత్వం విఫలం చేసిందని సీపీఎం ధ్వజమెత్తింది. సమ్మెను ఉక్కుపాదంతో అణచివేసే సర్కార్ ధోరణిలో ఏ మార్పూ లేకపోవడాన్ని ఈ చర్చలు మరోసారి రుజువు చేశాయని పేర్కొంది. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం రాజ్యాంగ ధిక్కరణకు పాల్పడటం మానుకొని మళ్లీ చర్చలు జరపాలని సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

### కేటీఆర్ స్ఫూర్తితో రూ. 25 లక్షల విరాళం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చేపట్టిన సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి పొంది హైదరాబాద్‌కు చెందిన గగన్‌దీప్ సింగ్ కోహ్లి అనే వ్యక్తి రూ.25 లక్షల విరాళాన్ని ఇచ్చారు. ఈ మేరకు శనివారం ప్రగతి భవన్‌లో కేటీఆర్‌ను కలసిన గగన్‌దీప్ విరాళం చెక్కును ఆయనకు అందజేశారు. కేటీఆర్ చేపట్టిన సేవా కార్యక్రమాలకు మరింత చేయూత అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి ఈ విరాళం ఇచ్చినట్లు గగన్‌దీప్ వెల్లడించారు. గగన్‌దీప్‌ను కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు.

### నేడు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి నిరాహార దీక్ష

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికుల సమస్యలపై సీఎం కేసీఆర్ జోక్యం చేసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మె విరమణకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు వారికి మద్దతుగా ఆదివారం దీపావళి పండుగ అయినప్పటికీ ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్ష చేపడుతున్నట్లు ప్రకటించారు. నగరంలో ఉన్న ఉపాధ్యాయులు దీక్షకు మద్దతివ్వాలని కోరారు.

# పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

- దశలవారీగా డబుల్ ఇళ్ల కేటాయింపు: పురపాలకశాఖ మంత్రి కేటీఆర్
- పట్టణ ప్రాంతాల్లో డబుల్ ఇళ్ల పురోగతిపై సమీక్ష

సాక్షి, హైదరాబాద్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని అధికారులను పురపాలకశాఖ మంత్రి కె.తారకరామారావు ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దిష్ట కార్యాచరణను తయారు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై శనివారం గృహ నిర్మాణ, పశుసంవర్ధక శాఖ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్‌తో కలసి ప్రగతి భవన్‌లో అధికారులతో కేటీఆర్ సమీక్షించారు. అర్హులైన పేదలకే డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, ఎంపికలో లాటరీ పద్ధతిని అవలంభించాలని ఆదేశించారు. లబ్ధిదారులు ఒక చోట ఇల్లు పొందిన తర్వాత మరోచోట దరఖాస్తు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

**గ్రేటర్‌లో 70 శాతం పనులు పూర్తి**



జీహెచ్‌ఎంసీ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని హౌసింగ్ శాఖ అధికారులు మంత్రుల దృష్టికి తెచ్చారు. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగతావి కూడా చురుగ్గా కొనసాగుతున్నాయని వివరించారు. ఇళ్ల స్థలాలిచ్చిన మురికివాడల ప్రజలకు ఇళ్లను త్వరగా పూర్తిచేసి వారికి దశలవారీగా అప్పగించాలని మంత్రు లు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం, వాంబే ఇళ్ల నిర్మాణాలు పూర్తయినందున నెలరోజుల్లో లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలన్నారు. పూర్తయిన కాలనీలకు తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి కనీస సౌకర్యాల కల్పనపై నివేదిక తయారు చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లను కోరారు. సమావేశంలో మేయర్ బొంతు రామ్మోహన్, హౌసింగ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ చిత్రా రామచంద్రన్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, జలమండలి ఎండీ దాన కిషోర్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# శిశువు ప్రాణాలు కోల్పోతే బెయిలబుల్ కేసా?

**షైన్ ఆస్పత్రి ఘటనలో ఎఫ్‌ఐఆర్ తీరుపై కోర్టు ఆగ్రహం**

సాక్షి, హైదరాబాద్: ఎల్బీనగర్‌లోని షైన్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం జరిగి ఒక శిశువు ప్రాణం కోల్పోతే నిందితులపై 304(ఏ) బెయిలబుల్ కేసు పెట్టడమేమిటని పోలీసుల తీరుపై రంగారెడ్డి జిల్లా కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతేకాకుండా ఎల్బీ నగర్ పోలీసులు నమోదుచేసిన ఆ సెక్షన్‌ను ఐపీసీ సెక్షన్ 304 పార్ట్(టూ)గా తనకున్న అధికారాలతో ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ అయిన రెండో అదనపు మెట్రోపాలిటన్ కోర్టు మేజిస్ట్రేట్ కవితాదేవి ఎఫ్‌ఐఆర్‌లో మార్చారు. చనిపోతారని తెలిసీ నిర్లక్ష్యంతో వ్యవహరించి చిన్నారి ప్రాణాలు పోవడానికి కారణమైన నిందితులపై బెయిలబుల్ సెక్షన్లు నమోదు చేయడం సమంజసం కాదని ఆమె పోలీసులకు చురకలంటించారు. ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ ఎఫ్‌ఐఆర్‌లో మార్చిన 304 పార్ట్ (టూ) ప్రకారం నేరం రుజువైతే పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. షైన్ ఆస్పత్రి ఎండీ సునీల్ కుమార్‌రెడ్డితో పాటు మరో నలుగురిని రంగారెడ్డి జిల్లా కోర్టులో శుక్రవారం హాజరుపరచగా, వారి న్యాయవాది బెయిల్ కోసం సిద్ధంగా ఉన్న సమయంలో కోర్టు తీసుకున్న నిర్ణయం వారిని విస్మయానికి గురిచేసింది. గతంలో హైదరాబాద్‌లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో చిన్నారి రమ్య మృతి చెందినప్పటి నుంచి కేసులను 304(ఏ) సెక్షన్ కాకుండా 304 పార్ట్(టూ)గా పోలీసులు నమోదుచేస్తున్న సంగతి తెలిసిందే.



# సదర్ కింగ్.. ‘సర్తాజ్’

**రూ. 27 కోట్ల ఖరీదైన దున్న.. ప్రదర్శనకు సిద్ధం**

మహానగరానికే ప్రత్యేకమైన సదర్ ఉత్సవానికి రంగం సిద్ధమైంది. దీపావళి అనంతరం యాదవుల సాంస్కృతిక వేడుకగా పేరొందిన సదర్‌ను హైదరాబాద్‌లోని పలుచోట్ల నిర్వహిస్తుంటారు. ఈ వేడుకల్లో దున్నల ప్రదర్శన హైలెట్. ఇందుకోసం ప్రత్యేక దున్నలను ఇతర రాష్ట్రాల నుంచి రప్పిస్తారు. ఈ నెల 29న జరగనున్న సదర్‌లో ‘సర్తాజ్’అనే దున్న ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. హరియాణాకు చెందిన ప్రముఖ రైతు వీరేంద్రసింగ్‌కు చెందిన ‘సర్తాజ్’ప్రపంచంలోనే ఎంతో డిమాండ్ ఉన్న ముర్రా జాతికి చెందిన దున్న. రూ.27 కోట్ల ఖరీదైన ఈ దున్నను నగరంలో సదర్ వేడుకల సందర్భంగా ప్రదర్శించేందుకు అఖిలభారత యాదవ మహాసభ ఏర్పాట్లు చేస్తోంది. – సాక్షి, హైదరాబాద్

### నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాలతో అన్నదాత తీవ్రంగా నష్టపోయాడని, తక్షణం చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ విడుదల చేశారు. తడిసి, ముద్దయి మొలకెత్తిన, రంగు మారిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి, ఇతర పంటలపై తీవ్ర ప్రభావం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పెట్టుబడి కూడా పొందలేక ఆందోళనకు గురవుతున్న రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.


















# పారిశుద్ధ్య నిర్వహణ నిరంతర ప్రక్రియ

**కేబినెట్ సబ్ కమిటీ సూచనలు**

సాక్షి, హైదరాబాద్: పారిశుద్ధ్య నిర్వహణ అనేది నిరంతర ప్రక్రియ అని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో నిరంతరం పారిశుద్ధ్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఐదుగురు మంత్రులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ సూచించింది. 30 రోజుల ప్రణాళికలో భాగంగా పాత భవనాల కూల్చివేత, పడావుపడిన బావుల పూడ్చివేత, పనుల బిల్లుల చెల్లింపు విషయంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించుకోవాలని ఈ దిశగా గ్రామ పంచాయతీలకు అధికారులు అవగాహన కల్పించాలని పేర్కొంది. శనివారం గ్రామీణ పారిశుద్ధ్యంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధ్యక్షతన సమావేశమైంది. సమావేశంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొన్నారు. 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు స్ఫూర్తిని నిరంతరం కొనసాగించేలా గ్రామాల్లో కార్యకలాపాలు ఉండాలని మంత్రులు పేర్కొన్నారు. ఇంకుడు గుంతలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, నర్సరీల ఏర్పాటుకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేలా ప్రణాళికలు ఉండాలన్నారు.

**సమావేశంలో చర్చించిన మరికొన్ని అంశాలు**

- గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సాధించడానికి టీఎస్‌ఐఆర్డీ ప్రణాళికను సిద్ధంచేసి గ్రామీణ స్థానిక సంస్థలకు శిక్షణ ఇవ్వాలి
- గ్రామాల్లోని అన్ని నర్సరీలకు బోర్డుపై ఆ ఊరి పేరు ఉండాలి. డీపీవో, డీఎల్‌వో, ఎంపీవో ఎన్నిసార్లు తనిఖీలు చేశారో చూడాలి
- పారిశుద్ధ్య కార్మికుల పేర్లు, ఫోన్ నంబర్లు వారికి కేటాయించిన స్థలాల వివరాలు గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలి
- గ్రామాల వారీగా కార్యకలాపాల వార్షిక క్యాలెండర్ తయారుచేసుకోవాలి
- గ్రామాల్లోని మురికి నీరు బయటికి పోయే విధంగా ఏఈలు ప్రతి గ్రామంలో మాస్టర్ డ్రైనేజీని ప్లాన్ చేయాలి. 100 శాతం ఇంకుడుగుంతల వ్యవస్థను అభివృద్ధి చేయాలి
- ఉపాధిహామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ నిధులు సకాలంలో విడుదల అయ్యేలా చూడాలి
- గ్రామకంఠంలోని స్థలాలను సరిగా గుర్తించి వాటికి సంబంధించిన డాక్యుమెంట్లను గ్రామపంచాయతీ ద్వారా సంబంధితులకు ఇవ్వాలి
- గ్రామపంచాయతీ చట్టంతోపాటు అన్ని ప్రభుత్వ అంశాలపై డీపీవో, డీఎల్‌వో, ఎంపీవోలు ప్రజలను చైతన్య పరచాలి




## ఆవు పేడతో ప్రమిదలు...



ప్రమిదలు అంటే మనకి మట్టితో చేస్తారనే తెలుసు. అయితే ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఆవు పేడతో ప్రమిదలు చేస్తారు. ఎందుకంటే వారికి ఆవు అత్యంత పవిత్రమైనది. ఈ ప్రమిదలు పర్యావరణానికి ఎంతో హితం కూడా. అందుకే ఆవు పేడ, కొన్ని రకాల ఔషధ గుణాలు కలిగిన మూలికలు, చింతగింజల పేస్ట్ కలిపి ప్రమిదల్ని తయారు చేస్తారు. రాయపూర్ చుట్టుపక్కల గ్రామాల్లో మహిళా స్వయం సహాయ బృందాలు ఆవు పేడతో ప్రమిదలు చేసి అమ్ముతారు. మొదట్లో ఈ స్వయం సహాయక బృందాలు ప్రభుత్వం చేపట్టిన గోథాన్ (గోశాల) ప్రాజెక్టులో భాగస్వామ్యులయ్యారు. దీనిలో భాగంగా ఆవు పేడతో ఎరువులు, గోబర్ గ్యాస్ వంటివి తయారు చేసేవారు. ఈ బృందంలోని కొందరు మహిళలు ఈ ఏడాది ఆవు పేడతో ప్రమిదలు చేస్తే పర్యావరణానికి మేలని భావించి తయారు చేయడం మొదలు పెట్టారు. ఆ ప్రమిదలకు కంటికి ఇంపైన రంగులనద్ది నాలుగు నెలల ముందు నుంచే వీటిని మార్కెట్‌లోకి పంపితే అనూహ్య స్పందన వచ్చింది. దీంతో దీపావళి సమయానికి ఆ స్వయం సహాయక బృందాల ఇళ్లలోకి లక్ష్మీదేవి నడిచి వచ్చినట్టయింది.

## మాస్క్‌ల దీపావళి!



దీపావళి అంటే దివ్వెల వెలుగులు, బంగారం జిలుగులు అనే ఇన్నాళ్లూ అనుకున్నాం. కానీ గత రెండు మూడేళ్లుగా మరొకటి కూడా ఈ జాబితాలో చేరింది. అవే మాస్క్‌లు. దీపావళి సీజన్‌లో ముఖానికి కప్పుకునే మాస్క్‌ల మార్కెట్ బాగా పెరుగుతోంది. టపాసుల్ని కాల్చకుండా ఉండలేరు. అలాగని వాటి నుంచి వచ్చే కాలుష్యాన్ని భరించడం కష్టం. అందుకే బెంగళూరు, చెన్నై, కోల్‌కతా వంటి నగరాల్లో మాస్క్‌లకు డిమాండ్ బాగా పెరుగుతోంది. గాలిని శుద్ధి చేసే ఎయిర్ బ్యాగ్స్ వాడకం అధికమైంది. ఏడాదికి రూ.12–15 కోట్ల వరకు వ్యాపారం జరుగుతోంది. వీటితో పాటు ఢిల్లీలో నాజల్ ఫిల్టర్లను కూడా విక్రయిస్తున్నారు. మాస్క్‌లను ఏదో సాదాసీదాగా తయారు చేయకుండా వాటికి ఫ్యాషన్ హంగుల్ని సమకూర్చారు. దీపావళి సీజన్‌లో ఈ మాస్క్‌లకి, నాజల్ ఫిల్టర్లకి డిమాండ్ గత రెండేళ్లతో పోలిస్తే 70–140 శాతానికి పెరిగినట్టు తయారీ సంస్థలు వెల్లడించాయి. అమెజాన్, స్నాప్‌డీల్ తదితర వాటిల్లో కూడా వీటి బుకింగ్‌లు విపరీతంగా పెరిగాయి. ఒకప్పుడు ఢిల్లీకి మాత్రమే పరిమితమైన ఈ మాస్క్‌ల సంస్కృతి దేశవ్యాప్తంగా 100కి పైగా పట్టణాలకు విస్తరించింది. టపాసుల కాలుష్యం నుంచి కాపాడుకోవాలనే వారు ఈ మాస్క్‌లు ధరిస్తేనే మంచిది.

## ఆయురారోగ్యమస్తు!

### గవర్నర్ దీపావళి శుభాకాంక్షలు



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పర్వదినాన్ని జరుపుకుంటారన్నారు. ఆధునిక కాలపు చెడులను జయించడానికి, శాంతి, సౌభ్రాతృత్వం, సామరస్యం ప్రబలంగా ఉన్న సమాజ నిర్మాణానికి ఇలాంటి పండుగలు స్ఫూర్తినిస్తాయని తన సందేశంలో గవర్నర్ తెలిపారు.

## సుఖసంతోషాలు నింపాలి: సీఎం



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వెలుగుల పండుగ రాష్ట్ర ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు, శాంతి, శ్రేయస్సు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

## ప్రతి ఇంటా ఆనందాల దీపాలు వెలగాలి

### ఏపీ సీఎం వైఎస్ జగన్ దీపావళి శుభాకాంక్షలు



**సాక్షి, అమరావతి:** వెలుగుల పండుగ అయిన దీపావళి తెలుగు వారి జీవితాల్లో వేల కాంతులు నింపాలని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. చీకటి మీద వెలుగు, చెడు మీద మంచి, దుష్ట శక్తుల మీద దైవశక్తి సాధించిన విజయాలకు దీపావళి ప్రతీక అని పేర్కొన్నారు. తెలుగు ప్రజలందరికీ శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు కలగాలని, ప్రతి ఇంటా కోటి ఆనందాల దీపాలు వెలగాలని అభిలషించారు.

## చీకట్లు తొలగాలి: కిషన్‌రెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి జీవితాల్లో ఈ దీపావళి వెలుగులు నింపాలని, వారు తమ వృత్తి, వ్యాపారాల్లో విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రజల జీవితాల్లో కష్టాల చీకట్లు తొలగి, సుఖసంతోషాలతో కూడిన దీపాల వెలుగు రావాలని ఆశిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ పేర్కొన్నారు.

## కొడంగల్‌కు ఎన్ని నిధులిచ్చారు?: రేవంత్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** హుజూర్‌నగర్‌లో గెలిస్తే ఎక్కువ నిధులు కేటాయిస్తానని చెప్పిన టీఆర్ఎస్ మరి కొడంగల్‌లో గెలిచిన తర్వాత ఇప్పటి వరకు ఎన్ని నిధులు కేటాయించిందో చెప్పాలని మల్కాజిగిరి ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌ల ప్రచారం లేకుండానే సైదిరెడ్డి గెలిచాడంటే ఇది తెరాసకు సంబంధం లేదని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినప్పుడు విలువలేదన్న టీఆర్ఎస్‌కు ఇప్పుడు హుజూర్‌నగర్‌లో గెలవగానే విలువొచ్చిందా అని ప్రశ్నించారు. సంక్షేమం ముసుగులో ప్రజల స్వేచ్ఛను లాక్కుంటున్నారని ఆరోపించారు.

# హోరెత్తిన ధర్నాలు

- కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్న కార్మికులు
- సీఎం వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికులు శనివారం రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలతో హోరెత్తించారు. కుటుంబ సభ్యులతో కలసి డిపోల ఎదుట ధర్నాలు చేపట్టారు. చర్చలు జరుగుతాయన్న సమాచారం ఉన్నా సమ్మె మాత్రం ఉధృతంగా కొనసాగింది. ఈనెల 30న సరూర్‌నగర్‌లో సకల జనుల సమరభేరి పేరుతో భారీ ఎత్తున సభ నిర్వహించాలని నిర్ణయించినందున అందుకు జనసమీకరణ కసరత్తు కూడా ప్రారంభించారు. సమ్మెలో ఉన్న కార్మికులు కుటుంబసభ్యులతో కలసి ఆ సభకు హాజరు కావాలంటూ ఎవరికివారు ప్రచారం చేస్తున్నారు. స్థానిక విపక్ష నేతలను కలిసి ఆయా పార్టీల కార్యకర్తలు, సాధారణ జనం కూడా సభకు తరలాలని కోరుతున్నారు. ఆదివారం దీపావళి పండుగ కావటంతో సొంతూళ్లకు వెళ్లేవారితో శనివారం బస్టాండ్లు కిటకిటలాడాయి. తాత్కాలిక డ్రైవర్లతో బస్సులను తిప్పినా అవి సరిపోక జనం ఇబ్బంది పడాల్సి వచ్చింది.

**పండుగకు బస్సు కష్టాలు..**

దసరా సమయంలో సొంతూళ్లకు వెళ్లేందుకు నానా తిప్పలు పడ్డ అనుభవంతో కొందరు ప్రయాణాలు కూడా మానుకోవటం విశేషం. పండగ రద్దీ నేపథ్యంలో గత 20 రోజుల్లో తొలిసారి శనివారం 75 శాతం బస్సులు తిప్పినట్టు అధికారులు పేర్కొంటున్నారు. కానీ మొత్తం బస్సులు తిప్పినా పండుగ రద్దీ తాకిడికి సరిపోని పరిస్థితి ఉంటుంది. అలాంటిది ఉన్న బస్సుల్లో 75 శాతమే తిప్పటంతో ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. దీంతో ప్రైవేటు వాహనాలకు గిరాకీ పెరిగింది. అధిక చార్జీలు వసూలు చేయటంతో వారి జేబులకు చిల్లి పడింది. దసరా సమయంలో ప్రైవేటు బస్సులు వచ్చినట్టుగానే శనివారం కూడా చాలా బస్టాండ్లలో వీటి హవా కనిపించింది.

**అరగుండు.. అరమీసం..**

ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు డిపోల ఎదుట





ప్రభుత్వ తీరుకు నిరసనగా గులాబీ రంగులో ఉన్న జెండాను తెలుపు రంగులోకి మార్చుకున్న టీఎంయూ

కార్మికులు పిల్లలతో కలిసి ధర్నాలు చేపట్టారు. సీఎం వ్యాఖ్యలను నిరసిస్తూ వారు చెవుల్లో పూలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఖమ్మం బస్ డిపో వద్ద కార్మికుల నిరసనకు సంఘీభావం వ్యక్తం చేస్తూ అఖిలపక్ష నేతలు చెవిలో పూలతో పాల్గొన్నారు. కార్మికులకు మద్దతుగా వామపక్ష విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. మెట్‌పల్లి డిపో వద్ద సమ్మయ్య, జేఆర్‌రావు అనే డ్రైవర్లు అరగుండు, అరమీసంతో నిరసన చేపట్టారు. మంథనిలో కార్మికుల కుటుంబ సభ్యుల నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. కాగా, శనివారం 4782 ఆర్టీసీ బస్సులు, 1944 అద్దె బస్సులు మొత్తం 6,726 బస్సు లు తిప్పినట్టు అధికారులు ప్రకటించారు. 4782 ప్రైవేటు డ్రైవర్లు, 6726 మంది కండక్టర్లు విధుల్లో ఉన్నట్టు వెల్లడించారు. 4961 బస్సుల్లో టికెట్ జారీ యంత్రాలు, 939 బస్సుల్లో సంప్రదాయ పద్ధతిలో టికెట్ల జారీ జరిగిందని పేర్కొన్నారు.

### బస్సుల కోసం 22 వేల దరఖాస్తులు

తాజాగా అద్దె బస్సుల కోసం పిలిచిన టెండర్లకు అనూహ్య స్పందన లభించింది. రాష్ట్రవ్యాప్తంగా 1,248 బస్సుల కోసం మూడు రోజుల క్రితం టెండర్లు పిలిచారు. టెండరు పత్రాల దాఖలు శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సాగింది. ఇందులో ఏకంగా 22,300 దరఖాస్తులు రావటం విశేషం. హైదరాబాద్‌లో 248 బస్సులకు టెండర్లు పిలవగా 332 దరఖాస్తులు అందాయి. జిల్లాల్లో వేయి బస్సులకుగాను 22 వేల దరఖాస్తులు వచ్చాయి. వారం క్రితం వేయి బస్సులకు టెండర్లు పిలవగా జిల్లాల్లో 9,700 దరఖాస్తులు రాగా హైదరాబాద్‌లో మాత్రం 18 వచ్చాయి. వచ్చిన దరఖాస్తుల్లో బస్సులు సిద్ధంగా ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తూ వెంటనే అనుమతి పత్రం ఇవ్వనున్నారు. ఆ తర్వాత 48 గంటల్లోనే బస్సు చూపి ఆ వెంటనే నడుపుకొనేందుకు అనుమతిస్తారు. కానీ రెడీగా బస్సులు ఉన్న టెండర్లు కేవలం 90 మాత్రమే అందినట్టు తెలిసింది. బస్సులు లేని వారిని లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. ఎంపికైనవారు 90 రోజుల్లో బస్సులు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.



శనివారం మఖ్దూంభవన్‌లో నిరవధిక దీక్ష చేస్తున్న కూనంనేని సాంబశివరావు

## ఆర్టీసీని ప్రైవేటీకరించే కుట్ర

- వేల కోట్ల ఆస్తుల్ని అనుయాయులకు కట్టబెట్టే యోచన
- సమ్మె పరిష్కారానికి కూనంనేని చేపట్టిన నిరవధిక దీక్షలో సీపీఐనేత సురవరం
- ఉద్యమనేత సీఎం అయ్యాక ఈ పరిస్థితి వస్తుందని ఊహించలేదు: కూనంనేని

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీని ప్రైవేటీకరించి, వేల కోట్ల విలువ చేసే ఆ సంస్థ ఆస్తుల్ని సీఎం కేసీఆర్ తన అనుయాయులకు కట్టబెట్టే కుట్ర చేస్తున్నారని సీపీఐ అగ్రనేత సురవరం సుధాకరరెడ్డి ఆరోపించారు. సీఎం తన వైఖరిని మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్మికులకు న్యాయం జరిగేలా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం మఖ్దూంభవన్‌లో సీపీఐ సహాయకార్యదర్శి కూనంనేని సాంబశివరావు చేపట్టిన నిరవధిక దీక్షను సురవరం ప్రారంభించారు. ఈ సందర్భంగా సురవరం మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోగా ప్రభుత్వం సమ్మె విచ్ఛిన్నానికి, బెదిరింపులకు దిగుతోందని ధ్వజమెత్తారు. దీక్షకు మద్దతుగా పార్టీలోని వివిధ విభాగాలకు చెందిన పశ్యపద్మ, ఉస్తెల సజన, వలీ ఉల్లా ఖాద్రీ, శివరామకృష్ణ, ప్రవీణ్‌కుమార్, కె.రాజేందర్, గోపాల్, సాయిరెడ్డి రిలేదీక్షలు నిర్వహించారు.

**ఉద్యమనేత సీఎంగా ఉన్నా ఈ పరిస్థితా?: కూనంనేని**

కూనంనేని మాట్లాడుతూ.. ఉద్యమనేతగా ఉన్న వ్యక్తి సీఎం అయ్యాక కూడా రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదన్నారు. సమ్మె పరిష్కారమయ్యే వరకు దీక్ష కొనసాగిస్తామన్నారు. సమ్మె విషయంలో ప్రభుత్వం మొండి పట్టుదలతో వ్యవహరిస్తోందని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం విమర్శించారు. దీక్షకు బి.వెంకట్ (సీపీఎం), పల్లా వెంకటరెడ్డి, ఈటీ నర్సింహ, డా.సుధాకర్ (సీపీఐ), థామస్‌రెడ్డి (ఆర్టీసి జేఏసీ), నర్సింహన్(ఐఏటీయూసీ) తదితరులు సంఘీభావం తెలిపారు.

## విఫలం చేసేందుకు కుట్ర

### బీజేపీ అధికార ప్రతినిధి రాకేశ్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** కార్మికుల వల్లే చర్చలు విఫలమయ్యాయని చెప్పడానికి సీఎం కేసీఆర్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి అనుగుల రాకేశ్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం తాము చెప్పిన డిమాండ్లపైనే చర్చ జరపాలనడం పూర్తిగా దుర్మార్గపూరిత చర్య అని, ఈ చర్చలు విఫలమైతే అందుకు ప్రభుత్వానిదే బాధ్యత అని వ్యాఖ్యానించారు. శనివారం ఆయన మీడియాతోమాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై కోర్టులు శిక్షలు వేయకపోయినా ప్రజా కోర్టులో శిక్ష పడుతుందని, కార్మికుల న్యాయమైన డిమాండ్లకు బీజేపీ మద్దతు ఉంటుందని తెలిపారు. ఉప ఎన్నికలో గెలిచిన తర్వాత వేలాది మందిని జమ చేసి అధికార మదంతో సంబరాలు చేసుకుంటున్నారని, గతంలో ఏ పార్టీ ఇంత అట్టహాసంగా జరుపుకోలేదని ధ్వజమెత్తారు. 'ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా, కార్మికులు గుండెపోటుతో మరణించినందుకా, 28 మంది ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా, సంక్షేమ పథకాలు ఆగిపోతున్నందుకా, రాష్ట్రం దివాళా తీసినందుకా, ఉద్యోగస్తులకు జీతాలివ్వలేని పరిస్థితి వచ్చినందుకా?'ఎందుకు సంబురాలు చేసుకుంటున్నారు అని ఎద్దేవాచేశారు. టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనేనని, అధికారపార్టీ అహంకారాన్ని దించడం తమపార్టీకే సాధ్యం అవుతుందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT NO. 42/TUFIDC/Unit-II/Devarakonda/UGD with STP/2019-20, తేది: 28.10.2019 పనిపేరు: దేవరకొండ మున్సిపాలిటీ-TUFIDC రుణసహాయంతో దేవరకొండ మున్సిపాలిటీలోని క్యాచ్‌మెంట్-I లో 3.5 MLD సెవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌తో అండర్ గ్రౌండ్ సెవరేజ్ సిస్టమ్. అంచనా కాంట్రాక్టు విలువ: రూ.17,12,06,889.00, బిడ్ దాఖలు ముగింపు తేది: 14.11.2019న సా.4.30 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ www.tender.telangana.gov.in లో చూడవచ్చును. తదుపరి ఏవైన స్పష్టీకరణలు అవసరమైతే, SE (PH) కార్యాలయం, TUFIDC, యూనిట్-II, నల్లగొండ వారిని కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును. సెల్ నం.9701385146
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (PH), TUFIDC, యూనిట్-II (FAC)
DIPR RO.No.1479-PP/CL/Advt/1/1/2019-20, Dt: 26.10.2019

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ
(రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖ)
బహిరంగ ప్రకటన
భూమి యజమానులు/అందులో ప్రయోజనం గల వ్యక్తులకు (కల్వకుర్తి, మల్లేపల్లి) జాతీయ రహదారులు - 167 వద్ద రెండు లైన్ రోడ్డు వెడల్పు చేయుటకు భూసేకరణ కొరకు అవార్డు ప్రకటన మరియు నష్టపరిహారం మొత్తం చెల్లింపు
రెండు లైన్ రోడ్డు వెడల్పు చేయుటకు భూసేకరణ కొరకు NH చట్టం 1956 లోని సెక్షన్ 3A క్రింద జారీచేయబడిన ప్రకటన నం. S.O.No.3738 (E) తేది: 30.07.2018 మరియు దిగువ వార్తా పత్రికలలో ప్రచురించబడిన మరియు NH చట్టం, 1956 లోని సెక్షన్ 3D క్రింద జారీచేయబడిన ప్రకటన S.O.5459 (E) తేది: 26.10.2018 ని గమనించవలసిందిగా భూమి యజమానులను/ ప్రయోజనం గల వ్యక్తులను కోరడమైనది.

| క్ర. సం. | ప్రకటన | ప్రచురించబడిన వార్తాపత్రిక పేరు | వార్తాపత్రిక తేది |
|---|---|---|---|
| 1. | సెక్షన్ 3A | సాక్షి (తెలుగు దినపత్రిక)<br>ది హిందూ (ఇంగ్లీష్ దినపత్రిక) | 26.08.2018<br>26.08.2019 |
| 2. | సెక్షన్ 3D | | 26.10.2018 |
| 3. | సెక్షన్ 3G | నమస్తే తెలంగాణ తెలుగు<br>డెక్కన్ క్రానికల్ ఇంగ్లీష్ | 17.01.2019<br>17.01.2019 |

చారకొండ మండలంలోని చారకొండ గ్రామం మరియు కల్వకుర్తి మండలంలోని తాండ్ర గ్రామం కోసం ఆర్డర్ నం. E/423/2018 తేది: 30.04.2019 ప్రకారం NH చట్టం, 1956 లోని సెక్షన్ 3జి క్రింద సదరు భూమికి సంబంధించి దిగువ సంతకందారు అవార్డు ప్రకటించారని ఇందుమూలంగా తెలియచేయడమైనది.
భూసేకరణ ఏజెన్సీ (MoRTH) దిగువ సంతకందారు వినియోగం నిమిత్తం అవసరమైన పరిహారం మొత్తాన్ని ఉంచింది. NH చట్టం,1956 లోని సెక్షన్ 3ఇ క్రింద అవసరమైన విధంగా సంబంధించిన భూమి యజమానులకు/ ప్రయోజనం గల వ్యక్తులకు కూడా నోటీసులు జారీచేయబడినవి.
ఆ ప్రకారం, పరిహార మొత్తం భూమి యజమానులందరికీ ఇవ్వబడుతోందని ఈ అదనపు బహిరంగ ప్రకటన ద్వారా సంబంధిత భూమి యజమానులకు/ ప్రయోజనం గల వ్యక్తులందరికీ ఇందుమూలంగా తెలియచేయడమైనది. తదుపరి దిగువ విధంగా గమనించవలెను:
తమ బ్యాంకు ఖాతా వివరాలను ఇప్పటికే దాఖలు చేసిన అట్టి భూమి యజమానులకు సంబంధించిన పరిహార మొత్తం RTGS ద్వారా సంబంధిత బ్యాంక్ ఖాతాలకు క్రెడిట్ చేయబడుతోంది ;
తమ బ్యాంక్ ఖాతా వివరాలను దాఖలు చేయని భూమి యజమానులు దిగువ సంతకందారు కార్యాలయంలో వెంటనే దాఖలు చేయాలి మరియు అట్టి బ్యాంక్ ఖాతా వివరాలు స్వీకరించిన ఒక వారం రోజుల లోగా వారి ఖాతాలకు సదరు మొత్తం జమచేయబడుతుంది.
పరిహారమొత్తం స్వీకరించడానికి హక్కు గల ఇతర క్లెయిమ్‌దారులందరూ తమ పరిహార మొత్తాన్ని దిగువ సంతకందారు కార్యాలయం నుండి 60 రోజుల కాలం లోగా ఏ పనిరోజునైనా ఉ.11 గం. నుండి సా.5 గం. మధ్య తీసుకోవచ్చును.
పరిహార మొత్తం సంబంధిత భూమి యజమానులకు/ అందులో ప్రయోజనం గల వ్యక్తులకు ఈ అదనపు బహిరంగ ప్రకటన ద్వారా నిర్ధారించబడిందని మరియు చెల్లించబడిందని తదుపరి గమనించవలెను, పరిహార మొత్తం తీసుకొనుటలో విఫలమైతే దానికి వారిదే బాధ్యత అవుతుంది మరియు ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుంచి 60 రోజుల కాలం ముగిసిన తరువాత సదరు మొత్తం చెల్లించబడినట్లుగా భావించబడుతుంది.
భూమి యజమానులు/ అందులో ప్రయోజనం గల వ్యక్తులు పైన తెలిపిన సదరు భూమిని దిగువ సంతకందారుకు అప్పగించవలసిందిగా లేదా స్వాధీనం చేయవలసిందిగా తదుపరి కోరడమైనది, లేనట్లయితే పైన తెలిపిన సదరు భూమి 60 రోజుల కాలం పూర్తి అయిన తరువాత పోలీస్ సహాయంతో తీసుకోబడుతుంది.
సం/-
భూ సేకరణకు సమర్థ ప్రాధికారి,
రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, కల్వకుర్తి

తెలంగాణ ప్రభుత్వం
డైరెక్టర్ కార్యాలయం, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, మహబూబ్‌నగర్
నోటిఫికేషన్ నం. 04/2019 తేది : 25.10.2019
గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ / గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, మహబూబ్‌నగర్‌లో పనిచేయుటకు కాంట్రాక్ట్ ప్రాతిపదికపై 01 (ఒక) సంవత్సర కాలానికి సీనియర్ రెసిడెంట్స్ (SR) మరియు జూనియర్ రెసిడెంట్స్ (JR) ఖాళీలను భర్తీ చేయుటకు దిగువ సంతకందారు ప్రకటన జారీ చేశారు. అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులను పూర్తి చేసి అన్ని డాక్యుమెంట్ల జిరాక్స్ కాపీలతో సహా డైరెక్టర్ కార్యాలయం, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, మహబూబ్‌నగర్‌లో షెడ్యూల్ సమయంలోగా మాత్రమే నేరుగా లేదా పోస్టు ద్వారా దాఖలు చేయవలెను. ఉద్యోగాల సంఖ్య, అర్హతా ప్రమాణాలు, దరఖాస్తు ఫారం వివరాలు మరియు ఇతర వివరాలను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, తెలంగాణ వెబ్‌సైట్:www.dme.telangana.gov.in మరియు గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, మహబూబ్‌నగర్ వెబ్‌సైట్ http://gmcmbnr-ts.org డిస్ట్రిక్ట్ కలెక్టర్, మహబూబ్‌నగర్ వెబ్‌సైట్ (https://mahabubnagar.nic.in) నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సం/- డైరెక్టర్, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ / గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, మహబూబ్‌నగర్
DIPR Ro. No. 1481-DP/CL/ADVT/1/2019-20, Dt: 26-10-2019

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్ కార్యాలయం, PIU యాదాద్రి భువనగిరి
NIT No.HD/4/2019-20, సంక్షిప్త టెండరు ప్రకటన తేది: 23.10.2019
పనుల సంఖ్య: (6), పనిపేరు: దిగువ సంతకందారు గ్రామాలు మరియు మండలాల్లో ZPP భవనంకు ఇతర సదుపాయాల నిర్మాణం, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయుట, అదనపు తరగతి గదుల నిర్మాణం మరియు ఇతర సివిల్ పనులు. మొత్తం ECV: రూ.43.6 లక్షలు. దరఖాస్తు స్వీకరణకు చివరి తేది: 01.11.2019న సా.5.00 గం. వరకు. టెండర్ షెడ్యూల్ జారీ: 02.11.2019న సా.5.00 గం. వరకు. టెండర్ల స్వీకరణ తేది: 04.11.2019న మ.3.00 గం. వరకు. టెండర్లు తెరుచు తేది: 04.11.2019న మ.3.30 గం.కు
సం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్, PIU యాదాద్రి భువనగిరి
DIPR RO. No.1490-DP/CL/ADVT/1/2019-20, Dt: 26.10.2019

తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ & వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ :: హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
Tender Notice No. SE/TSEWIDC/HYD/NIT/457 to 526/2019-20 తేది: 25.10.2019
తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్ళు 6 నం.లు (రూ. 2000.00/ప్రతిదానికి), మైనారిటీ స్కూళ్ళకు బాలికల హాస్టళ్ళు 2 నం.లు (రూ. 210.00/ప్రతిదానికి), KGBV లు 54 నం.లు (రూ. 205.00/ప్రతిదానికి), MPUPS (రూ. 240.00), EGMM భవనము (రూ. 175.00), TSWRSC (రూ. 167.00) (1వ పిలుపు), TSWRS పనులు, కమ్యూనిటీ హాళ్ళు, KGBV నూతన భవనము/స్థాయి పెంపుదల, GH భవనముల మిగిలిన పని (రూ. 54.00 నుండి రూ. 345.20 వరకు) (2వ, 5వ, 6వ మరియు 7వ పిలుపు) నిర్మాణము కొరకు అర్హత గల కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుచున్నవి. ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలుకు, స్వీకరించుటకు ఆఖరు తేది: 16.11.2019 సా. 04.00 గం. వరకు. 2 పనులు SC/ST కమ్యూనిటీలకు మాత్రమే రిజర్వు చేయబడినవి. గమనిక: స్టీల్ & సిమెంట్ కోసం మాత్రమే G.O.Ms. No. 94 ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్, రోడ్స్ & బిల్డింగ్స్ (R.1) Dept. తేది: 16.04.08 ప్రకారం ధర సర్దుబాటు వర్తించును. పూర్తి వివరాల కోసం https://tender.telangana.gov.in లో చూడండి లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, TSEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ బిల్డింగ్, SCERT కాంపౌండ్, ఇ-గేట్ ఎదురుగా, LBస్టేడియం, హైదరాబాద్ వద్ద స్వయంగా సంప్రదించగలరు. ఫోన్ నం.: 23326692.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, TSEWIDC, హైదరాబాద్
DIPR.Ro.No. 443-PP/CL/ADVT/1/2019-20, Dt 26/10/2019

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
NOTICE
On administrative grounds, the tender notice, vide No. 27/2019-20/SE(Mech)/EE(Mech), dated 07.10.2019 is cancelled
AMENDMENT
On administrative grounds, the tender dates are Amended as follow vide Tender Notice No.28/2019-20/SE(Mech)/EE(Mech), dated 07.10.2019

| | FOR | READ AS |
|---|---|---|
| Number of works | 2 Nos. | 2 Nos. |
| Estimate cost value | Rs. 353.64 Lakhs | Rs. 353.64 Lakhs |
| Download starting date & Time | 14.10.2019 @ 02.00 PM | 29.10.2019 @ 02.00 PM |
| Download Ending date & Time | 28.10.2019 @ 02.00 PM | 13.11.2019 @ 02.00 PM |
| Last date of submission of Bid | 28.10.2019 @ 03.00 PM | 13.11.2019 @ 03.00 PM |
| Date of opening of Tenders (Technical Bid) | 28.10.2019 @ 03.30 PM | 13.11.2019 @ 03.30 PM |
| Date of opening of Tenders (Price Bid) | 31.10.2019 @ 04.00 PM | 16.11.2019 @ 04.00 PM |

For Commissioner, S.E.(Mech)

# నగరాలు.. రోగాల అడ్డాలు

- ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన
- కాలుష్యంతో శ్వాసకోశ వ్యాధులు
- ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లతో అనారోగ్యకర ఆహారం
- బీపీ, షుగర్ వంటి జబ్బులతో ప్రజలు సతమతం
- అధిక ట్రాఫిక్‌తో సమస్యలు... పెరుగుతున్న మరణాలు
- ఆరోగ్యకరమైన నగర జీవనానికి పలు సూచనలు



**సాక్షి, హైదరాబాద్:** పట్టణాలు, నగరాలు అనారోగ్యంతో కునారిల్లుతున్నాయి. ట్రాఫిక్ మొదలుకొని ఫాస్ట్‌ఫుడ్ వరకు అనేక అంశాలు ఆరోగ్యంపై చూపెడుతున్న ప్రభావాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. నగర జీవనశైలి వ్యాధులకు నిలయంగా మారుతోందని పేర్కొంది. 'ఆరోగ్య నగరాలను ఎలా తయారు చేయాలి'అనే అంశంపై ఇటీవల ఒక నివేదిక తయారు చేసింది. ట్రాఫిక్ రద్దీ, మద్యం తాగి వాహనాలు నడపడం, సీటు బెల్టు, హెల్మెట్ ధరించకపోవడం, ఫలితంగా రోడ్డు ప్రమాదాలు, అనారోగ్యకరమైన జీవనశైలి, శారీరక వ్యాయామం లేకపోవడం, వృద్ధులను పట్టించుకోకపోవడం ఇలా పలు సమస్యలు నగర జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ విశ్లేషించింది. ఈ పరిస్థితులను మార్చాల్సిన అవసరాన్ని తెలియజెప్పింది. వివిధ అంశాలపై విశ్లేషణ చేసింది.

**ట్రాఫిక్ రద్దీ...**

నగరాలు, పట్టణాల్లో రహదారులు దారుణంగా ఉంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ట్రాఫిక్ సరిగా లేకపోవడం, రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రతి ఏడాది 5–29 సంవత్సరాల వయస్సు గలవారు 10 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోతున్నారు. 5 కోట్ల మంది వరకు గాయపడుతున్నారు. ఇది అభివృద్ధి చెందుతున్న దేశాల అభివృద్ధిపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. హెల్మెట్లు, సీట్ బెల్ట్‌ల వాడకాన్ని ప్రభుత్వం ప్రోత్సహించాలి. రహదారులను మరింత సురక్షితంగా మార్చడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రభుత్వ సంస్థలతో కలిసి పనిచేయాలని నిర్ణయించింది.

**కలుషితమైన గాలి పీల్చుతున్నారు..**

నగరాల్లో గాలి నాణ్యత తగ్గింది. ప్రతీ పది మందిలో తొమ్మిది మంది ప్రతిరోజూ కలుషితమైన గాలిని పీల్చుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. వాయు కాలుష్యంతో గుండె, శ్వాసకోశ వ్యాధులు, ఉబ్బసం, ఊపిరితిత్తుల కేన్సర్‌కు దారితీస్తుంది.

**మానసిక అనారోగ్యం...**

మరోవైపు పేదరికం, నిరుద్యోగం, ట్రాఫిక్, శబ్ద కాలుష్యం, మౌలిక సదుపాయాలు, పచ్చని ప్రదేశాలు లేకపోవడం పట్టణవాసులు ఎదుర్కొంటున్న మరికొన్ని అడ్డంకులు. ఈ సమస్యలన్నీ మానసిక అనారోగ్యాన్ని సృష్టిస్తున్నాయి. ప్రపంచ జనాభాలో సగానికి పైగా ఇప్పుడు నగరాలు, పట్టణాల్లో నివసిస్తున్నారు. దీంతో రద్దీ అధికంగా ఉంటుంది. శబ్ద కాలుష్యం, దీర్ఘకాలిక ఒత్తిడి కలిపి సామాజిక ఒంటరితనానికి దారితీస్తాయి.

**పెరుగుతున్న పట్టణ హింస...**

పట్టణాలు, నగరాల్లో హింస పెచ్చుమీరుతోంది. 15–44 ఏళ్ల మధ్య వయస్సు వారు అధికంగా హింసకు పాల్పడుతున్నారు. లైంగిక వేధింపులతో సహా ప్రాణాంతకమైన హింసతో ప్రతి సంవత్సరం పది లక్షల మంది గాయపడుతున్నారు. వేలాది మంది హత్యకు గురవుతున్నారు. అధిక జనాభా సాంద్రత ఉన్న నగరాల్లో హింస ఎక్కువగా కనిపిస్తోంది.

**అనారోగ్యకరమైన ఆహారం...**

అధిక కొవ్వు, ఉప్పు, చక్కెర అధికంగా ఉన్న ఆహారం, పానీయాలను అందించే అనేక ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు నగర ఆరోగ్యానికి సవాల్‌గా మారింది. ఆహార పదార్థాల మార్కెటింగ్ ముఖ్యంగా పిల్లలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. బయటి ఆహారానికి ప్రజలు అలవాటు పడుతున్న కారణంగా నగరాల్లో బీపీ, షుగర్, ఊబకాయం వంటివి అధికంగా తలెత్తుతున్నాయి.

**కొరవడుతున్న శారీరక శ్రమ...**

గుండె జబ్బులు, డయాబెటిస్, బీపీ, కొన్ని కేన్సర్లను నివారించడంలో శారీరక శ్రమ సాయపడుతుంది. ఊబకాయాన్ని నివారించడంలో తోడ్పడుతుంది. వ్యాయామం చేయడానికి బహిరంగ, పచ్చని ప్రదేశాలు లేకపోవడంతో అనేకమంది శారీరక శ్రమకు దూరంగా ఉంటున్నారు. ఈ పరిస్థితి నగర పౌరులను అనారోగ్యంగా మార్చుతున్నాయి.

**వృద్ధులకు వసతులు...**

ప్రపంచవ్యాప్తంగా 60 ఏళ్ల అంతకంటే ఎక్కువ వయసున్న వారి సంఖ్య ఇతర వయసుల వారికంటే వేగంగా పెరుగుతోంది. పెరుగుతున్న వృద్ధుల జనాభా అవసరాలకు అనుగుణంగా నగర నిర్మాణాలుండాలి. పిల్లలు దూరంగా వెళ్లిపోవడం, భాగస్వామి చనిపోవడంతో వృద్ధులు ఒంటరితనానికి గురవుతున్నారు. సామాజిక సంబంధాలు విచ్ఛిన్నం కావడంతో వీరు దుర్భర జీవితం గడుపుతున్నారు. కాబట్టి నగరాల్లో వృద్ధులకు ఆరోగ్య కేంద్రం, సూపర్ మార్కెట్, సమాజ జీవితంలో పాల్గొనడానికి అవకాశం కల్పించాలి.

# ముగిసిన ఎన్నికల కోడ్

### సీఈఓ రజత్‌కుమార్ ప్రకటన

**సాక్షి, హైదరాబాద్:** హుజూర్‌నగర్ శాసనసభ ఉప ఎన్నిక ఫలితాలను ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ ముగిసిందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) రజత్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉప ఎన్నిక సందర్భంగా సెప్టెంబర్ 21 నుంచి సూర్యాపేట జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది.

**ఒకట్రెండు రోజుల్లో డీఏ!**

ఎన్నికల కోడ్ ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం (డీఏ) మంజూరు ఉత్తర్వులు ఒకట్రెండు రోజుల్లో జారీ చేసే అవకాశాలున్నాయి. డీఏతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగ సంఘాలకు హామీ ఇచ్చారు.

# సీఎం ఖట్టర్.. డిప్యూటీ దుష్యంత్


గవర్నర్ సత్యదేవ్‌కు లేఖ ఇస్తున్న ఖట్టర్, దుష్యంత్

**హరియాణాలో బీజేపీ, జేజేపీ ఒప్పందం**

- ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానం
- నేడు ప్రమాణస్వీకారం

**చండీగఢ్:** అసెంబ్లీ ఎన్నికల్లో 'హంగ్' ఫలితాల అనంతరం హరియాణాలో రాజకీయ పరిణామాలు వేగంగా మారాయి. జన్‌నాయక్ జనతా పార్టీ (జేజేపీ)తో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు బీజేపీ మొగ్గు చూపడంతో పదవుల పంపిణీలోనూ దాదాపు స్పష్టత వచ్చింది. ముఖ్యమంత్రిగా మనోహర్ లాల్ ఖట్టర్(65) కొనసాగనుండగా, జేజేపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దుష్యంత్ చౌతాలా(31) డిప్యూటీ సీఎం పదవి చేపట్టనున్నారు. ఇటీవలి ఎన్నికల ఫలితాల్లో అసెంబ్లీలోని 90 స్థానాలకు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 46 స్థానాలను ఏ పార్టీ సాధించలేకపోయింది. ప్రధాన పార్టీలైన బీజేపీ 40, కాంగ్రెస్ 31, జేజేపీ 10 సీట్లు గెల్చాయి. ప్రజాతీర్పును జేజేపీ గౌరవించడం లేదంటూ కాంగ్రెస్ చేస్తున్న విమర్శలపై ఆయన..'ప్రజాతీర్పు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగానే ఉంది. అయినా, ఈ ఎన్నికల్లో మేం కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేయలేదు కదా?' అని ప్రశ్నించారు.

### గవర్నర్‌ను కలిసిన నేతలు

బీజేపీకి చెందిన సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ శనివారం గవర్నర్ సత్యదేవ్ నారాయణ్ ఆర్యను కలిసి తనతోపాటు మంత్రివర్గ సహచరులు సమర్పించిన రాజీనామా పత్రాలను అందజేశారు. రాజీనామాలను ఆమోదించిన గవర్నర్ కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలని కోరారు. దీంతోపాటు తమకు మెజారిటీ సభ్యుల మద్దతున్నందున ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలంటూ ఖట్టర్ చేసిన వినతిని కూడా ఆయన అంగీకరించారు. అనంతరం సీఎం ఖట్టర్ మీడియాతో మాట్లాడుతూ.. దీపావళి పండుగ రోజు ఆదివారం మధ్యాహ్నం 2.14 గంటలకు హరియాణా రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. తనతోపాటు డిప్యూటీ సీఎంగా దుష్యంత్, కొందరు మంత్రులు కూడా ప్రమాణం చేస్తారన్నారు. జేజేపీ, స్వతంత్రులు, ఇతరుల మద్దతుతో 90 సీట్లున్న అసెంబ్లీలో తమ బలం 57కు పెరగనుందని ఆయన చెప్పారు. ఖట్టర్ వెంట వెళ్లిన జేజేపీ నేత దుష్యంత్ చౌతాలా, స్వతంత్రులు కూడా గవర్నర్‌కు బీజేపీకి మద్దతు తెలుపుతున్నట్లు లేఖలను అందజేశారు.

### గోపాల్ కందా మద్దతు తీసుకోం

అంతకుముందు ప్రభుత్వ అతిథిగృహంలో జరిగిన బీజేపీ శాసనసభాపక్షం సమావేశం తమ నేతగా ఖట్టర్‌ను ఎన్నుకుంది. ఈ భేటీకి పార్టీ కేంద్ర పరిశీలకులుగా కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్, పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ హాజరయ్యారు. సీఎం పదవికి ఖట్టర్ పేరును ఎమ్మెల్యేలు అనిల్ విజ్, కన్వర్ పాల్ ప్రతిపాదించగా మిగతా వారు ఆమోదం తెలిపారని సమావేశం అనంతరం రవి శంకర్ ప్రసాద్ వెల్లడించారు. ఖట్టర్ మంత్రి వర్గంలో ఒక్కరే డిప్యూటీ సీఎం ఉంటారని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఏర్పాటులో వివాదాస్పద ఎమ్మెల్యే గోపాల్ కందా మద్దతు తాము తీసుకోవడం లేదని ఆయన వెల్లడించారు.

## దుష్యంత్ తండ్రి జైలు నుంచి బయటకు

చౌతాలా కుటుంబంలో విభేదాలు రావడంతో ఐఎన్‌ఎల్‌డీ పార్టీ నుంచి బయటకు వచ్చిన దుష్యంత్ గత ఏడాదే జేజేపీని స్థాపించారు. ఆయన తల్లి నైనా ఈ ఎన్నికల్లో బద్రా నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. మాజీ ఉప ప్రధాని చౌధరి దేవీలాల్ మునిమనవడు, మాజీ సీఎం ఓం ప్రకాశ్ చౌతాలా మనవడే దుష్యంత్. అధికారంలో ఉండగా ఉపాధ్యాయుల నియామకంలో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఓం ప్రకాశ్‌తోపాటు ఆయన తనయుడు, దుష్యంత్ తండ్రి అయిన అజయ్ చౌతాలా ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో సిర్సా, హిసార్‌లలో ఉన్న దుష్యంత్ చౌతాలా నివాసాల వద్ద భద్రతను పెంచారు. అంతేకాకుండా, ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న దుష్యంత్ తండ్రి అజయ్ చౌతాలా ఆదివారం నుంచి రెండు వారాలపాటు బయట గడిపేందుకు ఖైదీలకిచ్చే సెలవులాంటి వెసులుబాటు(ఫర్లో)ను అధికారులు కల్పించారు.




**భారీ ప్రమిద**


గువాహటిలో 200 లీటర్ల సామర్థ్యమున్న భారీ ప్రమిదను వెలిగించిన దృశ్యం. దీని ఎత్తు రెండు అడుగులుకాగా, వ్యాసం 8 అడుగులు.

# రాసిస్తేనే మద్దతిస్తాం

- ఆదిత్య ఠాక్రేకు సీఎం పదవి
- మంత్రివర్గంలో సమాన వాటా
- బీజేపీ లిఖితపూర్వక హామీకి శివసేన పట్టు
- వేరే మార్గాలున్నాయని హెచ్చరిక
- సీఎం పీఠం తమదేనంటున్న బీజేపీ



**సాక్షి ముంబై:** మరాఠా రాజకీయం వేడెక్కుతోంది. సంకీర్ణంలో పదవుల పంపకంపై శివసేన పట్టు బిగించింది. ముఖ్యమంత్రి పదవి ఆదిత్య ఠాక్రేకు ఇవ్వడంతోపాటు మంత్రి పదవుల్లో సమాన వాటా కల్పిస్తామంటూ లిఖిత పూర్వక హామీ ఇవ్వాలంటూ బీజేపీపై ఒత్తిడి తెస్తోంది. ఇటీవలి ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలతో శనివారం తన నివాసం మాతోశ్రీలో శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే భేటీ అయ్యారు. సమావేశం అనంతరం శివసేన ఎమ్మెల్యే ప్రతాప్ సర్నాయక్ మీడియాతో మాట్లాడుతూ.. 'మా పార్టీ ఎమ్మెల్యేలంతా రెండున్నరేళ్ల ముఖ్యమంత్రితోపాటు ఇతర మంత్రి పదవుల్లో సమాన వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు, యువసేన చీఫ్, ఎమ్మెల్యే ఆదిత్య ఠాక్రే(29)కు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ఈ విషయంలో లిఖిత పూర్వకంగా బీజేపీ హామీ ఇచ్చేదాకా ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని తెలిపారు'అని వెల్లడించారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే సమాన వాటా ఇస్తామంటూ లోక్‌సభ ఎన్నికల సమయంలో ఉద్ధవ్ ఠాక్రేకు ఇచ్చిన హామీని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా నెరవేర్చాల్సిందేనని పట్టుబట్టారన్నారు. బీజేపీ, శివసేన హిందుత్వకు కట్టుబడి ఉన్నాయని, అందుకే ప్రత్యామ్నాయాలున్నా వాటిపై ఆసక్తి లేదని ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారని సర్నాయక్ తెలిపారు.

### సీఎం పదవి మాదే: బీజేపీ ఇన్‌చార్జి సరోజ్ పాండే

మహారాష్ట్రలో ముఖ్యమంత్రి పీఠం తమ పార్టీదేనని బీజేపీ మహారాష్ట్ర ఇన్‌చార్జి సరోజ్ పాండే స్పష్టం చేశారు. మహారాష్ట్రలో బీజేపీ ఊహించిన దానికంటే 17 సీట్లు తగ్గినా 105 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. మిత్రపక్షమైన శివసేనకు కూడా ఏడు సీట్లు తగ్గి, 56 సీట్లు గెలుచుకుందని తెలిపారు. దీపావళి తర్వాత ప్రభుత్వ ఏర్పాటుపై ఉద్ధవ్‌తో సీఎం ఫడ్నవిస్ చర్చలు జరుపుతారని కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత రావుసాహెచ్ దన్వే వెల్లడించారు. బీజేపీ ఎమ్మెల్యేలంతా ఈ నెల 30న సమావేశమై శాసనసభా పక్షం నేతను ఎన్నుకోనున్నారు. సీఎం ఫడ్నవిస్ స్వతంత్రులు, చిన్న పార్టీలకు చెందిన 15 మంది ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

### మేం ప్రతిపక్షంలోనే: పవార్

ప్రభుత్వం ఏర్పాటులో శివసేనకు ఎన్‌సీపీ మద్దతిస్తుందంటూ వస్తున్న వార్తలపై ఆ పార్టీ చీఫ్ శరద్ పవార్ స్పందించారు. 'మేం ప్రతిపక్షంలో ఉండాలని ప్రజలు తీర్పునిచ్చారు. ఆ తీర్పును పాటిస్తాం'అని పేర్కొన్నారు. 'ప్రతిపక్షంగా ఉండాలనే ప్రజల నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. ప్రజాతీర్పు బీజేపీకి వ్యతిరేకంగా ఉంది. బీజేపీకి వ్యతిరేకంగా ఏకమవ్వాలనుకుంటే శివసేననే ముందుగా స్పందించాలి'అని కాంగ్రెస్ సీనియర్ నేత విజయ్ వడెత్తివార్ అన్నారు. మహారాష్ట్రలో బీజేపీని అధికా రం నుంచి తప్పించేందుకు అవసరమైన అన్ని మార్గాలను అన్వేషిస్తామని మాజీ సీఎంలు చవాన్, పృథ్వీరాజ్ తెలిపారు.

## 18 కిలోమీటర్ల సాష్టాంగ నమస్కారాలు



**సాక్షి, ముంబై:** తన ప్రియతమ నాయకుడు గెలిచాడని బాపు జావీర్ అనే కార్యకర్త ఏకంగా 18 కిలోమీటర్లు సాష్టాంగ నమస్కారాలు చేపట్టి మొక్కు తీర్చుకున్నారు. షోలాపూర్ జిల్లా సాంగోలా అసెంబ్లీ నియోజకవర్గంలో శివసేన అభ్యర్థి శహాజీ బాపు పాటిల్ విజయం సాధించారు. పాటిల్ విజయం కోసం సాంగోలా బాపు జావీర్ తనవంతు కృషి చేశారు. పాటిల్ విజయం సాధిస్తే స్వగ్రామం సుపాలే నుంచి పండర్‌పూర్ వరకు సాష్టాంగ నమస్కారాలు చేసి విఠలేషున్ని దర్శించుకుంటానని జావీర్ మొక్కుకున్నాడు. పాటిల్ గెల్చిన విషయం తెల్సి.. జావీర్ సుపాలి గ్రామం నుంచి 18 కిలోమీటర్ల దూరం ఉన్న పండర్పూర్ వరకు సాష్టాంగ నమస్కారాలు పెట్టుకుంటూ వెళ్లాడు. ఎండలో తారు రోడ్డుపై, మట్టి రోడ్డుపై సాష్టాంగ నమస్కారాలు పెట్టిన దృశ్యం వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది.

**క్లుప్తంగా...**

### గెస్ట్‌హౌస్ ఖాళీ చేయండి

**మాజీ ప్రధాని దేవెగౌడను కోరిన కేంద్రం**

**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాని, జేడీ(ఎస్) అధినేత దేవెగౌడకు సంబంధించిన ఢిల్లీలోని రఫీమార్గ్‌లోని అతిథి గృహం (గెస్ట్‌హౌస్) విఠల్ భాయి పటేల్ నివాసాన్ని ఖాళీ చేయాలని కేంద్రం ప్రభుత్వం ఆయనను కోరింది. ఈ బంగ్లాను ఆయన గత కొన్నేళ్లుగా అధికారిక నివాసంగా ఉపయోగించుకుం టున్నారు. విఠల్ భాయి పటేల్ గెస్ట్ హౌస్‌కు బదులుగా ఆయనకు సఫ్దార్జంగ్ లేన్‌లోని బంగ్లాను కేటాయించినట్లు అధికారులు శనివారం మీడియాకు తెలిపారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆయన ఓడిన సంగతి తెలిసిందే. ఇదిలావుండగా గత లోక్‌సభ ముగిసి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ.. సుమారు 25 మంది మాజీ ఎంపీలు తమకు కేటాయించిన బంగ్లాలను ఖాళీ చేయాల్సి ఉంది.

### ఆ ముగ్గురికి భారతరత్న ఇవ్వండి

**న్యూఢిల్లీ:** భారత స్వాతంత్ర్య సమర యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు భారతరత్న పురస్కారాన్ని ప్రదానం చేయాలని కాంగ్రెస్ నేత, ఆనంద్‌పూర్ సాహెబ్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న మనీశ్ తివారీ కోరారు. అంతకన్నా ముందు వారిని 'షహీద్ ఎ ఆజమ్'బిరుదుతో సత్కరించాలని, మొహాలిలోని చండీగఢ్ విమానాశ్రయానికి భగత్‌సింగ్ పేరు పెట్టాలని ఆయన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని తీవ్రంగా ప్రతిఘటించడం ద్వారా ఈ ముగ్గురు వారి కాలంలో ప్రజల్లో దేశభక్తిని ప్రేరేపించారని, ఆ క్రమంలోనే 1931 మార్చి 23వ తేదీన దేశంకోసం ప్రాణాలు అర్పించారని మనీశ్ తివారీ తెలిపారు. వారికి భారతరత్న ప్రకటించడం ద్వారా 124 కోట్ల మంది భారతీయుల మనసు గెలుచుకోవాలని అక్టోబర్ 25న రాసిన లేఖలో కోరారు.

### నిరసనలపై ఇరాక్ ఉక్కుపాదం

**బాగ్దాద్:** ఇరాక్‌లో దేశవ్యాప్తంగా ప్రజలు ప్రభుత్వంపై చేస్తున్న నిరసనలను ప్రభుత్వం సైనిక బలగాలతో అణచే ప్రయత్నం చేస్తోంది. ఈ నిరసనల్లో శుక్రవారానికి 24 మంది మృతి చెందగా, 2 వేల మందికి పైగా గాయాలపాలయ్యారు. శనివారం నిరసనలు భారీ స్థాయిలో జరిగే అవకాశం ఉందని సమాచారం రావడంతో, ఆందోళనలను అణగదొక్కడానికి ప్రభుత్వం భారీగా సైనిక బలగాలను ఉపయోగిస్తోంది. ఇప్పటి వరకూ మరణించిన వారిలో బాగ్దాద్ నగరంలో 8 మంది, మైసన్ ప్రావిన్స్‌లో 6 మంది, ధి ఖర్ ప్రావిన్స్‌లో 6 మంది, బాస్రా, ముతాన్నా ప్రావిన్స్‌లలో 4 మంది చొప్పున ఉన్నారు. నిరుద్యోగం, అవినీతి, ప్రజలకు సేవలు అందించకపోవడం వంటి పలు కారణాలతో ప్రజలు దేశ వ్యాప్తంగా ఆందోళనలకు దిగారు. ఈ ఆందోళనలు శ్రుతి మించాయి. పలు ప్రభుత్వ కార్యాలయాలను ధ్వంసం చేయడానికి ప్రజలు ప్రయత్నిస్తుండడంతో ప్రభుత్వం బలగాలను ప్రయోగించింది. ఈ నేపథ్యంలో బలగాలు రబ్బర్ బుల్లెట్లు, బాష్ప వాయువు, బుల్లెట్లను ప్రయోగించాయి. రహదారులను మూసివేసి భారీగా బలగాలను మోహరించారు. దీంతో కొందరు మరణించగా భారీ స్థాయిలో గాయపడ్డారు.

## జైలు నుంచి వచ్చిన డీకేకు ఘనస్వాగతం



**సాక్షి, బెంగళూరు:** యాభై రోజులపాటు జైల్లో గడిపి తిరిగి బెంగళూరు చేరుకున్న కాంగ్రెస్ మాజీ మంత్రి డీకే శివకుమార్‌కు ఘన స్వాగతం లభించింది. అభిమానులు భారీ సంఖ్యలో చేరుకొని ఆయనకు స్వాగతం పలికారు. మనీ ల్యాండరింగ్ కేసులో ఆయనను ఈడీ అరెస్ట్ చేసి తీహార్ జైల్లో ఉంచిన సంగతి తెలిసిందే. బుధవారం ఆయనకు షరతులతో కూడిన బెయిలు మంజూరైంది. శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆయన బెంగళూరు విమానాశ్రయంలో దిగారు. అక్కడి నుంచి భారీ ర్యాలీ మధ్య నగరంలోని కేపీసీసీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ తాను ఎలాంటి తప్పు చేయలేదన్నారు. సిద్ధరామయ్య, పరమేశ్వర్ తదితరులు ఈ కార్యక్రమానికి రాలేదు.

## వాళ్ల 'ఆటలు' సాగలేదు

**ఓటమి రుచిచూసిన క్రీడాకారులు బబితా ఫొగాట్, యోగేశ్వర్ దత్**


బబితా ఫొగాట్


యోగేశ్వర్ దత్


టిక్‌టాక్ సోనాలి

**న్యూఢిల్లీ:** క్రీడల్లో రాణించిన ప్రముఖులెందరో హరియాణా అసెంబ్లీ ఎన్నికల మైదానంలో తెల్లమొఖం వేశారు. అంతర్జాతీయ మల్లయోధులు మొదలుకొని, టిక్‌టాక్ తారల వరకు హరియాణా ఎన్నికల్లో ఓటమిని చవిచూశారు. బీజేపీ తరపున పోటీ చేసిన ప్రముఖ రెజ్లర్స్ బబితా ఫొగాట్, యోగేశ్వర్ దత్, టిక్‌టాక్ స్టార్ సోనాలీ ఫొగాట్‌లకు ఓటర్లు ఓటమి రుచి చూపించారు. ప్రముఖ క్రీడాకారులంతా ఓటమి పాలైనా మాజీ హాకీ కెప్టెన్ సందీప్ సింగ్ గెలుపు బీజేపీకి కాస్తంత ఊరటనిచ్చింది. ప్రముఖ ఒలంపిక్ క్రీడాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత యోగేశ్వర్ దత్ సైతం ఓటమిపాలయ్యారు. బరోడా సెగ్మెంట్‌లోని సోనిపట్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ సిట్టింగ్ అభ్యర్థి శ్రీకిషన్ హుడా చేతిలో బీజేపీ అభ్యర్థి యోగేశ్వర్ దత్ 4,840 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈయన బీజేపీ టిక్కెట్‌పై 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సైతం పోటీ చేశారు. 2012లో లండన్‌లో జరిగిన ఒలింపిక్ క్రీడల్లో యోగేశ్వర్ దత్ కాంస్య పతకం గెల్చారు. కామన్ వెల్త్ క్రీడల్లో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్న రెజ్లర్ బబిత ఫొగాట్.. చర్ఖీలోని దాద్రి అసెంబ్లీ స్థానంలో పోటీ చేసి చిత్తుగా ఓడిపోయారు. బబిత తండ్రి మహవీర్ సింగ్ ఫొగాట్ సైతం బీజేపీ పార్టీ వ్యక్తే. దాద్రి స్థానంలో స్వతంత్ర అభ్యర్థి సోమ్‌వీర్ సంగ్వాన్ చేతిలో 14,272 ఓట్ల తేడాతో బబిత ఓటమిపాలయ్యారు. టిక్‌టాక్ స్టార్ సోనాలి ఫొగాట్ అదాంపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కుల్దీప్ బిష్ణోయ్ చేతిలో ఓడిపోయారు. కురుక్షేత్రలోని పెహోవా నుంచి పోటీచేసిన బీజేపీ అభ్యర్థి సందీప్ సింగ్ కాంగ్రెస్ అభ్యర్థి మందీప్ సింగ్ ఛత్తాని 5,314 ఓట్ల తేడాతో ఓడించారు. అయితే ముగ్గురు క్రీడాకారులతో పాటు టిక్‌టాక్ స్టార్ సోనాలి ఎన్నికల సమయంలోనే బీజేపీలో చేరారు. కాంగ్రెస్ అభ్యర్థి, క్రికెట్ కంట్రోల్ బోర్డు మాజీ చీఫ్(బీసీసీఐ) రణ్‌బీర్ సింగ్ మహేంద్ర.. దాద్రీ జిల్లాలోని బాధ్ర నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. అయితే, ఈ స్థానంలో జేజేపీ అభ్యర్థి నైనా చౌతాలా చేతిలో రణ్‌బీర్ ఓటమిపాలయ్యారు.

## ఆయనకు ఒంట్లో ఆల్కహాల్!



**న్యూయార్క్:** బయటకెళ్లి ఆల్కహాల్ కొనకుండా ఇంట్లోనే ఆల్కహాల్ దొరికితే ఎంత బావుండునో అని మద్యపాన ప్రియులు కోరుకుంటారు. అలాంటిది ఏకంగా ఒంట్లోనే ఆల్కహాల్ ఉత్పత్తి అయితే ఇంకెంత బాగుండు అనుకుంటారు కదా! అతడెంత అదృష్టవంతుడోనని ఆశ్చర్యపోతారు. దీన్ని అనుభవిస్తున్న ఓ వ్యక్తి మాత్రం దీన్ని దురదృష్టకరమని భావిస్తున్నాడు. న్యూయార్క్‌కు చెందిన ఓ వ్యక్తి డ్రైవింగ్ చేస్తుండగా ఆపి ఆల్కహాల్ స్థాయిని పరీక్షించారు. ఉండాల్సిన స్థాయి కంటే రెండు రెట్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. అధికారులు అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో నిలబెట్టారు. అయితే ఇలాంటి ఓ కేసు గురించి విన్న అతని బంధువు అతడికి సహాయం చేసింది. ఆహారంలో ఉన్న పిండిపదార్థాలను గ్లూకోజ్‌గా కాకుండా, ఆల్కహాల్‌గా మార్చే ఓ ప్రత్యేక సూక్ష్మజీవి కడుపులో ఉండటంతో ఈ పరిస్థితి ఎదురైంది. ఓ డాక్టర్ పర్యవేక్షణలో అతడిని ఉంచారు. అధిక పిండిపదార్థాలు ఉన్న ఆహారాన్ని అతడు తీసుకున్నపుడు రక్తంలో ఆల్కహాల్ స్థాయి పెరగడాన్ని గుర్తించారు. పిండిపదార్థాలు అధికంగా లేని ఆహారాన్ని స్వీకరించినపుడే ఆల్కహాల్ స్థాయి లేదు. దీంతో అతన్ని కోర్టు మన్నించింది. ఈ అంతుచిక్కని వ్యాధి పరిశీలన దశలోనే ఉందని దానిపై పరిశోధనలు చేస్తున్న పరిశోధకులు, 'మై గట్ మేక్స్ ఆల్కహాల్' రచయిత బార్‌బరా కార్డెల్ అన్నారు. ఈ వ్యాధితో బాధపడుతున్నవారు ఆల్కహాల్ సేవించినట్లు కనిపిస్తారు. వేగంగా అలసిపోయినట్లు, ఆల్కహాల్ వాసన వస్తున్నట్లు అనిపిస్తుంది. ఇది షుగర్ వ్యాధి ఉన్నవారిలో ఎక్కువగా కనిసిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు.

## సీఎం పిలుపు సంతోషాన్ని కలిగించింది

**పశ్చిమ బెంగాల్ గవర్నర్ జగదీప్ ధన్‌కర్**



**బరాసత్:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇంట్లో జరిగే కాళీపూజకు తనకు ఆహ్వానం అందడం సంతోషంగా ఉందని ఆ రాష్ట్ర గవర్నర్ జగదీప్ ధన్‌కర్ అన్నారు. సీఎంతో కలసి ఆమె ఇంట్లో ఉత్సవాలు జరుపుకునేందుకు వేచి చూస్తున్నానన్నారు. శనివారం బరాసత్‌లోని ఓ క్లబ్‌లో కాళీ పూజకు హాజరైన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ జగదీప్ కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలతో విభేదిస్తున్న సంగతి తెల్సిందే. సీఎం నివసించే కాళిఘాట్‌లో ప్రత్యేక పూజలను నిర్వహించడం 1978 నుంచి ఆచారంగా వస్తోంది. కాళీఘాట్ ఉత్సవాల్లో తన భార్యతో కలసి పాల్గొనాలని ఉందని, దీనికి ఆహ్వానించాల్సిందిగా గవర్నర్ సీఎంకు లేఖ రాశారు. ఈ తంతుకు మమత ఓకే అనడంతో కాళీపూజలో పాల్గొనేందుకు ఆయనకు మార్గం సుగమమైంది.

## బోరుబావిలో చిన్నారి..

**తిరుచిరాపల్లి:** తమిళనాడులోని నడుకట్టుపట్టి వద్ద పాడుబడ్డ ఓ బోరుబావిలో మూడేళ్ల బాలుడు పడిపోయాడు. సహాయక చర్యల్లో భాగంగా పిల్లవాడు లోపలికి మరింత జారిపడటంతో అధికారులు కొంత ఆందోళన చెందినప్పటికీ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం బాలుడు తన ఇంటి సమీపంలో ఆడుకుంటూ వెళ్లి బోరుబావిలో పడిపోయాడు. 600 అడుగులున్న బోరుబావిలో పిల్లాడు పడగా.. మొదట 35 అడుగుల లోతు వద్ద చిక్కుకున్నాడు. దీంతో సహాయక చర్యలు చేపట్టిన సందర్భంలో మరింత జారి 90 అడుగుల లోతులో కూరుకుపోయాడు. శుక్రవారం సాయంత్రం ఆ బాలుడు బోరుబావిలో పడిన 5.30 గంటల నుంచి అతనికి ఆక్సిజన్ సరఫరా చేస్తున్నారు. బాలుడ్ని వెలికితీయడానికి సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి.

**ఉద్యమ సెగ**


చిలీలో సబ్‌వే చార్జీలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ పది లక్షల మంది ప్రజలు రోడ్డెక్కారు. నిరసనకారులు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తుండడంతో ప్రభుత్వం భారీగా సైనికులను మోహరించింది. ఈ ఆందోళనల్లో ఇప్పటివరకు19 మంది ప్రాణాలు కోల్పోయారు. 584 మంది గాయపడ్డారు.

**ఆధ్యాత్మిక ప్రభ**


దీపావళిని పురస్కరించుకుని శనివారం అయోధ్యలోని సరయూ నదీ తీరంవెంబడి ఆరు లక్షలకుపైగా మట్టి దీపాలను వెలిగించిన దృశ్యం. దీంతో కొత్త గిన్నిస్ రికార్డు నమోదైంది. యూపీ సర్కార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## పెరిగిన 'నోటా' ఓటర్లు

**ముంబై:** పోలింగ్ సమయంలో అభ్యర్థిని ఎన్నుకునే విషయంలో 'నోటా'ను ఉపయోగించుకునే ఓటర్ల సంఖ్యలో ఇటీవల భారీ పెరుగుదల కనిపిస్తోంది. 2014 ఎన్నికలతో పోలిస్తే ఇటీవల మహారాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో ఈ విషయం స్పష్టమైంది. 2014 ఎన్నికలలో 4,60,741 మంది నోటాను ఉపయోగించుకోగా, ఈ ఎన్నికలలో 7,42,134 మంది నోటాను ఎంచుకున్నారని విశ్లేషణలు చెబుతున్నాయి. ఇది మొత్తం ఓట్లలో 1.35 శాతం. గత అసెంబ్లీ ఎన్నికలలో నోటా శాతం 0.91. కాగా మహారాష్ట్ర అసెంబ్లీలో రెండు నియోజకవర్గాలలో నోటా రెండో స్థానంలో నిలవడం విశేషం. లాతూర్ గ్రామీణ అసెంబ్లీ ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థి ధీరజ్ 1,35,006 ఓట్లు (67.64 శాతం) సాధించగా, నోటా 27,500 ఓట్లు (13.78 శాతం) సాధించి రెండవ స్థానాన్ని దక్కించుకుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం
దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, తిథి బ.చతుర్దశి ఉ.11.46 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం చిత్త తె.4.26 వరకు (తెల్లవారితే సోమవారం), వర్జ్యం ప.1.31 నుంచి 2.53 వరకు, దుర్ముహూర్తం సా.3.57 నుంచి 4.43 వరకు, అమృతఘడియలు... రా.10.23 నుంచి 11.54 వరకు, దీపావళి.

సూర్యోదయం : 6.00
సూర్యాస్తమయం : 5.30
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

ఉద్ధవ్ ఠాక్రే (శివసేన)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

అమిత్‌షా ఫోన్ ఎత్తడం లేదు! ఎందుకు ఫోన్ ఎత్తడం లేదో చెప్పడానికైనా ఒకసారి ఫోన్ ఎత్తమని అడగడానికి మళ్లీ ఫోన్ చేశాను.

ఎత్తాడు!!

"అమిత్‌జీ నేను ఉద్ధవ్ ఠాక్రే. ఫాదర్ ఆఫ్ ఆదిత్యా ఠాక్రే. వయసు ఇరవై తొమ్మిది. వర్లీ నుంచి భారీ మెజారిటీతో గెలిచాడు" అని చెప్పాను.

"ఇదంతా నాకెందుకు చెబుతున్నారు ఉద్ధవ్! దీపావళి పనుల్లో ఉన్నాను. వేరే ఇంకే సమయంలోనైనా మీరు నాకు ఫోన్ చేయగలరా?" అన్నాడు విసుగ్గా!

ఉలిక్కి పడ్డాను. పిల్లలెవరో బాంబు పేల్చినట్లున్నారు! ఫోన్‌ని అలా చెవికి ఆన్చుకునే వెళ్లి బాల్కనీలోంచి కిందికి చూశాను. ఆదిత్యను ముఖ్యమంత్రిని చెయ్యాలని ఆ ఈడు కుర్రాళ్లంతా ఇంటి ముందు ఔట్లు పేలుస్తున్నారు. సంతోషంగా అనిపించింది.

"ఏమైంది ఉద్ధవ్! వేరే ఇంకే సమయంలోనైనా మీరు నాకు ఫోన్ చేయగలరా అని మిమ్మల్ని అడిగాను కదా! సమాధానం చెప్పరేమిటి?" అంటున్నాడు అమిత్‌షా.

"అమిత్‌జీ.. ఆ బాంబుల చప్పుడేమిటని మీరు అడుగుతారని ఆశించాను. కానీ మీరు అడగలేదు. నిజానికి ఆ చప్పుళ్లు మీకు వినిపించడం కోసమే నేను మీకు సమాధానం చెప్పకుండా ఆగాను. ఆదిత్యను సీఎంను చేయాలని డిమాండ్ చేస్తూ కిందంతా ఔట్లు పేలుస్తున్నారు" అని చెప్పాను.

"విన్నాను ఉద్ధవ్. మీ అబ్బాయిని సీఎంను చెయ్యాలన్న డిమాండ్‌తో పేలుస్తున్న ఔట్ల చప్పుడులా లేదది. మీ అబ్బాయి సీఎం అయ్యాక పేలుతున్న ఔట్ల చప్పుడులా ఉంది"



అన్నాడు. మండిపోయింది నాకు!

"ఏంటి ఉద్ధవ్.. మండిపడుతున్నారు!?" అన్నాడు!!

"నేను మండిపడటం కాదు అమిత్‌జీ. ఇక్కడ టెన్ థౌజండ్‌వాలా అంటించారు. పిల్లలు కదా. పెద్దా చిన్నా చూస్కోరు. మంట పెట్టేస్తారు. అవొచ్చి మనకు తగులుతాయ్" అన్నాను.

"ముందా పిల్లాటలు మానేయమనండి ఆదిత్యని. రాజకీయాల్లోకి రావలసినవాడు" అన్నాడు!

రాజకీయాల్లో ఉన్నవాడిని పట్టుకుని రాజకీయాల్లోకి రావలసినవాడు అంటున్నాడంటే.. ఆదిత్యను సీఎంని చెయ్యకూడదని అమిత్‌షా గట్టిగానే డిసైడ్ అయినట్లున్నాడు.

"మావాడు ఇప్పుడు రాజకీయాల్లోకి రావడమేంటి అమిత్‌జీ! పదేళ్లుగా రాజకీయాల్లోనే కదా ఉన్నాడు. ఇప్పుడు ఎమ్మెల్యే కూడా అయ్యాడు. ఎన్నికల ముందు మీరు మా ఇంటికి వచ్చి.. 'మనం పవర్‌లోకి వస్తే ఫిఫ్టీ ఫిఫ్టీ' అన్లేదా?! ఎన్నికలయ్యాక ఇప్పుడు.. దీపావళి పనులున్నాయి అంటున్నారేమిటి!" అని అడిగాను.

పెద్దగా నవ్వాడు అమిత్‌షా. "దీపావళి పనులంటే మీకు, మీ వాడికి ఔట్‌లు పేల్చడం. నాకు మాత్రం మహారాష్ట్రకు ఒక కొత్త సీఎంని వెదకి తేవడం" అన్నాడు!

"అర్థం కాలేదు అమిత్‌జీ" అన్నాను.

"ఫిఫ్టీ ఫిఫ్టీ అంటే మీకు యాభై ఆరు సీట్లు, మాకు నూట ఐదు సీట్లు కాదు ఉద్ధవ్. మాకొచ్చిన సీట్లలో సగం మాత్రమే మీకు వచ్చినప్పుడు మనం సగం సగం అవుతామని మీరు ఎలా అనుకున్నారు?" అన్నాడు!

నేనిక మొహమాట పడదలచుకోలేదు.

"అమిత్‌జీ.. ఎన్ని సీట్లు వచ్చాయని కాదు, ఎన్ని సీట్లు తగ్గాయో చూడండి. మాకు తగ్గిన సీట్లు ఏడైతే, మీకు తగ్గిన సీట్లు పదిహేడు. మాకు తగ్గిన వాటి కన్నా రెట్టింపుగా మీకు తగ్గినప్పుడు మనం సగం సగం కాబోమని మీరెలా అనుకుంటారు?" అన్నాను.

"దీపావళి పనుల్లో ఉన్నాను. మళ్లీ చెయ్యండి ఉద్ధవ్" అన్నాడు!

"మీ దీపావళి పనుల్లో మీరు ఉండండి. మా దీపావళి పనుల్లో మేము ఉంటాము" అని చెప్పి ఫోన్ పెట్టేశాను.

# క్రోనీ వాకర్ లాంగ్‌మార్చ్!

జనతంత్రం



వర్ధెల్లి మురళి



'నాక్కొంచెం తిక్కుంది, దానికో లెక్కుంది' – పవన్ కల్యాణ్ నటించిన గబ్బర్ సింగ్ సినిమాలో ఓ డైలాగ్. సినిమాలో ఆయన పాత్రకు ఈ డైలాగ్ బాగా కనెక్ట్ అయ్యింది. పవన్ కల్యాణ్ పాపులర్ హీరో కాబట్టి డైలాగ్ కూడా బాగా పాపులర్ అయ్యింది. కొంచెం శాడిజంతో కూడుకున్న గబ్బర్ సింగ్ పాత్ర వింత ప్రవర్తన కేవలం తిక్క మాత్రమే కాదని, ఆ తిక్క వెనుక ఒక కచ్చితమైన లెక్క వుందని అర్థం చేసుకోవడానికి ఈ డైలాగ్ ఉపయోగపడింది. జనసేన పార్టీని 2014 ఎన్నికల ముందు స్థాపించినప్పటికీ, అంతకు ఐదారేళ్ల ముందు నుంచే పవన్‌కు రాజకీయాలతో సంబంధం ఉంది. పెద్దన్న చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో యువరాజ్యం అధ్యక్షుడిగా పని చేశారు. అప్పట్లో ప్రజారాజ్యం పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన ఒక రాజకీయ విశ్లేషకుడు పవన్ గురించి ఒక ఆసక్తికరమైన కామెంట్ చేశాడు. 'పవన్ కల్యాణ్‌ది ఊయల వేగం. ఊయల ఎంత వేగంగా ముందుకు వెళ్తుందో అంతే వేగంగా వెనక్కు వస్తుంది. ఆయన రాజకీయశైలీ అంతే. అసందర్భంగా ఆవేశపడి ప్రసంగాలు చేయడం, ధర్నాలకు దిగడం వెంటనే అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం ఆయన నైజం' అన్నాడు. పవన్ కల్యాణ్ రాజకీయ జీవితంతో ముడిపడి వున్న సందర్భాలను ఒకసారి పరిశీలనగా చూస్తే ఈ కామెంట్ సమంజసంగానే తోస్తున్నది. ప్రజారాజ్యం టైమ్‌లోనే ఒకసారి ఏదో సభలో పాల్గొన్న పవన్ కల్యాణ్ హఠాత్తుగా ఆవేశపడిపోయి 'కాంగ్రెస్ నేతల పంచెలూడదీయండి' అంటూ ఊగిపోవడాన్ని టీవీ లైవ్‌లో చూసిన చిరంజీవి హతాశుడయ్యాడని అప్పుడాయనతో కలిసి పనిచేసిన వాళ్లు చెబుతారు.

స్వయంగా జనసేన పార్టీ స్థాపించిన తర్వాత కూడా ఆయన వ్యవహారశైలి సంప్రదాయ రాజకీయనేతల శైలికి కొంచెం తేడాగానే కనిపిస్తున్నది. కాన్వాయ్‌లో వెళ్తుంటాడు. రోడ్లమీద అభిమానులు జైకొడుతూ కారు చుట్టూ గుమికూడుతారు. ఆయన కారు అద్దాన్ని కిందికి దించి చేతిని గాల్లో ఊపుతూ అభివాదం చేస్తాడు. అప్పుడా చేతి నిండా ఐదారు పుస్తకాల మడత వుంటుంది. ఆ పుస్తకాలు అభిమానులకు స్పష్టంగా కనిపిస్తాయి. అంత సందడిలో అభిమానుల కేరింతల నడుమ అన్ని పుస్తకాలు ఎలా చదువుతారో అనే అనుమానం సాధారణ ప్రజలకు మాత్రమే వస్తుంది. ఏమో ఆ పుస్తక ప్రదర్శన వల్ల తమ నాయకుడు బాగా చదువుకున్న గొప్ప మేధావి అనే కిక్కు అభిమానుల కెక్కుతుందేమో! పిల్లవాడి చేతిలో పుస్తకం కనిపించినప్పుడు తల్లిదండ్రులు సంబరపడటం సహజం. అబ్బో మా అబ్బాయి మహాచురుకు, పదో క్లాసుకే పన్నెండెక్కాలు నేర్చాడని పక్క వాళ్లకు చెప్పుకోవడం కూడా కద్దు. పవన్ తరచూ తిరగేసే పుస్తకాల్లో గుంటూరు శేషేంద్రశర్మ రచనలు తప్పనిసరిగా కనిపిస్తాయని ఆయనకు దగ్గరైనవాళ్లు చెప్పారు. శేషేంద్ర ఒకచోట ఇలా అంటాడు 'నా వాక్యం ఒక పిల్లనగ్రోవి, లోపల గాలి తప్ప అర్థం వుండదు' అని. పవన్ కల్యాణ్ ఆవేశ ప్రసంగాలు చేస్తున్నప్పుడు చాలామంది ఇలాగే అనుకుంటారు. కానీ, పవన్‌కూ, కొద్దిమందికి మాత్రం ఆ పిల్లనగ్రోవి పాటకు అర్థం ఏమిటో తెలుసు.

లాటిన్ అమెరికన్ విప్లవకారుడు చే గువేరా అంటే పవన్‌కు చచ్చేంత అభిమానమని ఆయన చేపట్టిన చర్యల ద్వారా మనకు అర్థమవుతున్నది. ప్రపంచంలో వున్న లక్షలాదిమందికి వున్న క్రేజ్ మాదిరిగానే గువేరా బొమ్మ వున్న టీ షర్టులంటే పవన్‌కూ ఇష్టమే. ఆయన ఆఫీసుల్లో, వేదికల మీదా గువేరా బొమ్మ తరచుగా కనిపిస్తుంది. చేగువేరా మీద వచ్చిన పుస్తకాలు కూడా ఆయన దగ్గర చాలా వుండొచ్చు. చేగువేరా బొమ్మను దాచుకున్నంత మాత్రాన విప్లవ వీరుడిగా జనం గుర్తిస్తారా? చేగువేరా సైద్ధాంతిక పునాదికీ, పవన్ రాజకీయ రాద్ధాంతాలకు మధ్యన బీరకాయ పీచు చుట్టరికం ఏమైనా వుందేమో నిపుణులే తేల్చాలి. సర్దార్ భగత్‌సింగ్ ఇరవయ్యేళ్ల వయసులో అరెస్టయినప్పుడు జైలు ఆవరణలో ఆరుబయట ఓ కుక్కి మంచం మీద కూర్చుని వుంటాడు. ఆ దృశ్యం వున్న ఒక ఫొటో బయటకు వచ్చింది. ఇప్పటికీ చాలామంది భద్రంగా దాచుకుంటారు. పవన్ కల్యాణ్ ఇటువంటి సీన్‌ను కూడా తన ఎన్నికల ప్రచారంలో రీక్రియేట్ చేశాడు. సభ ముగిసిన తర్వాత విశాలమైన ఒక ఇంటి ఆవరణలో ఒక కుక్కి మంచంపై కూర్చొని తానొక్కడే. చేతిలో ఒక పుస్తకం. ఫొటో పత్రికలకు విడుదలయ్యేది. పత్రికలు అచ్చువేసేవి. ఇటువంటి సినిమాటిక్ ఇమిటేషన్‌ల ద్వారా తాను ఆశిస్తున్న ఇమేజ్‌కూ, తన రాజకీయ ఆచరణకు మధ్య సంబంధం ఏమైనా వుందా? పరస్పర విరుద్ధాలైన ఈ రెండు చర్యలను అనుసంధానిస్తున్న అదృశ్య శక్తి ఏమైనా వుందా? ఈ చిక్కుముడి వెనుక లెక్క ఏమైనా వుందా?

నాలుగైదు దశాబ్దాలకు పూర్వం... కులవ్యవస్థ గడ్డ కట్టి వున్న రోజుల్లో 'ఆశ్రిత కులాలు'గా ముద్రపడిన కొన్ని సమూహాలు ఉండేవి. ప్రధాన కులాల మీద ఆధారపడి ఆశ్రిత కులాల జీవిక సాగేది. ఏడాదికోమారు ప్రధాన కులం వారి సమక్షంలో వారి పురాణాన్ని వినిపించడం, వారి గత వైభవాన్ని ఊరించి చెప్పడం. పూర్వం మీ కులంవారు రాజ్యాలేలారని కల్పించి చెప్పడం వారిని సంతోష పెట్టడం ఆశ్రిత కులాల పని. క్రమంగా కులవృత్తులు విచ్ఛిన్నమవడంతో, ఆ వృత్తులపై బతికినవాళ్లు చెల్లాచెదురయ్యారు. ఆశ్రిత కులాలు అంతర్థాన దశకు చేరుకున్నాయి. ప్రపంచీకరణ పుణ్యమా అని మరో సరికొత్త ఆశ్రిత వర్గం తెరపైకి వచ్చింది. ఇది యాచించేది కాదు. శాసించేది. దానినే ఆశ్రిత పెట్టుబడిదారీ వర్గం లేదా క్రోనీ కేపిటలిజం అంటున్నాము. దేశంలో ఆర్థిక సంస్కరణలకు అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు తెరతీసిన తర్వాత, రాష్ట్రాల్లో అధికారంలో వున్నవాళ్లు ఆశ్రిత పెట్టుబడిదారీ వర్గానికి జన్మనిచ్చారు. తొలితరం ఆర్థిక సంస్కరణల రోజుల్లో సుదీర్ఘకాలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఇక్కడి ఆశ్రిత పెట్టుబడిదారీ వర్గానికి పురుడుపోసి, పెంచి పెద్ద చేశాడు. ప్రభుత్వ వనరులు, కాంట్రాక్టులు, గనులూ ఆశ్రిత పెట్టుబడిదారులకు చేరువయ్యాయి. కళ్లు చెదిరే సంపాదనను ఈ వర్గం మూటకట్టుకున్నది. చేరదీసిన రాజకీయ పార్టీ అవసరాలను కూడా ఈ ఆశ్రితవర్గం చూసుకోవడం మొదలైంది. పోగుపడుతున్న సంపదతో ఓట్లను కొనుగోలు చేయడం, ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం, అధికారాన్ని కొనుగోలు చేయడం ఈ దశలోనే ప్రారంభమైంది. సామాన్యులు, సంఘ సేవకులు 'పోటీ' పడలేక రాజకీయాలకు దూరమయ్యారు. కరెన్సీ దూకుడును ఎదుర్కోలేక కమిట్‌మెంట్ రాజకీయ పార్టీలు చతికిలపడ్డాయి. దేశీయ మార్కెట్‌ను పిడికెడుమంది 'క్రోనీ'లు నియంత్రించే అలిగోపొలి (oligopoly) వైపు ఆర్థికవ్యవస్థ పతనం మొదలైంది. ఈ ప్రస్థానాన్ని ఇంతటితో ఆపకపోతే మన రాజకీయ వ్యవస్థ మూకస్వామ్యం (oligarchy) స్థాయికి దిగజారే దుస్థితి ఎంతో దూరం ఉండదు.

తెలుగునాట ఆశ్రిత పెట్టుబడిదారీ వర్గానికి నారు పోసి నీరుపెట్టిన చంద్రబాబు రాష్ట్ర విభజన తర్వాత మరో ఆశ్రిత వ్యవస్థను రంగంలోకి దించారు. అదే ఆశ్రిత రాజకీయం లేదా క్రోనీ పాలిటిక్స్. తన రాజకీయ వ్యూహంలో భాగంగా ఇండిపెండెంట్‌గా కనిపించే ఒక క్రోనీ పొలిటికల్ పార్టీ బాబుకు అవసరమైంది. పవన్ కల్యాణ్‌లో ఉన్న ఊయల మార్కు ఆవేశంలో పిల్లనగ్రోవి బ్రాండ్ ప్రసంగాల్లో తన క్రోనీని చంద్రబాబు చూడగలిగాడు. గడచిన ఐదేళ్లలో చంద్రబాబు ప్రయోజనాలకు అనుగుణంగా పవన్ కల్యాణ్ వ్యవహరించాడని చెప్పడానికి వంద ఉదాహరణలను పేర్కొనవచ్చు. ఏపీలో ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు నాయుడు పొరుగు రాష్ట్రంలో ఎమ్మెల్యేల వోట్లను కొనుగోలు చేస్తూ ఆడియో సాక్షిగా, వీడియో సాక్షిగా రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోతే 'చంద్రబాబూ గద్దెదిగు' అని గర్జించలేని వ్యక్తిలో గువేరా ఆదర్శం, భగత్‌సింగ్ ఆవేశం ఉన్నాయంటే నమ్మగలమా? తన సొంత సామాజిక వర్గం, ఒక పెద్ద వర్గం. ఆ వర్గంలో ఒక పెద్దాయన. ముద్రగడ పద్మనాభం ఇంటిపై పడి, పరువు మర్యాదలే ప్రాణప్రదంగా భావించే ఆ కుటుంబ సభ్యులను దారుణంగా అవమానిస్తే, ఇది తప్పూ, వారికి నేను అండగా ఉన్నానంటూ నిలబడలేని నిస్సహాయత దేనికి సంకేతం. అరచేతిలో వైకుంఠాన్ని చూపి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏ హామీనీ నెరవేర్చకపోయినా ఐదేళ్లూ కిమ్మన్నాస్తిగా ఉండిపోయిన పవన్ కల్యాణ్ ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి 100 రోజుల పాలనపై నివేదికలు విడుదల చేయడం వెనుక వున్న రహస్య ఒడంబడిక ఏమిటి? చంద్రబాబు అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తర్వాత కిడ్నీ బాధిత ప్రాంతమైన ఉద్దానంలో ఆఫ్టరాల్ ఒక ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేస్తానని ప్రకటిస్తేనే, కరకట్ట నివాసానికి పరుగెత్తుకెళ్లి కృతజ్ఞతాంజలులు ఘటించి వచ్చిన పవన్‌కల్యాణ్‌కు... జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడు మాసాల్లోనే ఉద్దానంలో 680 కోట్లతో మంచినీటి పథక నిర్మాణానికి శంకుస్థాపన చేసి, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పనులను ప్రారంభిస్తే కనిపించనంత అంధకారం ఏ కారణం వల్ల సంప్రాప్తించినది? తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆగడాలకు ఎదురొడ్డిన మహిళా ఎమ్మార్వో వనజాక్షిని దారుణంగా అవమానిస్తే... విజయవాడలో టీడీపీ నేతల ఆధ్వర్యంలో నడిచిన కాల్‌మనీ సెక్స్ రాకెట్‌లో నిస్సహాయ స్థితిలో అక్కాచెల్లెళ్లు, మానమర్యాదలు కోల్పోతే, ప్రాణాలు తీసుకుంటే... ఒక్కమాట... పన్నెత్తి ఒక్కమాట అడగలేని వ్యక్తి, శ్రీధరరెడ్డి అనే ఎమ్మెల్యే మీద ఒక్క ఆరోపణ వస్తేనే జైల్లో పెట్టించిన జగన్ పైన విమర్శలు చేయడం వెనుక జరిగిన లావాదేవీలు ఏమిటి? అధికారంలోకి వస్తున్నానంటూ ఎన్నికల్లో పోటీచేసి, ప్రచారాంకంలో వున్న సమయంలో ఈనాడు పత్రికకు ఇంటర్వ్యూనిచ్చి రిటర్న్ గిఫ్ట్ ఇస్తానంటూ కేసీఆర్ చేసిన ప్రకటన కారణంగా చంద్రబాబు అధికారంలోకి రాబోతున్నాడని చెప్పడం వెనుక ఏ రిటర్న్ గిఫ్ట్ దాగి వున్నది? ఇలా ప్రశ్నిస్తూ పోతే ఒక పుస్తకాన్నే వేయవచ్చు. తెలుగుదేశం పార్టీకి ఆశ్రిత రాజకీయ పార్టీగా జనసేన వ్యవహరిస్తున్నదని జనం నమ్మిన కారణంగానే, ఆ పార్టీకి దారుణమైన ఓటమి సంభవించింది. అయినా కూడా జనసేనాపతి వైఖరిలో మార్పు రాకపోవడాన్ని తెలుగు సమాజం గమనిస్తున్నది. తెలుగుదేశం పార్టీ చేస్తున్న సంతగోలకు మద్దతుగా పవన్ కల్యాణ్ ఆందోళన కార్యక్రమాన్ని ప్రకటించడాన్ని 'క్రోనీ వాకర్ లాంగ్ మార్చ్'గా జనం పరిగణిస్తే తప్పేమిటి?

చివర్లో చిన్న డౌటు. అధికారంలో ఉండగా చేసిన పాపాలపై ఎక్కడ కేసులు పడతాయోనని వణికిపోతున్న చంద్రబాబు ఇప్పటికే తన పార్టీలోని చతురంగ బలాలను బీజేపీలోకి పంపిస్తానని ఆఫర్ చేసినట్టు తెలుస్తున్నది. అందరూ పోగా అవశేష శ్రేణులతో మిగిలిన తన పార్టీని తోకపార్టీగా స్వీకరించాలని విజ్ఞప్తి చేస్తున్నట్టు భోగట్టా. తానే తోకగా మిగిలిపోతే తన ఆశ్రిత పార్టీ పరిస్థితి ఏమి కానున్నది? తెనాలి రామకృష్ణుని పద్యం గుర్తుకొస్తున్నది. ''మేక తోకకు తోక, తోకమేకకుతోకమే కతోక...'' ఇలా నడుస్తుంది పద్యం. మేక, తోక తప్ప మూడో మాట వుండదు. బహుశా రామకృష్ణ కవి ఇలాంటి సందర్భాన్ని ఊహించే చెప్పి వుంటారు.

muralivardelli@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

### ఫూల్



"ఆర్టికల్ 370 రద్దు, సరిహద్దు ఘర్షణలు, పౌరసత్వ నమోదు, వినాయక్ దామోదర్ సావర్కర్, ఎమ్మెల్యేల కొనుగోలు, హౌడీ మోదీ, ఖాన్‌లతో ఫొటోల సందడి, ఓటింగ్ రోజు పత్రికల్లో పూర్తి పేజీ ప్రకటనలు, ప్రధాన స్రవంతి మీడియాను గుప్పిట్లో పెట్టుకోవడం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయపన్ను శాఖ, సీబీఐ తదితర ప్రభుత్వ సంస్థల దుర్వినియోగం, అపరిమితమైన వనరుల వినియోగం.. ఇన్ని చేసినప్పటికీ దేశాన్ని ఫూల్ చేయలేరని ఫలితాలు స్పష్టం చేశాయి"

– సంజయ్ ఝా, కాంగ్రెస్ నేత

### అధ్వానం



"ఆర్‌బీఐ తన దగ్గర ఉన్న బంగారాన్ని అమ్మకానికి పెట్టడం గత 30 ఏళ్లలో ఇదే మొదటిసారి. మన దేశానికి దిగుమతి అయ్యే సరుకులకు డబ్బులు చెల్లించలేని సంక్షోభ సమయంలో 1991లో రిజర్వ్‌బ్యాంక్ తన బంగారు నిల్వలను వినియోగించింది. ప్రస్తుతం దేశ ఆర్థిక పరిస్థితి ఎంత అధ్వానంగా తయారైంది?"

– రూపా సుబ్రమణ్య, ఆర్థికవేత్త

### కన్నీళ్లు



"నిన్న ఓ భారతీయ ముస్లిం యువకుడు కలిశాడు. ఐక్యరాజ్య సమితిలో పెద్ద హోదాగల ఉద్యోగం సంపాదించుకున్నందుకు అతడిని అభినందించా. కానీ, చాలామంది తన ముస్లిం స్నేహితులు తనను తిరిగి దేశానికి రావద్దని కోరుతున్నారని, ఇక్కడ మనకి ఎలాంటి అవకాశాలు లేవనీ, గౌరవం కూడా లేదని అన్నారని చెబుతూ కన్నీళ్లు పెట్టుకున్నాడు"

– సుధీంద్ర కులకర్ణి, కాలమిస్ట్

### సాధారణం



"కశ్మీర్‌లో ఉగ్రవాదానికి పాకిస్తాన్ మద్దతు పలికిందని నేను కూడా ఒప్పుకుంటాను. కశ్మీరీ పండిట్లకు జరిగిన దానిని కూడా నేను ఖండిస్తున్నాను. కానీ కశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితికి పాకిస్తాన్‌ది మాత్రమే బాధ్యత అనడం పరిస్థితిని సాధారణీకరించేయడమే అవుతుంది"

– మార్కండేయ కట్జు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

### దేశభక్తి



"గడిచిన ఏడు దశాబ్దాల్లో భగత్ సింగ్, శివరామ్ హరి రాజ్‌గురు, సుఖ్‌దేవ్ థాపర్‌లకు భారతరత్న ఎందుకు ఇవ్వలేదని వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా నన్ను ప్రశ్నిస్తున్న వారికి ఒకే సమాధానం–దేశభక్తులను గౌరవించుకోవాలంటే ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు"

– మనీష్ తివారీ, కాంగ్రెస్ నేత

### వారసత్వం



"పవన్ కల్యాణ్ చేసేది నీడలతో యుద్ధం. ఎవరో ఉసిగొల్పి కత్తి చేతికిస్తే రప్పరప్ప తిప్పుతుంటాడు. వారసత్వ రాజకీయాల గురించి మాట్లాడే ముందు తన బాస్ చంద్రబాబు నాయుడు కుటుంబం గురించి, మొన్నటి ఎన్నికల్లో తన అన్నకు నర్సాపురం ఎంపీ సీటు ఎందుకిచ్చాడో వివరణ ఇస్తే బాగుండేది"

– విజయసాయి రెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

## లెబనాన్‌లో ఘర్షణలు

ఒకవైపు సంక్షోభంతో కొట్టుమిట్టాడే సిరియా, మరోవైపు విస్తరణకాంక్ష గల ఇజ్రాయెల్...మధ్య లెబనాన్. నాలుగోవంతు జనాభా పేదరికంలో మగ్గుతున్నారని చెబుతున్న లెబనాన్‌లో పదిరోజులుగా సాగుతున్న అవినీతి వ్యతిరేకోద్యమం సద్దుమణగకపోగా... దాన్ని నిరసిస్తూ పోటీ ఉద్యమం బయల్దేరింది. దీంతో బీరూట్‌తోసహా పలు నగరాలు ఘర్షణలతో అట్టుడుకుతున్నాయి. జనం సొమ్మును దోచుకుతింటున్న నేతలంతా పదవుల నుంచి తప్పుకోవాలని అవినీతి వ్యతిరేకోద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు. దానివల్ల అరాచకం ప్రబలి, ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని.. కనుక ఉద్యమాన్ని విరమించాలని హెజ్బొల్లా నాయకుడు నస్రల్లా హితవు పలికారు. ఇప్పుడున్న నేతలు తప్పుకుంటే అరాచకం రాకపోగా, వ్యవస్థ ప్రక్షాళన అవుతుందని అవినీతి వ్యతిరేక ఉద్యమకారులు వాదిస్తున్నారు. తమను అణచడానికి కిరాయి మనుషుల్ని ప్రయోగిస్తే నాయకులే దెబ్బతింటారని వారు హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా రాజుకున్న అవినీతి వ్యతిరేక ఉద్యమం ప్రభుత్వానికి శిరోభారంగా మారింది. పొరుగునున్న సిరియాలో ఎనిమిదేళ్లుగా సాగుతున్న యుద్ధం వల్ల లెబనాన్ ఆర్థిక వ్యవస్థ చిక్కుల్లో పడింది. ఇప్పుడు అధికారంలో ఉన్నవారంతా ఒకప్పుడు ఇజ్రాయెల్‌తో జరిగిన యుద్ధంలో తలపడిన మిలీషియా బృందాల కమాండర్లే.

## పత్తి రైతులకు పొంచి ఉన్న విపత్తు

సందర్భం



మేకిరి దామోదర్

భూమిలో విత్తనాలు నాటిన నాటినుండి మొదలైన రైతు కష్టాలు పంటచేతికి వచ్చి మార్కెట్‌లో పంటలను అమ్ముకునేవరకు నిత్యకృత్యంగా మారాయి. రైతులకు గిట్టుబాటు ధర లేకుండా పోతుంటే పాలకులు, అధికారులు మాత్రం ''నిమ్మకు నీరెత్తనట్లుగా'' వ్యవహరిస్తున్నారు. పత్తివిత్తనాల్లో కల్తీ, వాటి ధరలను పెంచుకుపోతున్న దోపిడీకి పాలకులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. పత్తిరైతులకు నష్టాలు విత్తనాల విక్రయంలో అధిక ధరలు నకిలీల బెడద నుండి మొదలై మార్కెట్లో మద్దతు ధర ఇచ్చే వరకు అన్ని స్థాయిల్లోనూ దోపిడీకి గురవుతున్నారు. చరిత్రలోనే అత్యధికంగా తెలంగాణలో 46.92 లక్షల ఎకరాల్లో పత్తిపంట సాగు చేశారు. ఈ పంటకు మద్దతు ధర ఇప్పించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, అన్నదాతలకు చేరడం లేదు. ఈ ఏడాది పత్తి మద్దతు ధర క్వింటాలుకు రూ. 5,550గా కేంద్రం నిర్ణయించింది. కొత్త పత్తిపంటను రైతులు మార్కెట్టుకు తేవడం మొదలైంది. తీరా తొలిపంట ఉత్పత్తికి మార్కెట్‌లో మద్దతు ధరను వ్యాపారులు చెల్లించిన దాఖలాలు లేవు. ఇప్పుడిప్పుడే వస్తున్న కొత్తపత్తికి మద్దతు ధర లేకపోవడాన్ని బట్టిచూస్తే పంటల దిగుబడి పూర్తిస్థాయిలోకి వచ్చాక రైతులకు మద్దతు ధర లభించడం ఎండమావుల్లో నీటిని వెతుక్కున్నట్లే అనిపిస్తుంది. మార్కెట్‌లో కనిష్టంగా క్వింటాలుకు రూ. 4,221 నుంచి గరిష్టంగా రూ. 5,211 వరకు అతికష్టంమీద చెల్లిస్తున్నారు. దూదిలో తేమ సాకుతో ధరను వ్యాపారులు బాగా తగ్గిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం తరపున 'భారత పత్తి సంస్థ' (సీసీఐ) మద్దతు ధరకు పత్తిని కొంటుంది. అలాకొనే కేంద్రాలను 340 వరకు ఏర్పాటు చేయాలని కోరింది. అందులో వ్యవసాయ మార్కెట్లు ఏర్పాటు చేసినవి 34 మాత్రమే సుమా ! మిగిలిన 306 కేంద్రాలను జిన్నింగ్ మిల్లుల్లో పెట్టాలని నిర్ణయించారు. మిల్లు యాజమాన్యాలు మద్దతు ధర ఇస్తారనేది అందని ద్రాక్షేనని రైతులు భావిస్తున్నారు. కొత్తపత్తికే మద్దతు ధర అందడం లేదు. డిసెంబర్ నాటికి దేశవ్యాప్తంగా మార్కెట్లకు పత్తిపంట వస్తే, పత్తిపంట అంతటికి మద్దతు ధర ఇస్తారనడం రైతులు నమ్మలేకపోతున్నారు. ప్రభుత్వం ప్రతిరైతుకు మద్దతు ధర చెల్లించి పత్తి కొనుగోలు చేసేలా వెంటనే జాగ్రత్త తీసుకోవాలి. ఇది ఇలా వుంటే ? అందరికీ మద్దతు ధర ఇచ్చినా క్వింటాలుకు రైతు పెట్టిన వ్యయాన్ని ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ. 9,502. కేంద్రం ఇస్తున్న మద్దతు ధర రూ. 5,550. ఈ లెక్కన చూసినా క్వింటాలుకు రూ. 4,000 నష్టాన్ని రైతులు పెట్టుబడిలోనే భరిస్తున్నారు. ఇలా ఇట్టి వ్యయాన్ని లెక్కించినపుడు నష్టాల బారిన రైతాంగం పడక తప్పదు.

రైతులు పండించే అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరను కల్పించాల్సి ఉంది. రాయితీలు మాత్రమే కాదు? మార్కెట్ల మాయాజాలం, కల్తీ విత్తనాలు, పురుగు మందులు ఇలా అన్ని స్థాయిల్లో దోపిడీని నివారించినప్పుడే రైతులు వ్యవసాయం చేయగలుగుతారు. ఈ సంవత్సరం భారీగా పత్తి ఉత్పత్తి రాబోతున్న వేళ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేలుకోకపోతే చాలా విపత్కర పరిస్థితికి కారకులవుతారని గమనించండి.

రైతుల పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు పెట్టుబడికి కనీసం 150 శాతం వచ్చేలా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించాలి. ఆ ధరకు మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోలు చేయని ఎడల ఎలాంటి షరతులు పెట్టకుండా రైతుల వద్ద నుండి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలి. రైతు పెట్టుబడికి మద్దతు ధరకు మధ్య క్వింటాలుకు రూ. 4,000 వరకు నష్టపోతున్నందువల్లనే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అన్ని ఉత్పత్తులకు అండగా ఉంటున్న పాలకులు రైతు ఉత్పత్తులకు ఎందుకు అండగా ఉండరు? రైతుకు భిక్షం వేసినట్టు కేంద్రం మద్దతు ధర రూ. 100, రూ. 200 పెంచుతూ పోవడం భావ్యం కాదు. మట్టిని నమ్ముకున్న రైతు నోట మట్టికొట్టే విధానాలు మారనంత కాలం రైతు కుటుంబాల్లో వెలుగులు రావు. పత్తి రైతుల మద్దతు ధరకు ఉత్పత్తి వ్యయానికి మధ్య అగాధాన్ని పూడ్చాలి. వ్యవసాయాన్ని లాభాలబాట పట్టించాలి. రైతు ఆత్మహత్యలను నివారించాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులదే.

వ్యాసకర్త రచయిత, ఉపాధ్యాయుడు
మొబైల్ : 95736 66650

## అర్చకులకు నిజమైన దీపావళి

ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి రాష్ట్రవ్యాప్తంగా అర్చకులు నీరాజనం పడుతున్నారు. వంశపారంపర్య హక్కుల జీవో 439 విడుదలపై అర్చక సమాఖ్య హర్షం వ్యక్తం చేసింది. తెలుగుదేశం ప్రభుత్వం 1987లో తీసుకొచ్చిన దేవాదాయ చట్టం అర్చక హక్కులను హరించింది. అర్చకుల పాలిట, ఆలయాల పాలిట మరణశాసనంగా మారింది. వేలాది చిన్న ఆలయాలు మూతపడ్డాయి. పెద్ద ఆలయాలు వ్యాపార కేంద్రాలుగా మారాయి. ఆలయ ఆస్తులు, భూములు, ఆభరణాలు, మణులు, మాణిక్యాలు అన్యాక్రాంతమైనాయి. ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్యతోపాటుగా పలు సంఘాలు న్యాయస్థానాలను ఆశ్రయించాయి. 1990లో సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. తీర్పును అమలు చేయలేమని ప్రభుత్వం–దేవాదాయశాఖ సుప్రీం కోర్టుకు తెలిపింది. 1997లో సుప్రీంకోర్టు తుది తీర్పును ఇస్తూ చట్టసవరణలు చేసుకోవలసినదిగా సూచించింది. అప్పటి ప్రతిపక్ష నాయకులు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గారికి అర్చకులు అందరూ వారి కష్టాలు చెప్పుకున్నారు. 2004 సంవత్సరంలో వైఎస్సార్ పాదయాత్ర ప్రారంభ సమయంలో చిలుకూరు ప్రధాన అర్చకులు, అర్చక సమాఖ్య నాయకులు ఎమ్వీ సౌందరరాజన్ అధికారంలోకి వస్తే తప్పక చట్టాన్ని మార్చాలని మాట తీసుకున్నారు. ఆయనకు ఇచ్చిన మాట ప్రకారం 2007లో దేవాదాయ సవరణ చట్టం 33/2007ను తీసుకొచ్చారు. దీనితోపాటుగా అర్చక సంక్షేమం, ధూపదీప నైవేద్య పథకాలు మొదలైనవి అర్చకుల కళ్లలో వెలుగులు నింపాయి. మహా నాయకుడి మరణంతో అర్చకులకు మళ్లీ గడ్డు రోజులు వచ్చాయి. పదవీ విరమణ పేరుతో అర్చకుల పరిస్థితిని టీడీపీ ప్రభుత్వం మరింత దిగజార్చింది. సీఎం జగన్ నాలుగు నెలలలోపే సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో అర్చకులంతా సంబరాలు చేసుకుంటూ దీపావళి కానుకగా ఆనందిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్చకులు అందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సర్వతోముఖ వికాసం పొందాలని, దేవుడు వారి కుటుంబాన్ని చల్లగా చూడాలని పూజలు చేసి, శతమానంభవతి అని ఆశీర్వదించారు.

పెద్దింటి రాంబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి,
ఏపీ అర్చక సమాఖ్య । మొబైల్: 98495 51036

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి
ఫ్యామిలీ సినిమా
నల్గొండ ॥ ఆదివారం
27-10-2019



● వెంకటేశ్, నాగచైతన్య

# పండగ తెచ్చారు



● విజయశాంతి



● మహేశ్‌బాబు



● 'కమ్మరాజ్యంలో కడపరెడ్లు' సినిమాలో ఓ దృశ్యం



● పూజా హెగ్డే, అల్లు అర్జున్



● కల్యాణ్‌రామ్, మెహరీన్



● బాలకృష్ణ

ఈ దీపావళికి సినిమా అభిమానుల మనసుకి సంతోషమనే వెలుగును అందించింది టాలీవుడ్. కొత్త సినిమా ప్రకటనలు, చిత్రీకరణ విశేషాలు, కొత్త పోస్టర్స్‌తో దీపావళి సంబరాలను డబుల్ చేసింది. బాలకృష్ణ హీరోగా కేఎస్. రవికుమార్ దర్శకత్వంతో తెరకెక్కుతోన్న సినిమాకు 'రూలర్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సినిమాలో పోలీసాఫీసర్‌గా నటిస్తున్నారు బాలకృష్ణ. సి. కల్యాణ్, సి.వి. రావ్, పత్సా నాగరాజు నిర్మిస్తున్న ఈ సినిమాను డిసెంబరు 20న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఆర్మీ మేజర్ అజయ్‌కృష్ణ పాత్రలో మహేశ్‌బాబు హీరోగా నటిస్తున్న చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. దాదాపు పదమూడేళ్ల తర్వాత ఈ సినిమాలో నటిస్తున్నారు విజయశాంతి. దీపావళి సందర్భంగా ఈ సినిమాలోని మహేశ్ కొత్త పోస్టర్‌తో పాటు, విజయశాంతి ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. 'దిల్' రాజు, రామబ్రహ్మం సుంకర, మహేశ్‌బాబు నిర్మిస్తున్న ఈ సినిమా జనవరి 12న విడుదల కానుంది. 'అల.. వైకుంఠపురములో..'ని 'రాములో రాములా' పాట టీజర్‌ను ఇటీవల విడుదల చేశారు. అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాను ఎస్. రాధాకృష్ణ, అల్లు అరవింద్ నిర్మిస్తున్నారు. తమన్ స్వరకర్త. 'రాములో రాములా' పూర్తి పాటను విడుదల చేశారు. జనవరి 12న ఈ సినిమా రిలీజ్ కానుంది. వెంకటేశ్, నాగచైతన్య హీరోలుగా కేఎస్ రవీంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వెంకీమామ'. డి. సురేష్‌బాబు, టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మాతలు. ఈ సినిమా కొత్త పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఖాకీ తొడిగి, లాఠీ పట్టి మరోసారి పోలీసాఫీసర్‌గా డ్యూటీ చేయనున్నారు రవితేజ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో హీరోగా తన కొత్త సినిమా మొదలుకానున్నట్లు ప్రకటించారు రవితేజ. బి. మధు నిర్మించనున్నారు. రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'కమ్మ రాజ్యంలో కడపరెడ్లు'. ''టైటిల్‌ని బట్టి ఇది రెండు బలమైన సామాజిక వర్గాల మధ్య జరిగే ఇతివృత్తం అనుకుంటారు కానీ, ఈ చిత్రకథాంశం అది కాదు. ట్రైలర్‌ను ఈరోజు విడుదల చేసి, సినిమాను నవంబర్‌లో విడుదల చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో కల్యాణ్‌రామ్ హీరోగా నటిస్తున్న 'ఎంతమంచి వాడవురా' సినిమా చిత్రీకరణ ఈ నెల 31 నుంచి నవంబరు 10వరకు కేరళలో జరగనుంది. శివలెంక కృష్ణప్రసాద్ సమర్పణలో ఉమేష్ గుప్తా, సుభాష్ గుప్తా నిర్మిస్తున్న ఈ సినిమా జనవరి 15న విడుదల కానుంది. సాయితేజ్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'ప్రతిరోజూ పండగే'. ఈ సినిమా కొత్త పోస్టర్స్‌ను విడుదల చేశారు. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎస్‌కేఎన్ సహ–నిర్మాత. డిసెంబరు 20న విడుదల కానుంది. ఆది పినిశెట్టి నటిస్తున్న చిత్రం 'క్లాప్'. పృథ్వీ ఆదిత్య దర్శకుడు. ఐబీ కార్తికేయన్ నిర్మాత. పి. ప్రభాప్రేమ్, మనోజ్, హర్ష సహనిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. నిఖిల్ హీరోగా నటించిన చిత్రం 'అర్జున్ సురవరం'. 'ఠాగూర్' మధు సమర్పణలో రాజ్‌కుమార్ అకెళ్ల నిర్మాణంలో టి. సంతోష్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా నవంబరు 29న విడుదల కానుంది. చిరంజీవి చిన్నల్లుడు కల్యాణ్ దేవ్ నటిస్తున్న 'సూపర్ మచ్చి' ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. రిజ్వాన్ నిర్మిస్తున్న ఈ సినిమాకు పులివాసు దర్శకుడు. నవీన్‌చంద్ర హీరోగా జి కార్తీక్ రెడ్డి దర్శకత్వంలో భార్గవ్ మన్నె నిర్మిస్తున్న 'హీరో హీరోయిన్' కొత్త పోస్టర్ రిలీజ్ అయింది. ఈ దీపావళి పండగ ఇంకా చాలా పోస్టర్లను మోసుకొచ్చింది. బోలెడన్ని విశేషాలను తెచ్చింది.



● 'ప్రతిరోజూపండగే'లో ఓ దృశ్యం















సాక్షి ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ ॥ ఆదివారం
27-10-2019

నేడు దీపావళి

# మోక్ష జ్ఞాన దీపాలు

ఆ రోజు ఆశ్వీయుజ బహుళ చతుర్దశి, నరకచతుర్దశి అని అమ్మ పార్వతీదేవి త్వరత్వరగా కుమారులిద్దరిని లేపి ఇద్దరికి తైలాభ్యంగన స్నానం చేయుంచడానికి సన్నద్ధమైంది. వాళ్ళిద్దరి శిరస్సులమీద తైలం పెట్టి విభూతితో నలుగు పెట్టి స్నానం చేయించి గణేశునికి ధవళవర్ణపు వస్త్రాలు, స్కందునికి ఎరుపురంగు వస్త్రాలు తొడిగింది. నంది, భృంగి ఇత్యాది గణాలన్ని రేపు దీపావళి అమావాస్య పండగకి కైలాస శిఖరాన్ని దీపాలతో ఎలా అలంకరించాలా అని తర్జనభర్జనలు పడుతున్నారు.

ఇదిలా ఉండగా వైకుంఠంలో శ్రీమహావిష్ణువు, మహాలక్ష్మి తో "కృష్ణావతారంలో నువ్వు నరకుడిని సంహరించిన రోజు గుర్తుందా సత్య! అని అడిగాడు. 'సత్య' అన్న ఆ పిలుపు వినగానే ఆనంద పరవశురాలైన మహాలక్ష్మి ''అవును స్వామీ! మీరు నన్ను కదనరంగంలోకి పంపిన రోజు కదా! వనితలు దేనిలోను తీసిపోరని చూపడానికే అలా చేశాను'' అంటూ అలనాటి జ్ఞాపకాలతో మైమరపులోకి వెళ్లింది. ఆనందంగా నారాయణుడు ఆమెని దగ్గరకి తీసుకుంటుండగా ''స్వామీ! మర్చేపోయాను, మనం వైకుంఠమంతా దీపాలు వెలిగించాలి'' అని ఆమె పతిదేవునితో అంటుండగా ఆ మాటలు చెవిన పడిన క్షణంలోనే వైనతేయుడు ఆ ఏర్పాట్లు చేయడానికి సిద్ధమయ్యాడు.

భూలోకంలో మానవులు చక్కగా రకరకాలుగా దీపావళి జరుపుకుంటారని తెలిసిన దేవతలు వాళ్ళ అదృష్టానికి సంబరపడుతూ మన ఇంద్ర లోకంలో కూడా దీపావళిని జరుపుకోవాలని మహేంద్రుణ్ణి కలిసి విన్నవించుకున్నారు. ఆ ప్రతిపాదనకి దేవేంద్రుడు సమ్మతించి, మనం కూడా ఈ పండుగ జరుపుకుందామని అష్టదిక్పాలకులని, కిన్నెర, కింపురుషాదులని సమావేశపరిచి ఐలాపురమంతా దీపాలు వెలిగించమని ఆనతిచ్చాడు.

అలాగే నలమహారాజు చేత మధురమైన భక్ష్య భోజ్యాలు వండించి అమ్మ లక్ష్మీదేవికి పూజ చేసి, దీపాలు పెద్ద ఎత్తున వెలిగించడానికి తన పరివారాన్ని సిద్ధం చేసుకున్నాడు.

అమావాస్య చీకట్లు ముసురుకుంటున్నాయి. అటు ఇంద్రలోకంలో దేవతలు, ఇటు భూలోకంలో మానవులు తారతమ్యాలు లే కుండా అమ్మ మహాలక్ష్మిని పూజించి ధూప దీపాలు వెలిగించి చక్కని మధుర పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు.

కైలాసంలో పార్వతీదేవి వైశ్వానరుడు, స్వాహాదేవి సాయంతో తన ఇంటిలో అందరికి సరిపడా వండించిన భక్ష్య భోజ్య నైవేద్యాలన్ని శ్రీ మహాలక్ష్మి నారాయణులకి నైవేద్యంగా సమర్పించిందిట. ముసురుకుంటున్న చీకటిని పారద్రోలడానికి దీపాలు వెలిగించడం మొదలు పెట్టడానికి ముందుగా పిల్లలిద్దరిచేత పార్వతీ పరమేశ్వరులిద్దరు, గోగుకాడలకి తైలపు వస్త్రాలని కట్టి 'దిబ్బు దిబ్బు దీపావళి మళ్ళీ వచ్చే నాగుల చవితి' అని దివిటీ కొట్టించారు. నాగుల చవితి అనగానే శివుని మెడలోని మహా సర్పం వాసుకి, మిగిలిన ఆభరణాలైన నాగులన్ని ఆనందంగా తల లూపాయి. ఆ క్షణం సుబ్రహ్మణ్యుని మోము తేజోమయమైంది. "నీ పుట్టినరోజు వచ్చే షష్ఠికే కదా! " అని గణపతి గుర్తు చేయడంతోటే స్కందుడు ఆనందంగా "అవును అగ్రజా!" అని ఆనందంగా ఆలింగనం చేసుకున్నాడు. ఆదిదంపతులు ఆ అన్నదమ్ముల ప్రేమకే ఆనంద పడ్డారు..

ఈలోగా అమ్మ పార్వతీమాత ప్రమిదల నిండా తైలం పోసి వత్తులు వేసి మహాలక్ష్మిని ప్రార్థించగానే ఆ తైలంలోకి లక్ష్మీదేవి ప్రవేశించింది.

*'దీపం జ్యోతి పరబ్రహ్మ దీపం సర్వ తమోపహం!*
*దీపేన సాధ్యతే సర్వం సంధ్యాదీప నమోస్తుతే'*

అనగానే కైలాసమంతా కోటిదీపాలకాంతితో ప్రకాశమానమైంది. వెండికొండ స్వర్ణమయమైంది. పరమశివుడు, గణనాథుడు, స్కందుడు, నంది, శృంగి, భృంగి, మిగిలిన పరివార గణాలు అందరూ కూడా తలో దీపం వెలిగించి నమస్కరించారు. గంగమ్మ మటుకు పరంజ్యోతి లోనే జ్యోతి దర్శనం చేసుకుంది.

వైకుంఠం, అలకాపురి, సత్యలోకం దీపాల కాంతులతో మెరిసిపోయింది. భువిపై వెలిగించిన దీపాలకాంతి దివి అంతా పరచుకుని చీకటిని పారద్రోలింది. లక్ష్మీనారాయణులు, పార్వతీ పరమేశ్వరులు, చతుర్ముఖుడు, సరస్వతి దంపతులు దివ్యసందేశమిచ్చారు.

'మానవులైనా, దేవతలైనా సాయం సంధ్యా సమయంలో నువ్వులనూనెతో ఇల్లంతా దీపాలు వెలిగించిన వారికి దీపాన్ని లక్ష్మీస్వరూపంగా భావించి పూజలు చేసినవారికి దీపపు వెలుగుతో దారిద్ర్యం, దుఃఖాలు, కష్టాలు వంటివి దూరంగా తొలగిపోతాయి అని వివరించగానే ముల్లోకాలు ఆనందంగా దీపావళి పండుగ జరుపుకున్నారు.

– చాగంటి ప్రసాద్



నిర్వహణ:
డి.వి.ఆర్. భాస్కర్

### దీపావళి నాడు ఆచరించవలసినవి...

ఈ రోజున తెల్లవారు జామున్నే పెద్దల చేత తలకి నువ్వుల నూనె పెట్టించుకొని, తలంటు స్నానం చేయాలి. స్నానం చేసే నీటిలో మర్రి, మామిడి, అత్తి, జువ్వి, నేరేడు చెట్ల ఆకులను లేదా మండలను వేసి, ఆ నీటితో స్నానం చేయడం ఆరోగ్యకరం, మంగళప్రదం. ఈరోజు చేసే అభ్యంగన స్నానం సర్వ పాపాలను హరింపజేయడమే గాక గంగా స్నానంతో సమానమైన ఫలితాన్ని ఇస్తుందని శాస్త్రవచనం. దీపావళి నాడు విధివిధానంగా లక్ష్మీ పూజ చేయాలి. కాగా కొన్ని ప్రాంతాల్లో పగలంతా ఉపవాసం ఉండి సాయంకాలం లక్ష్మీ దేవిని పూజించే సంప్రదాయం ఉంది. దీపావళి రోజున లక్ష్మీదేవి భూలోకానికి దిగివచ్చి, ప్రతి ఇల్లు తిరుగుతూ శుభ్రంగా, మంగళకరంగా వున్న ఇళ్లలో తన కళ ఉంచిపోతుందట. అందుకే దీపావళి నాటికి ఇంటిలోని పనికిరాని వస్తువులను బయట పారవేసి ఇంటిని శుభ్రంగా చేసి, లక్ష్మీదేవి రావాలని కోరుతూ ఇంటిని అలంకరించాలి.

### శాస్త్రీయ కారణం

దీపావళినాడు టపాసులు పేల్చడం వెనుక కూడా ఒక కారణం ఉంది. ఇప్పుడు భూమి నుంచి పుట్టే వివిధ రకాలైన క్రిమికీటకాలు రోగాలను కలిస్తాయి. దీపావళి నాటి రాత్రి కాల్చే మందుగుండు సామగ్రి నుంచి వెలువడే పొగ, వాసన ఈ కాలంలో వ్యాపించే దోమలను, క్రిములను హరింపజేస్తాయి. అలాగని మరీ ఎక్కువగా కాలిస్తే, ఆ పొగ మనకు హాని చేస్తుంది, శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతుంది.

### దీపాలు ఎక్కడెక్కడ పెట్టాలి?

దీపావళి నాడు 5 ప్రదేశాల్లో దీపాలు తప్పక వెలిగించాలని శాస్త్రం చెప్పింది. వంట గదిలో, ఇంటి గడపకు ఇరువైపులా, బియ్యం, పప్పులు మొదలైనవి నిలువ ఉంచే ప్రదేశంలో, తులసి కోటలో లేదా తులసిమొక్క దగ్గర, రావి చెట్టు కిందా దీపారాధన చేయాలి. అంతేకాదు, పెద్ద వయసు వారు నివసిస్తున్న ఇళ్ళ దగ్గర, దేవాలయాలు, మఠాలు, గోశాలల్లో, పెద్ద వయసున్న చెట్ల వద్ద, ఆకాశదీపం (దేవాలయాల్లో అయితే ధ్వజస్తంభానికి వెలిగిస్తారు, మనం ఇళ్ళ పైకప్పు మీద పెట్టాలి), నదుల్లోనూ, చెరువుల్లోనూ దీపాలను వదలాలి. ప్రతి గదిలోనూ, ప్రతి మూలలోనూ దీపం వెలిగించాలి. అలాగే నాలుగు వీధుల కూడలిలో (నాలుగు రోడ్లు కలిసే ప్రదేశంలో) దీపం వెలిగించాలి. నువ్వుల నూనె దీపాలనే వెలిగించడం, మట్టి ప్రమిదలనే వాడడం శ్రేష్ఠం. చీకటిపడే సమయంలో దీపదానం చేసి, మండుతున్న గోగు కాడలని తిప్పాలి. ఇలా తిప్పడం చేత పీడ పోతుందని చెప్తారు. నిజానికి దీపావళి కొంత వరకు పితృదేవతలకు సంబంధించిన పండుగ. దీపావళినాటి సాయంత్రం గోగు కాడల మీద దివిటీలు వెలిగించి తిప్పుతారు. ఇవి పితృదేవతలకు దారిని చూపిస్తాయని, తద్వారా పితృదేవతలు సంతసిస్తారని, వారి దీవెనలు ఉంటే వంశం నిలబడుతుందనీ విశ్వాసం. తరువాత అలక్ష్మి (దరిద్రం) తొలగడానికి లక్ష్మీపూజ చేయాలి. ఆకులతో దొన్నెలు కుట్టి, దీపాలు వెలిగించి, నదుల్లోనూ, చెరువుల్లోనూ, సరోవరాల్లోనూ, బావుల్లోనూ వదలాలి. దీపావళిఅర్ధరాత్రి 12 గంటలకు చీపురుతో ఇల్లు చిమ్మి, చేటలపై కర్రలతోకొడుతూ, తప్పెట్ల చప్పుళ్లతోనూ, డిండిమం అనే వాయిద్యాన్ని వాయిస్తూ జ్యేష్ఠాలక్ష్మిని (దరిద్ర దేవతను) సాగనంపాలని శాస్త్రవచనం.

---

## సువార్త

### కొండపైన దర్శనం... లోయల్లో సేవా సాఫల్యం...

యేసుప్రభువు గలిలయ సముద్ర తీరంలోని ఒక కొండ పైన చేసిన ప్రసంగంలో మానవాళికి 'పరలోక ధన్యత'ను ప్రకటించాడు. పేదరికం, శ్రమలు, లేమి, ఆకలిదప్పుల వంటి ఎలాంటి సామాజిక అపశ్రుతులకు, ప్రతికూలతలకూ తావులేని 'దేవుని రాజ్యాన్ని 'తన కొండ మీది ప్రసంగం' ద్వారా ఆవిష్కరించాడు. అక్కడినుండి ఆరంభమై, మరో కొండయైన గొల్గొతాపై జరుగనున్న తన సిలువ యాగం దాకా సాగనున్న'మానవాళి రక్షణ మార్గ ప్రయాణం'లో మజిలీగా శిష్యుల్లో పేతురు, యాకోబు, యోహాను అనే ముగ్గురిని వెంటతీసుకొని రూపాంతర కొండగా పిలిచే మరో కొండకు యేసుప్రభువు వెళ్ళాడు. అక్కడ యేసుప్రభువు



ఆ ముగ్గురికీ తన పరలోక మహిమ రూపాన్ని చూపించాడు. పాత నిబంధన నాటి మోషే, ఏలీయా కూడా కొండ మీదికి దిగి రాగా అక్కడ యేసుప్రభువుతో వారి 'శిఖరాగ్ర సమావేశం' జరిగింది.అయితే యేసుప్రభువు, మోషే, ఏలీయాలు పాల్గొన్న అత్యంత ప్రాముఖ్యమైన ఆ ఆధ్యాత్మిక శిఖరాగ్ర సమావేశానికి దేవుడు పేతురు, యాకోబు, యోహానులనే అల్ప మానవులను కూడా పిలవడమే ఆశ్చర్యం కలిగించే అంశం. యేసు దేవస్వరూపుడు, మోషే ధర్మశాస్త్ర యుగానికి ప్రతినిధి, ఏలీయా ప్రవక్తలకు ప్రతినిధి కాగా, మరి పేతురు, యాకోబు, యోహాను ఎవరికి ప్రతినిధులు? యేసుప్రభువు తన సిలువ యాగం ద్వారా ఆవిష్కరించబోతున్న సరికొత్త దేవుని రాజ్యంలో సభ్యులుగా చేరబోతున్న విశ్వాసులందరికీ ఆనాడు వాళ్ళు ప్రతినిధులు. ఆ శిఖరాగ్ర సమావేశంలో 'ఇక్కడే ఉండిపోవడానికి పర్ణశాలలు కడతానంటూ' పేతురు చేసిన వ్యాఖ్యను, 'ఈయన నా ప్రియకుమారుడు, ఈయన మాట వినండి' అంటూ ఈ సమావేశాన్ని నిర్వహించిన పరిశుద్ధాత్ముడు వారినుద్దేశించి ఇచ్చిన ఆజ్ఞను సువార్త భాగాలు ప్రస్తావించాయి.

లోక మలినానికి దూరంగా ఉన్నహిమాలయాలతో సహా మహా పర్వతాల్ని ఆధ్యాత్మిక స్థావరాలుగా అన్ని మతాల్లాగే యూదు మతం కూడా పరిగణించేది. గొప్ప ఆధ్యాత్మిక దర్శనాలను దేవుడు తన ప్రజలకు కొండ పైన ఇస్తాడు. కానీ ఆ దర్శనాల నెరవేర్పు కోసం'సేవా క్షేత్రాలను' మాత్రం కొండ కింది లోయల్లోని సామాన్య ప్రజల సమక్షంలో చూపిస్తాడు. 'కొండ మీదే ఉండిపోదాం' అని ఎవరికి, మాత్రం ఉండదు? పేతురుకు కూడా అలాగే అనిపించింది, కానీ 'దర్శన సాఫల్యం' మాత్రం లోయల్లోని పాపులు, కరడు గట్టిన నేరగాళ్లు, దుర్మార్గులకు దేవుని ప్రేమను ప్రకటించడంలో ఉందని, అందుకు యేసు మాట వినండని దేవుడు వారికి ఆజ్ఞాపించాడు. దేవుని పక్షంగా మాట్లాడటం అంటే ప్రసంగించడం అందరికీ ఇష్టమే, కానీ దేవుని మాటలు వినడమే చాలా కష్టం. కానీ యేసు తన తండ్రి మాటలు విని, లోబడి లోయల్లోకి దిగి వెళ్లి వారిని ప్రేమించి ప్రాణత్యాగం చేశాడు. పేతురు, యాకోబు, యోహాను కూడా భూదిగంతాలకు వెళ్లి దేవుని ప్రేమను ప్రకటించి హత సాక్షులై తమ దర్శనసాఫల్యం పొందారు. అలా లోయల్లోని గొంగళిపురుగులను తమ అద్భుతమైన పరిచర్యతో విశ్వాస పరివర్తన చెందిన సీతాకోక చిలుకలుగా మార్చడానికి ఆనాటి రూపాంతర పర్వత శిఖరాగ్ర సమావేశం దిశానిర్దేశం చేసింది. కేవలం యూదులకే అంతవరకూ పరిమితమైన విశ్వాస జీవితం, నాటి రూపాంతరానుభవపు సార్వత్రిక దర్శనంతో, సర్వలోకానికి వర్తించే అపూర్వ ప్రేమమార్గమైంది. స్వనీతి, తామే జ్ఞానులం, తామే అధికులమన్న అహంకారానికి ప్రతీకగా మారిన యూదులు అనే గొంగళిపురుగు నుండే, సాత్వికత్వం, ప్రేమ, క్షమా అనే ఆత్మీయ సౌందర్యానికి ప్రతీకగా 'క్రైస్తవం' ఆవిర్భవించింది.

– రెవ.డా.టి.ఏ.ప్రభుకిరణ్
సంపాదకులు, ఆకాశధాన్యం
ఇ–మెయిల్: prabhukirant.@gmail.com

## ఆలయం ఆగమం

### భక్తసన్నిధి

ఆలయానికి భక్తులు వెళతారు... వస్తారు. కానీ కొందరు భక్తులు ఆలయానికి వెళ్లారు. భగవంతుడు తప్ప వేరెవరూ లేరని, ఆయన లేనిదేదీ ఎక్కడా లేదనీ.. ఉండదనీ తెలుసుకున్నారు. నిలిచిపోయారు. విగ్రహరూపంలో కొలువుదీరి పూజలందుకుంటున్నారు. మరికొందరు రాజులు.. చక్రవర్తులు..భగవత్ సన్నిధియే పెద్ద పెన్నిధి అని గ్రహించి ప్రతిమలై ఆయన్ని సేవించుకుంటున్నారు.

దక్షిణ భారతదేశంలో చాలా ఆలయాల్లో భక్తులకు ప్రత్యేకమైన స్థానం ఉంది. దాన్నే భక్త స్థానం.. భక్తస్థలం.. అనే పేర్లతో పిలుస్తారు.

స్త్రీలు.. పురుషులు.. రాజులు.. సామాన్యులు.. ఇలా ఎవరైనా భక్తితో భగవంతుని కొలిచి.. శాశ్వతంగా ప్రజల గుండెల్లో నిలిచి.. ఆలయాల్లో కూడా స్థానం సంపాదించుకున్నారు.



నంది, భృంగి, హనుమంతుడు, గరుడుడు.. దేవతలవ్వగా... దైవాంశసంభూతులని పిలిచే అరవై ముగ్గురు(63) శివభక్తులు(నాయనార్లు).. వైష్ణవభక్తులైన పన్నిద్దరు (12)ఆళ్వార్లు.. ఆచార్య పురుషులైన ఆదిశంకరులు.. రామానుజులు.. మధ్వులు.. మొదలైన వారంతా భక్తమూర్తుల కోవకు వస్తారు.

ఇలా భక్తుల విగ్రహాలను ప్రత్యేకమైన గుడిలో ప్రతిష్ఠిస్తే దాన్ని స్వయంప్రధాన ఆలయం అంటారు.

చాలా దేవాలయాల్లో ఆలయాన్ని నిర్మించిన.. జీర్ణోద్ధరణ చేసిన రాజులు.. రాణులు.. భక్తుల విగ్రహాలను స్థాపించారు. ఆలయంలో పూజలకై పూలమాలలు అల్లేచోట ఈ భక్తుల విగ్రహాలను ప్రతిష్ఠించవచ్చు.లేక ఆలయానికి ఈశాన్యంలో వీరిని ప్రతిష్ఠించవచ్చు.

సాధారణంగా భక్తుల విగ్రహాలు నిలుచుని అంజలి ముద్ర ధరించి, రాజులైతే కిరీటాది అలంకారాలు.. ఆభరణాలతో.. ఆచార్య పురుషులను కూర్చుని యోగముద్రతో.. స్త్రీలైతే వారి ఆభరణాలతో.. అలంకరించి ఉండాలని కాశ్యప శిల్పశాస్త్రం చెప్పింది. ఆగమాల్లో భక్తమూర్తి ప్రతిష్ఠ..పూజ.. మొదలైన విధులు ఉన్నాయి. వారి వారి జయంతి.. తిరునక్షత్రం వంటి సమయాల్లో విశేషపూజలు.. ఉత్సవం చాలా గొప్పగా నిర్వహిస్తారు. శివాలయంలో వీలుంటే 63 మందినీ.. లేకుంటే అప్పరు, సుందరుడు, మాణిక్యవాచకుడు, జ్ఞానసంబంధుడు అనే నలుగురిని పూజిస్తారు.

విష్ణ్వాలయంలో భట్టనాథుడు, భక్తిసారుడు, భక్తాంఘ్రిరేణుకుడు, గాయకుడు, పరకాలుడు, పరాంకుశుడు, మధురకవి, యతిరాజ, సరోజాతుడు, మహత్, కులశేఖరుడు, యోగివాహుడు మొదలైన ఈ పన్నెండుమందితో ఆళ్వార్ సన్నిధి మనం చూడవచ్చు. వీరితో పాటు గోదాదేవి ఆండాళ్ కూడా ఉంటుంది.

అఖండ భక్తికి తార్కాణాలుగా నిలిచే ఈ భక్తదేవులను దర్శించి మనం కూడా భక్తితత్త్వాన్ని మరింతగా పెంపొందించుకుందాం.

– కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య
ఆగమ, శిల్పశాస్త్ర పండితులు



## స్త్రీ వైశిష్ట్యం - 14

### ధర్మం ఎక్కడుంటే అక్కడే విజయం



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

గాంధారికి బహుసంతానవతి అని వరముంది. ఆమెకు సంతానాపేక్ష ఎక్కువే అయినా భర్త, సంతానం అంతా ధర్మం తప్పి ప్రవర్తించినా తాను మాత్రం ధర్మపక్షపాతియై ధర్మం విషయంలో ఎక్కడా ఆమె వెనుకంజ వేయకుండా మాట్లాడగలిగిన స్థితిని పొందింది.

ఒకసారి దుర్యోధనుడు వచ్చి తల్లి కాళ్లకు నమస్కరించి'నాకు విజయం కలగాలి' అని ఆశీర్వచనం చేయమన్నాడు. ఆమె మాత్రం నిర్మోహమాటంగా..'' ధర్మం ఎక్కడుంటుందో అక్కడే విజయం. నీకు విజయం కావాలనుకుంటే ధర్మాన్ని నిరంతరం పట్టుకునే ధర్మరాజు పాదాలను ఆశ్రయించు. ఆయనకు వశవర్తియై ప్రవర్తించు. అప్పుడు ధర్మాన్ని నీవు పొందుతావు. దాని కారణంగా విజయాన్ని కూడా పొందుతావు తప్ప నీవు అధర్మాన్ని పట్టుకుని గెలవలేవు సుయోధనా...''అంది.

కానీ యుద్ధభూమిలోకి వెళ్ళి చూసినప్పుడు కొడుకులందరూ మరణించి ఉన్నారు. అందునా దుశ్శాసనుడు భయంకరంగా వక్షస్థలం బద్దలయి పడిపోతే....ఆమె కోపం అటుతిరిగి ఇటు తిరిగి ఎవరి మీద నిలబడాలో తెలియక అంతటి గాంధారి కూడా పుత్రవ్యామోహాన్ని పొంది కృష్ణుడి వంక చూసి అంది..''అన్నీ నీకు తెలుసు కృష్ణా, వీరందరూ మరణిస్తారని తెలుసు. నువ్వే పూనుకుని ఉంటే నా కొడుకులు ఇలా చనిపోయేవారు కాదు. దీనికంతటికీ కారణం కృష్ణా నువ్వే... నీ యదువంశంలో కూడా ఇలా ఒకరితో ఒకరు కొట్టుకుని నశించి పోయెదరు గాక.. కొన్ని సంవత్సరాల తరువాత నువ్వు కూడా దిక్కులేని చావు చచ్చెదవుగాక '' అని శపించింది.

దానికి కృష్ణుడు నవ్వి ''అమ్మా! ధర్మానికి వంతపాడినందుకు నాకు నువ్విచ్చే కానుకా ఇది..!!!'' అన్నాడు. ఆ మాటతో ఇంతటి మహోన్నతమైన గాంధారి కూడా కుంచించుకు పోయింది. ఎంత చెప్పినా వినకుండా అగ్నిహోత్రాన్ని కౌగిలించుకుని మడిసిపోయిన నూరుగురు కొడుకులను చూసుకుని ఆఖరున వృద్ధాప్యంలో తల్లి దండ్రులను చూసుకోవడానికి ఒక్కడూ కూడా బతకలేదు కదా... ధర్మాన్ని వదిలిపెట్టి ఇంత మంది పడిపోయారా.. అని వ్యాకులత చెంది కుంతిబిడ్డల పంచనజేరి జీవితం గడుపుతూ, భీముడనే మాటలు వినలేక ధృతరాష్ట్ర మహారాజుతో కలిసి వానప్రస్థానానికి వెళ్ళిపోయి అక్కడ దావాగ్నిలో శరీరాన్ని విడిచిపెట్టేసింది.

అలాగే కుంతీదేవి. ఆమె కుంతిభోజుని కుమార్తె కాదు, శూరసేనుడి కుమార్తె. అందుకే శ్రీ కృష్ణుడికి మేనత్త, వసుదేవునికి చెల్లెలు. అసలు తండ్రి పెట్టిన పేరు పృథ. కుంతిభోజుడు పెంచుకున్నాడు. కాబట్టి కుంతీదేవి అయింది. భారతం చదివితే ఆమెలో ఎన్ని ఉత్థానపతనాలు, ఎంత సహనం, ఎన్ని గొప్ప లక్షణాలు... ఆశ్చర్యమేస్తుంది. అంపశయ్య మీద ఉన్న భీష్మాచార్యుల వారు ఎవరి క్షేమసమాచారం గురించి తెలుసుకోవాలనుకున్నారో తెలుసా? కుంతీదేవిని గురించి. అంతటి భీష్ముడు ఒకమాటన్నారు– ''అసలు ఆ కుంతీదేవిలాంటి స్త్రీ లోకంలో ఉంటుందా? ఎన్ని కష్టాలు పడి పిల్లల్ని పెంచిందో, మహా ఔన్నత్యం కల తల్లి'' – అన్నారు.



## గురు సన్నిధి

### సద్గురు శ్రీ శివానందమూర్తి

ఆయన ఓ ఆధ్యాత్మిక జ్ఞానదీప్తి. మూర్తీభవించిన మానవతామూర్తి. సనాతనధర్మ ప్రబోధకుడు, దివ్యతేజో సంపన్నుడు. పరహితమే తనసంకల్పంగా మార్చుకున్న ఆధునిక మహర్షి. గత కాలపు సౌరభాలతో భవిష్యద్భారతానికి సేతువు నిర్మించిన అద్భుత స్రష్ట. దేశహితంకోసం అనునిత్యం తపించిన ఆర్షధర్మజ్యోతి. వారే సద్గురు శ్రీశివానందమూర్తి. బహుముఖాలుగా సాగిన వీరి పాండిత్య పరిధి విస్తతమైనది. వ్యక్తిగతప్రయోజనాలు ఆశించని వారిజీవితం రాగద్వేషాలకు అతీతమైనది.

వేదాలు–ఉపనిషత్తులు–పురాణేతిహాసాలు–దర్శనాలు–ధర్మశాస్త్రాలు–సంప్రదాయకళలు ఇలా వారు స్పృశించని అంశాలే లేవు.

సనాతనధర్మంలోని విభిన్న సంప్రదాయాలను ఆకళింపు చేసుకొని, అన్నింటికీ మూలం ఒక్కటేనన్న సమన్వయాన్ని నేటిసమాజానికి ప్రబోధించారు. తాను ప్రవచిస్తున్న ధర్మానికి తానే తార్కాణంగా నిలవడం వీరి విశిష్ట లక్షణం. తేటతెల్లంగా మహాసత్యాన్ని చెప్పగలిగే ప్రతిభతో శివానందమూర్తి ప్రపంచవ్యాప్తంగా ఎందరో మేధావుల్ని ప్రభావితంచేసి, వారి ప్రజ్ఞకు మార్గనిర్దేశం చేసారు.

శైవపీఠాన్ని స్థాపించి దాని ద్వారా ధర్మరక్షకై తనవంతుగా... కవి పండిత కళాపోషణ, గ్రంథ ప్రచురణలకు ఆర్థిక సహాయమందించటం, దేశ–విదేశ పర్యటనలలో ప్రాచీన సంస్కృతీ వైభవాన్ని ఎలుగెత్తి చాటడం వారి నిత్యకత్యాలుగా మార్చుకున్నారు.

సనాతన సాహిత్యాన్ని ఔపాసనబట్టి అనేక పుస్తకాలు, వ్యాసాలు రచించారు. వేదోపనిషత్తుల సారభూతంగా ఆంగ్లాంధ్ర భాషలలో వారందించిన రచనలు తాత్త్విక వాఙ్మయంలో సమున్నత శిఖరాలు. ఎందరో అన్వేషకులు వీరి రచనలతో, స్ఫూరిమంతమైన ఉపదేశామృతధారలలో పునీతులయ్యారు.



### నిజాయతీ నా స్వభావం

"నిజాయితీ నా విధానం కాదు, నా స్వభావం" అని త్రికరణశుద్ధిగా చెప్పిన సద్గురువులు కందుకూరు శివానందమూర్తిగారు. "ఆవేశాలకు, ఉద్రేకాలకు లొంగకుండా బుద్ధిని ఆలోచనలతో అనుసంధానం చేస్తే చాలు. ఒక ప్రేరణ మనస్సులో ప్రసరిస్తుంది. అది కర్తవ్య పథాన్ని నిర్దేశించి, విజయాన్ని సమకూర్చగలుగుతుందన్న" వారి భాషణలు మానవుడ్ని నిజమైన జీవన తీరాలవైపు పయనింపజేస్తాయి.

– అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని
వేదపండితులు

# సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

ఆదివారం
27-10-2019


## ఉద్యోగ సమాచారం

### టెక్స్‌టైల్ కమిటీలో 16 పోస్టులు

ముంబైలోని భారత ప్రభుత్వ టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖకు చెందిన టెక్స్‌టైల్ కమిటీ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 16 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. **క్వాలిటీ అష్యూరెన్స్ ఆఫీసర్ (ఈపీ అండ్ క్యూఏ)- 13.**
   - **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/టెక్స్‌టైల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి టెక్స్‌టైల్ మాన్యుఫ్యాక్చర్/టెక్నాలజీలో డిగ్రీ/డిప్లొమా లేదా హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో డిప్లొమా పూర్తి చేసి ఉండాలి. నిర్దిష్ట అనుభవం తప్పనిసరి.
   - **వయసు:** 25 ఏళ్లకు మించకూడదు.
2. **క్వాలిటీ అష్యూరెన్స్ ఆఫీసర్ (ల్యాబ్)-2**
   - **అర్హత:** మాస్టర్స్ డిగ్రీ ఇన్ సైన్స్/టెక్నాలజీ లేదా బ్యాచిలర్స్ ఇన్ సైన్స్/టెక్నాలజీ లేదా టెక్స్‌టైల్ కెమిస్ట్రీ/టెక్నాలజీలో డిప్లొమా పూర్తి చేయడంతో పాటు అనుభవం ఉండాలి.
   - **వయసు:** 21-27 ఏళ్ల మధ్య ఉండాలి.
3. **అకౌంటెంట్: 1**
   - **అర్హత:** ఎంకామ్/బీకామ్ ఉత్తీర్ణతో పాటు అనుభవం ఉండాలి.
   - **వయసు:** 25-30 ఏళ్ల మధ్య ఉండాలి.
   - **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
   - **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
   - **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 4, 2019.
   - **వెబ్‌సైట్:** www.textilescommittee.nic.in

### సీడ్యాక్‌లో 18 పోస్టులు

బెంగళూరులోని భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, సమాచార మంత్రిత్వ శాఖకు చెందిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడ్యాక్) ఒప్పంద ప్రాతిపదికన 18 ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్/ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 6, 2019.
- **వెబ్‌సైట్:** www.cdac.in

### ఫ్యాక్ట్‌లో 52 పోస్టులు

ది ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావన్‌కోర్ లిమిటెడ్ (ఫ్యాక్ట్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 52 పోస్టుల భర్తీకి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** అసిస్టెంట్ మేనేజర్ -24, టెక్నీషియన్-28.
- **విభాగాలు:** ప్రొడక్షన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫైర్ అండ్ సేఫ్టీ, థర్మల్ ఎలక్ట్రికల్, థర్మల్ మెకానికల్, క్వాలిటీ అష్యూరెన్స్.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో బీఎస్సీ డిగ్రీ, ఇంజనీరింగ్ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 35 ఏళ్లు; టెక్నీషియన్ పోస్టులకు 37 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 13, 2019.
- **వెబ్‌సైట్:** http://fact.co.in

### బెల్‌లో 19 పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్).. ఒప్పంద ప్రాతిపదికన 19 ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఎలక్ట్రానిక్స్-13, మెకానికల్-6.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, నవంబర్ 1 నాటికి 25 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు; పీడబ్ల్యూడీలకు పదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 2, 2019.
- **వెబ్‌సైట్:** www.bel-india.in

### పీజీసీఐఎల్‌లో 28 పోస్టులు

గురుగ్రామ్ (హరియాణా) భారత ప్రభుత్వ శక్తి మంత్రిత్వ శాఖకు చెందిన పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్).. ఒప్పంద ప్రాతిపదికన 28 ఫీల్డ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** ఎలక్ట్రికల్-22, సివిల్-6.
- **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ (ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, అక్టోబర్ 31 నాటికి 29 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** స్ర్కీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.400.
- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబర్ 31, 2019.
- **వెబ్‌సైట్:** https://webapps.powergrid.in

### సీఎస్‌ఎల్‌లో 45 పోస్టులు

కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 45 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ కమర్షియల్ అసిస్టెంట్, స్టోర్ కీపర్, వెల్డర్ కమ్ ఫిట్టర్, ఫిట్టర్ తదితర పోస్టులున్నాయి.
- **అర్హత:** పదో తరగతి, సంబంధిత ట్రేడ్/సబ్జెక్టుల్లో ఐటీఐ, డిప్లొమా (ఇంజనీరింగ్), గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, నవంబర్ 18 నాటికి 40 ఏళ్లకు మించకూడదు.

» **ఇంజనీర్ పోస్టులు:** 8

- **విభాగాలు:** అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అకౌంటెంట్.
- **అర్హత:** ఇంటర్మీడియట్, సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా (ఇంజనీరింగ్), గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, నవంబర్ 18 నాటికి 45 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** రాతపరీక్ష (ఫేజ్-1, ఫేజ్-2) ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.200.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 18, 2019.
- **వెబ్‌సైట్:** https://cochinshipyard.com

# గ్రామీణ డాక్ సేవక్

## పోస్టల్ జాబ్స్

ఇండియన్ పోస్టల్ డిపార్ట్‌మెంట్... ఢిల్లీ నుంచి గల్లీ వరకూ... ఉద్యోగాలు కల్పిస్తున్న సంస్థ..! తాజాగా నిరుద్యోగుల్లో ఆనందం నింపుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పోస్టల్ సర్కిల్స్‌లో.. గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఉద్యోగార్థులకు ఉపయోగపడేలా నోటిఫికేషన్ వివరాలు, అర్హతలు, దరఖాస్తు విధానం, ఎంపిక ప్రక్రియ...

» పదో తరగతితోనే కేంద్ర ప్రభుత్వ కొలువు
» టెన్త్ మార్కుల ఆధారంగా ఎంపికలు

» **పోస్టుల సంఖ్య:**
ఆంధ్రప్రదేశ్: 2,707, తెలంగాణ: 970.

### బ్రాంచ్ పోస్టు మాస్టర్ (బీపీఎం)

జీడీఎస్ బ్రాంచ్ పోస్టాఫీసు వ్యవహారాలతో పాటు ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంక్(ఐపీపీబీ) కౌంటర్ కార్యకలాపాలు యథావిధిగా జరిగేలా చూడాల్సి ఉంటుంది. పోస్టల్ ఫెసిలిటీస్, రికార్డుల నిర్వహణ, బ్రాంచ్ పోస్టాఫీసు పరిధిలోని గ్రామ పంచాయతీల్లో పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ సేవలకు సంబంధించిన మార్కెటింగ్ తదితరాలు ప్రధాన విధులుగా ఉంటాయి.

### అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ (ఏబీపీఎం)

స్టాంపులు/స్టేషనరీ అమ్మకం, ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంకు డోర్ స్టెప్ డిపాజిట్స్/పేమెంట్స్/తదితరాలకు సంబంధించిన మెయిల్స్ (జాబు) పంపడం ముఖ్య విధులు. దీంతోపాటు మార్కెటింగ్, మీల్స్ ఏర్పాటు, బిజినెస్‌ను పెంపొందించడం వంటివి చేయాల్సి ఉంటుంది.

### డాక్ సేవక్

స్టాంప్స్, ఇతర స్టేషనరీ అమ్మకం, మెయిల్స్ డెలివరీ, పోస్టల్ పేమెంట్స్ బ్యాంకు విధులతో పాటు పోస్టుమాస్టర్, అసిస్టెంట్ పోస్టుమాస్టర్ అప్పగించిన విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

### ఎంపిక ప్రక్రియ

ఎంపిక ప్రక్రియ పూర్తిగా మెరిట్ ఆధారంగా జరుగుతుంది. ఎలాంటి రాత పరీక్ష ఉండదు. పదో తరగతి లేద తత్సమాన కోర్సులో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

### ముఖ్య సమాచారం

- **విద్యార్హత:** ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత. స్థానిక భాష తప్పనిసరిగా వచ్చి ఉండాలి.
- **వయసు:** అక్టోబరు 15 నాటికి 18 నుంచి 40 సంవత్సరాలు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు వయోసడలింపు ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లించేందుకు చివరితేదీ:** నవంబర్ 14
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 21
- **వివరాలకు:** http://www.appost.in, https://telanganapostalcircle.in



# టెక్ టీచర్స్

# యాప్స్ పాఠాలు

నేర్చుకోవాలనే తపన ఉండాలే కానీ.. ఇప్పుడు మార్గాలు అనేకం! గతంలోలా కాలేజీకి, క్లాస్‌రూమ్‌కే వెళ్లి పాఠాలు వినాల్సిన అవసరంలేదు. స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే చాలు.. మన చేతి మునివేళ్ల మీదే ఎంతో సమాచారం అందుబాటులోకి వచ్చేసింది. యాప్స్, యూట్యూబ్, వెబ్‌సైట్స్, బ్లాగ్స్, మూక్స్ వంటి టెక్ టీచర్‌లకు కొదవలేదు!! కంప్యూటర్, మ్యాథ్స్, లాంగ్వేజెస్, సైన్స్, సోషల్ లాంటి సంప్రదాయ కోర్సులతోపాటు మన మనసుకు నచ్చేవి కూడా డిజిటల్ వేదికగా నేర్చుకునే వీలుంది. ఫుడ్, యోగా, ఫ్యాషన్, మ్యూజిక్, ఇంగ్లిష్, జర్మన్, జపనీస్, స్పానిష్ వంటి విదేశీ భాషలు హాబీగా నేర్చుకోవడానికి వీలు కల్పిస్తున్న టెక్ టీచర్స్ గురించి తెలుసుకుందాం...

టెక్ టీచర్లుగా యాప్స్, యూట్యూబ్, వెబ్‌సైట్స్, మూక్స్

ఇష్టమైన వ్యాపకాలు ఇంటివద్దనే కూర్చొని నేర్చుకోవచ్చు

### వహ్ వహ్ వంటలు

కొత్త వంటలు నేర్చుకోవడం ఇప్పుడు వృత్తిపరంగా, వ్యక్తిగతంగా కూడా అవసరంగా మారింది. రక రకాల రెసిపీలపై ప్రయోగాలు చేయాలనుకునే వారికి యూట్యూబ్‌లో లభించే కంటెంట్ ఎంతో ఉపయోగపడుతోంది. గ్రామీణ వంటకాలు,ఆరోగ్యకరమైన వంటలు, దేశ విదేశీ ఫుడ్స్, పాపులర్ స్ట్రీట్ ఫుడ్స్ గురించి తెలుసుకోవాలనుకునే ఫుడ్‌లవర్స్‌కు, నేర్చుకోవాలనుకునే అభిరుచి ఉన్న వారికి యూట్యూబ్ మంచి టెక్ టీచర్ అని చెప్పొచ్చు. వంటల గురించి నేర్చుకోవాలను వారికి యూట్యూబ్‌లో ఎన్నో ఫుడ్ చానెల్స్ అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా ప్రాంతీయ భాషల్లోనూ వంటలు నేర్పించే చానెల్స్ సంఖ్య పెరిగింది. తెలుగులోనూ రుచికరమైన వంటలు నేర్పించే చానెల్స్ ఎన్నో వచ్చేశాయి. కుకింగ్ కోర్సులు.. మూక్స్‌లోనూ అందుబాటులో ఉన్నాయి. నామమాత్రపు ఫీజులతో కుకింగ్ స్కిల్స్, హెల్తీ కుకింగ్ ఫండమెంటల్స్ నేర్చుకోవచ్చు. సంజీవ్ కపూర్ ఖజానా, వావ్ చెఫ్, టేస్టీ, నిషా మధులిక, కబితాస్ కిచెన్, గ్రాండ్‌పా కిచెన్, కంట్రీ ఫుడ్స్, స్ట్రీట్‌ఫుడ్, అత్తమ్మ టీవీ, మన వంటిల్లు, మన చెఫ్,గాయత్రి వంటిల్లు, రెసిపి టేబుల్, లతా చానెల్, హైదరాబాదీ రుచులు వంటి చానెల్స్ తెలుగు వారికి సుపరిచితం.




### ఫిట్ నెస్ గురూ

మిలీనియల్స్ యువత ఫిట్‌నెస్ మంత్రం జపిస్తోంది. అందుకోసం ఆరోగ్యకరమైన డైట్ గురించి గైడ్ చేసే యాప్స్‌ను ఆశ్రయిస్తోంది. అలాంటి వారికి హెల్తీ టిప్స్ అందించే ఫిట్‌నెస్ యాప్స్ ప్లేస్టోర్‌లో కోకొల్లలు. నామమాత్రపు ఫీజులతో డైట్ కోర్సులు, న్యూట్రిషన్ కోర్సుల్లో చేరొచ్చు. బరువు నియంత్రణలో ఉంచుకునే ఆన్‌లైన్ కోర్సులు కూడా చేయొచ్చు.

### విదేశీ భాషలు

ఇంగ్లిష్, జర్మన్, జపనీస్, స్పానిష్ వంటి వివిధ విదేశీ భాషలను నేర్పించే యాప్స్ ఇప్పుడు ఆన్‌లైన్‌లో కోకొల్లలు. ఆయా యాప్స్ ద్వారా ఉచితంగానే ఇంగ్లిష్‌తోపాటు కొత్త కొత్త భాషలు నేర్చుకునే వీలుంది.

### యోగా

యోగా.. మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుంది. గత కొన్నేళ్లుగా యోగాపై అవగాహన పెరుగుతూ వస్తోంది. దాంతో పలు ఇన్‌స్టిట్యూట్లు యోగా సంబంధిత డిప్లొమా కోర్సులు, సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్నాయి. అయితే యాప్స్ వంటి టెక్ టీచర్స్ సాయంతో ఇంటి వద్దే ఉండి ఆన్‌లైన్‌లోనూ యోగా నేర్చుకునే వీలుంది. యాప్స్, యూట్యూబ్ వీడియోల ద్వారా యోగాను ప్రాక్టీస్ చేయవచ్చు. వీటిల్లో చాలావరకు పెయిడ్ యాప్స్ ఉండగా.. యూట్యూబ్‌లో ఉచితంగా కొంత కంటెంట్ ఉంది. నేర్చుకోవాలనే పట్టుదల ఉంటే.. స్మార్ట్ ఫోన్ ద్వారానే యోగాను సులువుగా దశల వారీగా నేర్చుకోవచ్చు. యోగా తరగతులకు రెగ్యులర్‌గా వెళ్లే వీలు లేని యువత ఇటువంటి యాప్స్‌ను ఉపయోగించుకోవచ్చు. యాప్స్ పనిచేయాలంటే.. ఇంటర్నెట్ కనెక్షన్ అవసరం. అయితే ఇంటర్నెట్ అవసరం లేకుండానే కొన్ని యాప్స్‌ను ఉపయోగించుకునే సౌకర్యం కూడా ఉంది. చాలా యాప్స్ ఉచితంగా ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా యోగాసనాల గురించి ఇమేజ్‌ల ద్వారా, వీడియోల ద్వారా చక్కగా నేర్చుకోవచ్చు.

- యోగా విత్ అడ్రైన్‌లో వీడియోలు అందుబాటులో ఉన్నాయి. చాలా వీడియోల ప్లే లిస్టులు చూడొచ్చు. ఉచితంగా వీటిని వీక్షించవచ్చు. ప్రారంభం నుంచి క్లాసులు వినవచ్చు.
- ఎక్‌హార్ట్ యోగా యుట్యూబ్‌లో కూడా మనకు అనేక రకాల యోగా వీడియోలు లభిస్తున్నాయి. వీరి యాప్ కూడా అందుబాటులో ఉంది.
- వీటితోపాటు మరెన్నో పెయిడ్, ఫ్రీ యాప్స్‌ను ప్లేస్టోర్‌లో చూడొచ్చు.
- యోగా, మెంటల్ హెల్త్ పేరిట ఉన్న మూక్స్ కోర్సులను నేర్చుకోవచ్చు. యోగా ప్రాక్టీస్ పేరుతోనూ పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- స్వామి రాందేవ్ యూట్యూబ్ చానెల్‌లో యోగాకు సంబంధించి కంటెంట్ అందుబాటులో ఉంది.

### మ్యూజిక్

మ్యూజిక్ సంబంధిత కోర్సులు కూడా ఆన్‌లైన్ పద్ధతుల్లో నేర్చుకునే వీలుంది. నచ్చిన మ్యూజిక్ పరికరంపై పట్టు సాధించేందుకు పలు రకాల యాప్స్ అందుబాటులో ఉన్నాయి.

- పియానో, గిటార్, వంటివి నేర్చుకోవడానికి యూజిషియన్ అనే యాప్ ఉపయోగపడుతుంది. కొత్తగా ప్రారంభించే వారికి ఇది వర్చువల్ టీచర్‌గా పనిచేస్తుంది.
- గిటార్ నేర్చుకోవాలనుకుంటే.. గిటార్+అనే యాప్ ఉపయోగపడుతుంది. ఇందులో అభ్యర్థి ఇష్టాల మేరకు పర్సనలైజ్డ్ సర్వీసులున్నాయి.
- పియానోను నేర్చుకోవాలనుకుంటే.. పియానో ఫ్రీ అనే యాప్ అందుబాటులో ఉంది.
- డీజే మ్యూజిక్ మిక్సర్ ఎడ్డింగ్ మిక్స్ యాప్ ద్వారా పాటల మిక్సింగ్‌కు అవకాశముంది.
- రియల్ డ్రమ్.. సొంతంగా కంపోజింగ్ చేసుకునేందుకు ఈ యాప్ దోహదపడుతుంది.

# ఐఎఫ్ఎస్ మెయిన్ 2019

యూపీఎస్సీ.. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) మెయిన్-2019 పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. ఐఏఎస్, ఐపీఎస్‌ల తర్వాత ఆ స్థాయి హోదా, గౌరవం ఐఎఫ్ఎస్ ద్వారా లభిస్తాయి. దీంతో ఐఎఫ్ఎస్‌కు పోటీ పడే అభ్యర్థుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో... ప్రిలిమ్స్‌లో విజయం సాధించి మెయిన్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉపయో గపడేలా ఐఎఫ్ఎస్ మెయిన్ పరీక్ష ప్యాట్రన్, ప్రిపరేషన్ టిప్స్...




» డిసెంబర్1వ తేదీ నుంచి ఐఎఫ్ఎస్ మెయిన్ పరీక్షలు
» విజయ సాధనలో అన్వయ నైపుణ్యాలు కీలకం



మెయిన్ ఎగ్జామినేషన్ రెండు సెషన్లుగా ఉంటుంది. మొదటి సెషన్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు; రెండో సెషన్ మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది.

### పరీక్ష విధానం

- **పేపర్ 1- జనరల్ ఇంగ్లిష్:** 300 మార్కులు
- **పేపర్ 2- జనరల్ నాలెడ్జ్:** 300 మార్కులు
- **పేపర్ 3/4/5/6:** ఇవి ఆప్షనల్ సబ్జెక్టులకు సంబంధించిన పేపర్లు. ప్రతి సబ్జెక్టు నుంచి రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్‌ను 200 మార్కులకు నిర్వహిస్తారు. అన్ని పేపర్లు రాత పరీక్ష (వ్యాసరూప) విధానంలోనే ఉంటాయి.

| తేదీ | ఉదయం | మధ్యాహ్నం |
|---|---|---|
| డిసెంబర్ 1 | జనరల్ ఇంగ్లిష్ | జనరల్‌నాలెడ్జ్ |
| డిసెంబర్ 3 | మ్యాథ్స్/స్టాటిస్టిక్స్ పేపర్ 1 | మ్యాథ్స్/స్టాటిస్టిక్స్ పేపర్ 2 |
| డిసెంబర్ 4 | ఫిజిక్స్/జువాలజీ పేపర్ 1 | ఫిజిక్స్/జువాలజీ పేపర్ 2 |
| డిసెంబర్ 5 | కెమిస్ట్రీ/జియాలజీ పేపర్ 1 | కెమిస్ట్రీ/జియాలజీ పేపర్ 2 |
| డిసెంబర్ 6 | అగ్రికల్చర్ పేపర్/ యానిమల్ హజ్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్ పేపర్ 1 | అగ్రికల్చర్ పేపర్/ యానిమల్ హజ్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్ పేపర్ 2 |
| డిసెంబర్ 7 | ఫారెస్ట్రీ పేపర్ 1 | ఫారెస్ట్రీ పేపర్ 2 |
| డిసెంబర్ 8 | అగ్రికల్చరల్/సివిల్/ కెమికల్/మెకానికల్ ఇంజనీరింగ్ పేపర్ 1/ బోటనీ పేపర్ 1 | అగ్రికల్చరల్/సివిల్/ కెమికల్/మెకానికల్ ఇంజనీరింగ్ పేపర్ 2/ బోటనీ పేపర్ 2 |

## ప్రిపరేషన్ ఇలా

ఐఎఫ్ఎస్ మెయిన్‌లో అభ్యర్థి అకడెమిక్ సామర్థ్యాలు, విషయావగాహన, విజ్ఞానాలను పరీక్షిస్తారు.

### ఇంగ్లిష్

అభ్యర్థుల్లో చాలామంది ఇంగ్లిష్ పేపర్‌ను తేలిగ్గా తీసుకుంటుంటారు. ఇది సరికాదు. ఇంగ్లిష్‌లో తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు సాధించవచ్చు. ప్రిపరేషన్ పరంగా రిపోర్ట్ రైటింగ్, ప్రెసిస్ రైటింగ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి. మోస్తరుగా ప్రిపేరయినా ఈ పేపర్‌లో సులభంగా 200 మార్కులు పొందేందుకు అవకాశం ఉంది.

- అభ్యర్థులు ఇంగ్లిష్‌లో వ్యాసాలు రాయడం ప్రాక్టీస్ చేయాలి.
- ఈ పేపర్ నుంచి అడిగే ఇతర ప్రశ్నలు వాస్తవ పరిస్థితుల్లో ఉపయోగించే పదాలపై అభ్యర్థులకున్న అవగాహనను పరీక్షించేవిగా ఉంటాయి.
- పాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు.

### జనరల్ నాలెడ్జ్

జనరల్ నాలెడ్జ్ పేపర్‌పై అభ్యర్థులు పూర్తి స్థాయిలో ఫోకస్ చేయాలి. ఈ పేపర్‌లో చరిత్ర, పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ తదితర కోర్ సబ్జెక్టులతోపాటు సమకాలీన అంశాలపై ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ స్థాయిల్లోని చర్చనీయాంశాలపై దృష్టిసారించాలి. ఆయా అంశాలను విశ్లేషించగలిగే నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. అదేవిధంగా పాలిటీ, హిస్టరీ, జాగ్రఫీల్లోని ప్రాథమిక అంశాలపై పట్టుసాధించాలి. కరెంట్ ఈవెంట్స్, దైనందిన అంశాలు, వాటి శాస్త్రీయతను పరీక్షించడం ద్వారా విజయావకాశాలు మెరుగవుతాయి.

### స్పష్టత

సాధారణంగా మెయిన్ ఆప్షనల్స్ సబ్జెక్టుల్లో ఒకటి అభ్యర్థి అకడెమిక్ బ్యాగ్రౌండ్‌కు సంబంధించింది, మరొకటి కొత్తదిగా ఉంటుంది. అభ్యర్థులు ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. కొత్తగా ఎంచుకున్న సబ్జెక్టుకు సంబంధించి అధిక సమయం వెచ్చించాలి. సదరు సబ్జెక్టు ప్రాథమిక భావనలు, సిద్ధాంతాలు, ముఖ్యాంశాలపై పట్టుసాధించాలి.

### ప్రాక్టీస్

- గత ప్రశ్నపత్రాల సాధన ప్రిపరేషన్‌లో కీలకంగా నిలుస్తుంది. తద్వారా ప్రశ్నల సరళి, స్వీయసామర్థ్యం, ప్రిపరేషన్ తీరుపై అవగాహన లభిస్తుంది. కాబట్టి గత ఐదారేళ్ల పేపర్లను ప్రాక్టీస్ చేయాలి.
- ప్రిపరేషన్ పరంగా అనువర్తనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. సబ్జెక్టుపై పట్టుసాధించడం ఎంత ముఖ్యమో... ఆయా అంశాలను వాస్తవ పరిస్థితులకు అన్వయించడం అంతే ప్రధానం.
- ప్రిపరేషన్‌లో ప్రశ్నలు, సమాధానాలను విశ్లేషిస్తూ ముందుకెళ్లాలి. తద్వారా వివిధ అంశాలు, వాటి ప్రిపరేషన్ పరంగా స్వీయ సామర్థ్యంపై అవగాహన ఏర్పడుతుంది.

### సమయ నిర్వహణ

ప్రిపరేషన్ పరంగా అన్ని సబ్జెక్టులకు సమయం కేటాయించాలి. ఆ దిశగా పక్కా ప్రణాళిక రూపొందించుకొని.. దాన్ని తుచా తప్పకుండా అమలుచేయాలి. ప్రిపరేషన్ పరంగా రోజుకి పది గంటలకు తగ్గకుండా చదవాలి. దీంతోపాటు ప్రతి సబ్జెక్టుకు నిర్దిష్ట సమయం కేటాయించాలి. సబ్జెక్టు, అంశాల క్లిష్టత, బలాలు, బలహీనతలను బేరీజు వేసుకొని టైం టేబుల్‌ను రూపొందించుకోవాలి. ప్రిపరేషన్‌పై స్వీయ విశ్లేషణతో ఎప్పటికప్పుడు టైం టేబుల్‌లో మార్పులు చేసుకోవాలి.

### పర్సనాలిటీ టెస్ట్ /ఇంటర్వ్యూ

- ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్ 300 మార్కులకు జరుగుతుంది. ఇంటర్వ్యూలో అభ్యర్థి సర్వీస్‌కి సరితూగుతాడా లేదా అనే విషయాన్ని పరీక్షిస్తారు. ఇందులో భాగంగా సబ్జెక్టుకు సంబంధించిన అంశాలతోపాటు రాజకీయ, సాంస్కృతిక, సామాజిక అంశాల్లో అభ్యర్థుల అవగాహనను అంచనా వేస్తారు. సమకాలీనాంశాలు, తాజాగా వెలుగులోకి వచ్చిన కొత్త ఆలోచనలు, సొంత రాష్ట్రం, దేశంలో వచ్చిన నూతన ఆవిష్కరణల గురించి తెలుసుకోవడం ద్వారా ఇంటర్వ్యూలో మెరుగైన ప్రదర్శన ఇవ్వొచ్చు.
- ఇంటర్వ్యూలో ముఖ్యంగా అభ్యర్థిలోని విజ్ఞాన తృష్ణ, క్రిటికల్ థింకింగ్, నిర్ణయాలు తీసుకోవడంలో ఉన్న స్థితప్రజ్ఞత, మానసిక, శారీరక సామర్థ్యాలను వాస్తవ పరిస్థితులకు ఎలా అన్వయించగలరు, భౌగోళిక అవగాహన, ఔట్‌డోర్ వాతావరణం, పరిస్థితులపై ఉండే ఉత్సుకత తదితర అంశాలను పరీక్షిస్తారు.

### కెరీర్

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఆఫీసర్‌కి జిల్లా స్థాయిలో తన విభాగానికి సంబంధించి పాలన, న్యాయ, ఆర్థిక పరమైన అంశాల్లో దాదాపు స్వయం ప్రతిపత్తి అధికారాలు ఉంటాయి. అటవీ శాఖలోని డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్(డీఎఫ్‌వో), కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీఎఫ్), ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) పోస్టులను ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ద్వారా ఎంపికైన అభ్యర్థులతో భర్తీ చేస్తారు.

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
27-10-2019

## 15వసారి ఫైనల్లో ఫెడరర్

సొంతగడ్డపై జరుగుతున్న స్విస్ ఇండోర్స్ ఏటీపీ-500 టోర్నమెంట్‌లో స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్ 15వసారి ఫైనల్లోకి ప్రవేశించాడు. గ్రీస్ ప్లేయర్ సిట్సిపాస్‌తో శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో టాప్ సీడ్ ఫెడరర్ 6-4, 6-4తో గెలుపొందాడు. 78 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో ఫెడరర్ ఆరు ఏస్‌లు సంధించి, సిట్సిపాస్ సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. తొమ్మిదిసార్లు స్విస్ ఇండోర్స్ టైటిల్‌ను నెగ్గిన ఫెడరర్, నాలుగుసార్లు రన్నరప్‌గా నిలిచాడు.



అంపైర్ నిర్ణయ సమీక్షా పద్ధతి (డీఆర్ఎస్) అంటే భారత్ ఒకప్పుడు ఆమడ దూరం పరుగెత్తింది. 'మేం ఉపయోగించం. ఏం చేసుకుంటారో పొమ్మంటూ' ఐసీసీకి సవాల్ విసిరింది. డోపింగ్ పరీక్షలు నిర్వహించే 'వాడా' పరిధిలో ఇతర దేశాల క్రికెటర్లంతా ఉండగా, మేం మాత్రం సొంతంగా నిర్వహించుకుంటాం తప్ప అందరితో కలిసేది లేదని బీసీసీఐ కరాఖండీగా చెప్పింది. ఇటీవల ప్రభుత్వ ఒత్తిడితో దిగొచ్చింది. ఈ రెండు సందర్భాల్లో కూడా తగిన కారణం చెప్పి తమ నిర్ణయంపై స్పష్టత ఇవ్వడంకంటే బీసీసీఐ ఆధిపత్య ప్రదర్శనే ఎక్కువగా కనిపిస్తుంది. డే అండ్ నైట్ టెస్టుల విషయంలోనూ ఇప్పటి వరకు అదే తీరు. మిగతా ప్రధాన టెస్టు జట్లన్నీ కనీసం ఒక్క మ్యాచ్ అయినా ఆడగా, భారత్ మాత్రం తమ పట్టు విడవలేదు. బోర్డు అధ్యక్షుడిగా సౌరవ్ గంగూలీ ఈ దిశగా ఆలోచిస్తున్న నేపథ్యంలో టీమిండియా తొలి గులాబీ మ్యాచ్ త్వరలోనే జరుగుతుందా?

- డే అండ్ నైట్ టెస్టులపై భారత్ విముఖత
- ఒక్క మ్యాచ్ కూడా ఆడని టీమిండియా
- 'పింక్ బాల్'తో టెస్టు నిర్వహణపై గంగూలీ ఆసక్తి



టెస్టు క్రికెట్‌లో తొలి డే నైట్ మ్యాచ్‌కు వేదికగా నిలిచిన అడిలైడ్ మైదానం

**11** ఇప్పటి వరకు పురుషుల క్రికెట్‌లో జరిగిన డే నైట్ టెస్టుల సంఖ్య. అన్నింటా ఫలితాలు వచ్చాయి. భారత్, బంగ్లాదేశ్ మినహా మిగతా అన్ని జట్లు ఇప్పటికే డే నైట్ టెస్టులు ఆడాయి. ఇందులో ఆస్ట్రేలియా అత్యధికంగా ఐదు మ్యాచ్‌లు ఆడి, ఐదింటా విజయం సాధించింది. శ్రీలంక రెండు మ్యాచ్‌ల్లో నెగ్గగా... పాకిస్తాన్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ ఒక్కోమ్యాచ్‌లో గెలిచాయి.

# గులాబీ ఎందుకు గుచ్చుకుంటోంది!

సాక్షి క్రీడా విభాగం

డీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సమయంలో భారత్–శ్రీలంక మధ్య టెస్టు సిరీస్‌లో దీనిని ఒకసారి ఉపయోగించారు. అయితే నిర్ణయాలు అన్నీ తమకు ప్రతికూలంగా వెళ్లడంతో ఇకపై వాడేది లేదన్న బీసీసీఐ... డీఆర్ఎస్ లోపాలభరితం అని తేల్చేసింది. సాంకేతికంగా చెప్పుకోవడానికైనా భారత్ ఒక సిరీస్‌లో డీఆర్ఎస్ ఉపయోగించిన తర్వాత తమ అనుభవాన్ని ప్రపంచం ముందు ఉంచింది. కానీ డే అండ్ నైట్ టెస్టు విషయంలో కనీసం అలాంటి ప్రయత్నం కూడా జరగలేదు. మొదటి నుంచి మాకు సరిపోదు అంటూ దాటవేస్తూ వచ్చింది. గత ఏడాది ఆస్ట్రేలియా జట్టుతో తమ దేశంలో జరిగిన సిరీస్‌లో ఒక టెస్టును 'పింక్ బాల్'తో ఆడదామని కోరితే భారత్ ఏకవాక్యంతో గట్టిగా తిరస్కరించేసింది. ఇతర దేశాలన్నింటికీ పనికొచ్చిన గులాబీ బంతి టెస్టు మ్యాచ్ టీమిండియాకు వచ్చేసరికి మాత్రం తగనిదిగా మారిపోయింది.

### దులీప్ ట్రోఫీకే పరిమితం...

ప్రపంచ క్రికెట్‌లో గులాబీ బంతితో 'డే అండ్ నైట్' టెస్టుల నిర్వహణ గురించి చర్చ జరుగుతున్న సమయంలో భారత్ తమ దేశవాళీ క్రికెట్‌లో వాడి చూడాలని భావించింది. 2015 డిసెంబర్‌లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మధ్య అడిలైడ్‌లో తొలి డే అండ్ నైట్ టెస్టు మ్యాచ్ జరగ్గా... 2016 సీజన్ దులీప్ ట్రోఫీలో భారత్ మొదటిసారి గులాబీ బంతిని వాడింది. ఆ తర్వాత మరో రెండు సీజన్లు కూడా డే అండ్ నైట్ మ్యాచ్‌లను కొనసాగిస్తూ ఫ్లడ్‌లైట్లలో ఆటను నిర్వహించింది. దేశవాళీలో సక్సెస్ అయితే టెస్టు క్రికెట్‌లో ప్రయత్నించవచ్చని భావించింది. అయితే దురదృష్టవశాత్తూ బిజీ షెడ్యూల్ కారణంగా లేదా అనాసక్తి వల్ల కూడా భారత టెస్టు జట్టు రెగ్యులర్ ఆటగాళ్లు ఇందులో ఏ మ్యాచ్‌లోనూ పాల్గొనలేదు. దాంతో ఆ మ్యాచ్ అనుభవం గురించి కానీ, గులాబీ బంతి స్పందించే తీరును గురించి కూడా మన ప్రధాన ఆటగాళ్లకు అవగాహనే రాలేదు. కోహ్లి, పుజారా లాంటి బ్యాట్స్‌మెన్... బుమ్రా, అశ్విన్‌లాంటి బౌలర్లు ఒక్కసారైనా వాడి ఉంటే ముందడుగు పడేదేమో. ఒక్క మ్యాచ్‌లో కూడా గులాబీ బంతిని వాడకుండా నేరుగా టెస్టు బరిలోకి దిగడం సాధ్యం కాదని టీమిండియా ఆ తర్వాత ఆ ఆలోచనను పూర్తిగా పక్కన పడేసింది.

### ఈ సారి అవుట్...

2019 దులీప్ ట్రోఫీ సమయంలో బోర్డు అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఈ సారి లీగ్ మ్యాచ్‌లన్నీ పాత పద్ధతిలోనే ఎర్ర బంతితోనే జరుగుతాయని, ఫైనల్ మాత్రం పింక్ బాల్‌తో డే అండ్ నైట్‌గా ఉంటుందని ప్రకటించింది. కానీ చివరి నిమిషంలో ఫైనల్ మ్యాచ్‌ను కూడా 'పింక్' కాకుండా సాంప్రదాయ ఎర్ర బంతితోనే ఆడించింది. మూడు సీజన్ల అనుభవం తర్వాత ఇక ఇది తమకు పనికి రాదని బోర్డు దాదాపుగా నిర్ణయం తీసుకున్నట్లు దీని ద్వారా పరోక్షంగా అర్థమైంది. ఇలాంటి స్థితిలో ఒక్కసారిగా టెస్టుల్లో మన జట్టులో పింక్ బాల్‌తో ఆడటం అంత సులువు కాదు. అయితే మూడు సీజన్లు ఆడించినా... దృశ్యానుభూతి విషయంలో ప్రేక్షకులనుంచి స్పందన తెలుసుకునే ప్రయత్నం కూడా బీసీసీఐ చేయకపోవడం విశేషం.

### ఇప్పుడు ఎందుకు...

ప్రేక్షకులను స్టేడియానికి ఆకర్షించే అంశంలో భారత్, దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్ ఘోరంగా విఫలమైంది. ఉచిత పాస్‌లు ఇవ్వడం, పెద్ద సంఖ్యలో విద్యార్థులను తీసుకురావడంవంటివి చేసినా మూడు వేదికల్లోనూ పెద్దగా ఆదరణ దక్కలేదు. ముఖ్యంగా పుణేలో అయితే సగంకంటే ఎక్కువ స్టేడియానికి పైకప్పు లేకపోవడంతో ఎండ దెబ్బకు ఎవ్వరూ మ్యాచ్ వైపు కూడా చూడలేదు. ఇలాంటి ప్రేక్షకులను సాయంత్రం వేళ జరిగే డే అండ్ నైట్ టెస్టులు కొంత ఆకర్షించవచ్చు. ఆదరణ కోల్పోతున్న టెస్టు క్రికెట్‌ను బతికించాలంటే ఈ తరహాలో ఏదైనా చేయాలనేది మొదటినుంచి గంగూలీ ఆలోచన. 1877లో తొలి టెస్టు మ్యాచ్ జరిగిన తర్వాత క్రికెట్ ఎన్నో రకాలుగా స్వరూపం మార్చుకుంది. ఎన్నో కొత్త అంశాలు వచ్చి చేరాయి. కాబట్టి పింక్ బాల్, ఫ్లడ్ లైట్ టెస్టు క్రికెట్ అనేది కూడా ఒక కొత్త ఆకర్షణ కాబట్టి ప్రయత్నిస్తే తప్పేంటనేది చాలా మంది వాదన. సహజంగానే ఇది అభిమానులకు కొత్త అనుభూతి ఇస్తుంది కాబట్టి ఐపీఎల్ తరహాలో సరదాగా సాయంత్రం గడిపేందుకు బాగుంటుందని సౌరవ్ భావిస్తున్నాడు.

### బంతులతోనే సమస్య!

దులీప్ ట్రోఫీలో ఆడిన అనేక మంది పింక్ బాల్ విషయంలో అసంతృప్తి వ్యక్తం చేయడంతోనే బోర్డు మరింత ముందుకు వెళ్లే సాహసం చేయలేకపోయింది. సాధారణంగా టెస్టు మ్యాచ్‌ల కోసం ఆస్ట్రేలియాలో 'కూకాబుర్రా' బంతులు, ఇంగ్లండ్‌లో 'డ్యూక్' బంతులు వాడతారు. ఈ రెండు దేశాల్లో వాడిన గులాబీ బంతులపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. భారత్‌లో టెస్టులతో పాటు దేశవాళీ మ్యాచ్‌లకు 'ఎస్‌జీ' బంతులు ఉపయోగిస్తారు. 'ఎస్‌జీ' గులాబీ బంతులు ఏ మాత్రం నాణ్యతతో లేవని ఆటగాళ్లు ఫిర్యాదు చేస్తున్నారు. 'ఇతర టెస్టు దేశాల్లో ఫ్లడ్‌లైట్లు వాడినప్పుడు బంతి బాగా స్వింగ్ అయింది. కానీ మన వద్దకు వచ్చేసరికి అది జరగలేదు. పైగా బౌలర్లకు పింక్ బాల్స్ ఏమాత్రం అనుకూలంగా లేవు. తొలి స్పెల్ వేసిన తర్వాత ఇక బ్యాట్స్‌మెన్‌దే రాజ్యం. పది ఓవర్లకే సీమ్ పాడైపోతోంది. రివర్స్ స్వింగ్ కాకపోగా, స్పిన్నర్లకు కూడా పట్టు చిక్కడం లేదు' అని విదర్భ కెప్టెన్ ఫైజ్ ఫజల్ అన్నాడు. ఒక భారత అంపైర్ అభిప్రాయం ప్రకారం 'దులీప్ ట్రోఫీలో ఉపయోగించిన బంతులపై వాడిన లక్క మరీ నాసిరకంగా ఉంది. అది చెదిరిపోయి బంతి నల్లగా మారిపోతోంది. ఫలితంగా ఫ్లడ్‌లైట్ల వెలుగులో బ్యాట్స్‌మెన్‌కు అది కనిపించడం లేదు' అని మరో కారణం వెల్లడించారు. అయితే ఇది పరిష్కరించుకోదగ్గ సమస్యే అని, నాణ్యత విషయంలో కంపెనీలకు తగు సూచనలు ఇచ్చి మంచి బంతులు తయారు చేయించుకోగలమని బీసీసీఐ జనరల్ మేనేజర్ సబా కరీమ్ వ్యాఖ్యానించారు.

### మ్యాచ్ సాధ్యమేనా!

విదేశీ పర్యటనల్లో డే అండ్ టెస్టు గురించి ఇప్పుడే చెప్పలేం కానీ గంగూలీ స్వదేశంలోనైనా ఒక మ్యాచ్ ఆడించాలని పట్టుదలగా ఉన్నాడు. బహిరంగంగా చెప్పకపోయినా బోర్డు అధ్యక్షుడి వ్యాఖ్యలను బట్టి చూస్తే రాబోయే బంగ్లాదేశ్ సిరీస్‌లోనే ఒక టెస్టు విషయంలో అతను ఈ ఆలోచనతో ఉన్నట్లు అంతర్గత సమాచారం. బహుశా తన సొంత మైదానం కోల్‌కతాలో జరిగే రెండో టెస్టే పింక్ బాల్ మ్యాచ్ కావచ్చని కూడా వినిపిస్తోంది. భారత్‌తో పోలిస్తే బంగ్లా బలహీనమైన జట్టు కాబట్టి మరీ అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని... పింక్ బంతి కారణంగా ఒక వేళ మ్యాచ్ గమనం భారత్‌కు ప్రతికూలంగా మారినా దానిని ఎదుర్కోగల సత్తా టీమిండియాకు ఉందని మాజీ కెప్టెన్ భావిస్తున్నాడు. ఈ విషయాన్ని కోహ్లితో చర్చించిన తర్వాతే దీనిపై అతను వ్యాఖ్య చేసినట్లు సమాచారం. మరోవైపు పింక్ బాల్‌తో టెస్టు నిర్వహణకు మద్దతిచ్చిన మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే... ఈ విషయంలో వాతావరణం, వేదిక, మ్యాచ్ జరిగే రోజులను దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోవాలన్నాడు. మంచు కారణంగా రాత్రి పూట బౌలర్లకు బంతిపై పట్టు చిక్కకపోతే మొత్తం సమస్యగా మారిపోతుందని అభిప్రాయపడ్డాడు.





## డబుల్స్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జంట

**సెమీస్‌లో ఐదో సీడ్ జపాన్ జోడీపై సంచలన విజయం**

**పారిస్ (ఫ్రాన్స్):** ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ చాంపియన్ జంటను... క్వార్టర్ ఫైనల్లో ఎనిమిదో ర్యాంక్ జోడీని బోల్తా కొట్టించిన భారత యువ ద్వయం సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి సెమీఫైనల్లోనూ గొప్ప విజయం సాధించారు. ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో భాగంగా శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ 21–11, 25–23తో ఐదో సీడ్, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానంలో ఉన్న హిరోయుకి ఎండో–యుటా వతనాబె (జపాన్) జంటను ఓడించి ఫైనల్‌కు చేరింది. గతంలో ఈ జపాన్ జోడీతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన సాత్విక్–చిరాగ్ మూడో ప్రయత్నంలో మాత్రం గెలుపు రుచి చూశారు. **నేడు జరిగే ఫైనల్లో టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ గిడియోన్–కెవిన్ సుకముల్జో (ఇండోనేసియా) జోడీతో సాత్విక్–చిరాగ్ జంట ఆడుతుంది. ముఖాముఖి రికార్డులో భారత జంట 0–6తో వెనుకబడి ఉంది. షెడ్యూల్ ప్రకారం పురుషుల డబుల్స్ ఫైనల్ భారత కాలమానం ప్రకారం రాత్రి 7 గంటల తర్వాత జరిగే అవకాశముంది. మ్యాచ్ స్టార్‌స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది.**



### వరుసగా 11 పాయింట్లు గెలిచి...

పురుషుల సింగిల్స్ విభాగంలో ఇండోనేసియా ప్లేయర్ జొనాథన్ క్రిస్టీ అత్యద్భుత విజయం సాధించాడు. ప్రపంచ మాజీ చాంపియన్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)తో జరిగిన సెమీఫైనల్లో 7–21, 22–20, 21–19తో గెలుపొంది ఫైనల్లోకి దూసుకెళ్లాడు. నిర్ణాయక చివరి గేమ్‌లో ఒకదశలో క్రిస్టీ 10–19తో వెనుకంజలో నిలిచి ఓటమి అంచుల్లో ఉన్నాడు. అయితే ఒక్కసారిగా విజృంభించిన క్రిస్టీ వరుసగా 11 పాయింట్లు సాధించి చివరి గేమ్‌ను 21–19తో నెగ్గి విజయాన్ని అందుకున్నాడు.

## దీపక్‌కు రజతం

**వుహాన్ (చైనా):** ప్రపంచ మిలిటరీ క్రీడల్లో శనివారం భారత్‌కు రెండు పతకాలు లభించాయి. పురుషుల బాక్సింగ్ 49 కేజీల విభాగంలో దీపక్ రజతం నెగ్గగా... పురుషుల టెన్నిస్ సింగిల్స్ విభాగంలో శ్రీరామ్ బాలాజీ కాంస్య పతకం సాధించాడు. బాక్సింగ్ ఫైనల్లో దీపక్ 0–5తో తెమిర్తాస్ జుసుపోవ్ (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. టెన్నిస్ కాంస్య పతక పోరులో శ్రీరామ్ బాలాజీ 6–2, 6–3తో ఫోమిన్ సెర్గీ (ఉజ్బెకిస్తాన్)పై గెలుపొందాడు. అథ్లెటిక్స్‌లో పురుషుల 1500 మీటర్ల విభాగంలో జిన్సన్ జాన్సన్ 3ని:49.34 సెకన్లలో గమ్యానికి చేరుకొని నాలుగో స్థానంలో నిలిచాడు. 4x400 మీటర్ల రిలే ఫైనల్లో కున్హు మొహమ్మద్, సంతోష్ కుమార్, జబీర్ మదారి, అనస్‌లతో కూడిన భారత బృందం నాలుగో స్థానంలో నిలిచింది.





## చైనా చిందేసింది

- టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన మహిళల హాకీ జట్టు
- షూటౌట్‌లో బెల్జియంపై విజయం

**చాంగ్‌జౌ:** ఓటమి అంచుల నుంచి గట్టెక్కి విజయం రుచి చూస్తూ చైనా మహిళల హాకీ జట్టు వచ్చే ఏడాది జరిగే టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత పొందింది. బెల్జియంతో శనివారం జరిగిన ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌లో చైనా విజయం సాధించి ఈ ఘనత సాధించింది. తొలి మ్యాచ్‌లో చైనా 0–2తో ఓడిపోయింది. అయితే రెండో మ్యాచ్‌ను ఆ జట్టు 2–2తో 'డ్రా' చేసుకుంది. మరో నాలుగు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా... చైనా అద్భుతం చేసింది. 56వ, 57వ నిమిషాల్లో ఒక్కో గోల్ చేసి స్కోరును సమం చేసింది. మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించింది. దాంతో నిర్ణీత రెండు మ్యాచ్‌ల తర్వాత గోల్స్ సగటులో చైనా, బెల్జియం 2–2తో సమంగా నిలిచాయి. దాంతో విజేతను నిర్ణయించడానికి షూటౌట్‌ను నిర్వహించారు. షూటౌట్‌లో రెండు జట్లు ఐదేసి షాట్‌లు తీసుకున్నా... ఇక్కడా స్కోరు 1–1తో సమమైంది. దాంతో సడెన్‌డెత్ నిర్వహించారు. సడెన్‌డెత్‌లో తొలి షాట్‌ను చైనా క్రీడాకారిణి లీ జియాకి బంతిని లక్ష్యానికి చేర్చగా... బెల్జియం క్రీడాకారిణి అలిక్స్ జెనీర్స్ కొట్టిన షాట్ బయటకు వెళ్లిపోవడంతో చైనా 2–1తో విజయాన్ని ఖాయం చేసుకుంది. వరుసగా ఆరోసారి ఒలింపిక్స్‌కు అర్హత సాధించి సంబరాల్లో మునిగి తేలింది.



## మూడో రౌండ్‌లో జోష్నా

**కైరో (ఈజిప్ట్):** ప్రపంచ మహిళల స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత నంబర్‌వన్ క్రీడాకారిణి జోష్నా చినప్ప మూడో రౌండ్‌కు చేరింది. హో జెలాక్ (హాంకాంగ్)తో శనివారం జరిగిన రెండో రౌండ్‌లో 12వ సీడ్ జోష్నా 11–5, 11–4తో రెండు గేమ్‌లను గెలిచి, మూడో గేమ్‌లో 3–0తో ఆధిక్యంలో ఉన్న దశలో ఆమె ప్రత్యర్థి గాయం కారణంగా వైదొలిగింది.

## ఫించ్ ఫిట్... టై అవుట్

- శ్రీలంకతో నేడు ఆసీస్ తొలి టి20 మ్యాచ్
- ఉదయం గం. 9 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



**అడిలైడ్:** పక్క టెముకల గాయంతో బాధ పడుతున్న ఆస్ట్రేలియా వన్డే, టి20 సారథి అరోన్ ఫించ్ శ్రీలంకతో జరిగే తొలి టి20కి ఫిట్‌నెస్ సాధించాడు. తాను ఫిట్‌గా ఉన్నానని ఆదివారం జరిగే మ్యాచ్‌లో డేవిడ్ వార్నర్‌తో కలిసి ఓపెనింగ్‌కు దిగనున్నట్లు ఫించ్ శనివారం తెలిపాడు. అయితే టి20 డెత్ ఓవర్ స్పెషలిస్టుగా పేరుతెచ్చుకున్న ఆండ్రూ టై మాత్రం మోచేతి గాయం కారణంగా శ్రీలంకతో జరిగే సిరీస్‌కు దూరమయ్యాడు. బాల్ ట్యాంపరింగ్ వివాదంతో ఏడాది నిషేధం ఎదుర్కొన్న మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్‌లు తొలిసారి పొట్టి ఫార్మాట్ బరిలో దిగుతున్నారు.

## నార్త్ ఈస్ట్ యునైటెడ్ బోణీ

**ఒడిశాపై 2–1తో విజయం**



**గువాహటి:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో నార్త్ ఈస్ట్ యునైటెడ్ బోణీ కొట్టింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో నార్త్ ఈస్ట్ 2–1తో ఒడిశాపై గెలిచింది. నార్త్ ఈస్ట్ ఆటగాళ్లు రెడీమ్ త్లాంగ్ (2వ ని.), గ్యాన్ (84వ ని.) చెరో గోల్ సాధించారు. ఒడిశా తరఫున హెమాండేజ్ (71వ ని.) గోల్ చేశాడు. ఆరంభంలోనే గోల్ సమర్పించుకున్న ఒడిశా ఆ తర్వాత తేరుకుంది. 71వ నిమిషంలో స్కోర్‌ను సమం చేసింది. అయితే ఆ ఆనందం ఎంతో సేపు నిలువలేదు. ఒడిశా ప్లేయర్ డెల్గాడోకు రెడ్‌కార్డు లభించడంతో ఆ జట్టు చివరి 18 నిమిషాలు 10 మందితోనే ఆడింది. దీనిని సద్వినియోగం చేసుకుంటూ గ్యాన్ చివర్లో గోల్ చేసి జట్టుకు విజయాన్ని అందించాడు.

epaper.sakshi.com

## రాజధానిలో ఆ రెండే కాల్చాలి



దీపావళి అనగానే మనసుకి ఆహ్లాదాన్నిచ్చే దీపాలూ, వాతావరణాన్ని కలుషితం చేసే టపాకాయలే గుర్తొస్తాయి. అందుకే దీపావళి పండుగని ప్రమాదకరంగా పర్యావరణ వేత్తలు భావిస్తున్నారు. ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఏటా వేలాది మందిని మృత్యువు దరికి చేరుస్తోన్న టపాకాయలు కాల్చొద్దంటూ పిలుపునిస్తున్నారు. అందులో భాగంగానే తక్కువ కాలుష్యాన్ని వెదజల్లే ఎకోఫ్రెండ్లీ టపాకాయలను తయారు చేస్తున్నారు. ఇవి తక్కువ శబ్దంతో, తక్కువ పొగని విడుదల చేస్తాయి. ఎలక్ట్రిక్ బల్బులకు బదులుగా బయోడీగ్రేడబుల్ దీపాలను వెలిగించడం వల్ల కూడా కాలుష్యానికి చెక్ పెట్టొచ్చు. ఇందులోభాగంగానే ఈసారి ఢిల్లీ ప్రభుత్వం కాకరపువ్వొత్తులు, చిచ్చుబుడ్లను కాల్చుకోవడానికి మాత్రమే అనుమతినిచ్చింది. అవి కూడా ప్రభుత్వం తయారు చేసిన వాటిని మాత్రమే కొనాలి. ప్రభుత్వం తయారు చేసిన ఈ ఎకో ఫ్రెండ్లీ క్రాకర్స్ ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. సో ఈ రెండింటితోనే ఈసారి ఢిల్లీ వాసులు దీపావళి జరుపుకొని సంతృప్తి పడవలసిందే.

## శివకాశి మోత తగ్గింది



దీపావళి అంటే అందరికీ గుర్తుకు వచ్చేది శివకాశి టపాసులే. తమిళనాడులోని శివకాశిలో ఈ బాణసంచా తయారీపైనే ఆధారపడి ఎన్నో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కానీ ఈసారి ఈ పరిశ్రమపై ఎకో దీపావళి ప్రభావం బాగా పడింది. అసలు బాణసంచా కాల్చవద్దంటూ కొన్ని స్వచ్ఛంద సంస్థలు చెబుతూ ఉంటే, స్వయంగా కేంద్ర ప్రభుత్వం పర్యావరణానికి హాని చేయని టపాసులు తయారు చేసి ఈసారి విక్రయించింది. అంతగా శబ్దం రాని భూ చక్రాలు, విష్ణు చక్రాలు, కాలుష్యం వెదజల్లని మతాబులు, కాకరపువ్వొత్తులు, చిచ్చుబుడ్లను కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ల్యాబ్‌లో విజయవంతంగా అభివృద్ధి చేసింది. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ ఈ ఎకో ఫ్రెండ్లీ బాణసంచాను కొద్ది రోజుల క్రితమే విడుదల చేశారు. శివకాశీ టపాసులు వెదజల్లే కాలుష్యం వాతావరణాన్ని కలుషితం చేస్తూ ఉండటంతో గతేడాదే సుప్రీంకోర్టు గ్రీన్ దీపావళి జరుపుకోవాలని ఆదేశాలిచ్చింది. ఏటా దేశంలో 90 శాతం ప్రాంతాలకు శివకాశి నుంచే టపాసులు వెళతాయి. 6,300 కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది. కానీ ఈ ఏడాది శివకాశి టపాసుల వ్యాపారం బాగా పడిపోయింది. ఈ ఏడాది టపాసుల వ్యాపారం తగ్గిపోయినప్పటికీ కొద్ది సంవత్సరాల్లో పర్యావరణ హితమైన గ్రీన్ క్రాకర్లను రూపొందించి మళ్లీ పుంజుకుంటామని శివకాశిలో కంపెనీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

## క్లుప్తంగా...

### త్వరలోనే ఇంజనీరింగ్‌లో ఆల్‌జీబ్రా: ఐఐటీ ప్రొఫెసర్



ప్రొఫెసర్ రాజశేఖర్

పటాన్‌చెరు: త్వరలోనే ఇంజనీరింగ్‌లో ఆల్‌జీబ్రా అనే ప్రత్యేక పాఠ్యాంశాన్ని ప్రవేశపెట్టనున్నారని ఐఐటీ ఖరగ్‌పూర్ గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ జీవీ రాజశేఖర్ తెలిపారు. పటాన్‌చెరు మండలంలోని రుద్రారంలో గీతం యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అంతా గణితంతో కూడుకుని ఉందని, లెక్కల్లో మేటిగా ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని ఆయన తెలిపారు. నిత్యజీవితంలో సమస్యలను, ప్రకృతిని అర్థం చేసుకోవడానికి గణితం ఒక సాధనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గీతం గణిత శాస్త్ర అధ్యాపకులు ప్రొఫెసర్ మారుతీప్రసాద్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ విజయశేఖర్ పాల్గొన్నారు.



శశాంక్



సాయిసంగీత్

### కాలువలో పడి ఇద్దరు యువకుల గల్లంతు

**పండుగ పూట విషాదం**

జన్నారం (మంచిర్యాల): కాలువలో పడి శనివారం ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొనకల్‌కు చెందిన కొమురోజి శశాంక్ (25), ఏదులపురం సాయి సంగీత్ (18) శనివారం ఉదయం నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం రేవోజీపేట్ గ్రామంలోని తమ బంధువుల ఇంటికి వెళ్లారు. వారిని కలుసుకున్న తర్వాత సరదాగా గ్రామాన్ని చూద్దామని కారులో వెళ్లారు. ఊరు శివారు నుంచి కడెం ప్రధాన కాలువ ప్రవహిస్తోంది. దారి లేకపోవడంతో కారును వెనక్కి తిప్పే ప్రయత్నంలో అదుపు తప్పి కారు పల్టీలు కొడుతూ కాలువలో పడిపోయింది. యువకులిద్దరూ కారులో నుంచి కాలువలో పడినట్లు పశువుల కాపరి తెలిపాడు. సమాచారం అందుకున్న గ్రామస్తులు తాడు సహాయంతో కారును బయటకు లాగారు. కారులో ఎవరూ కనిపించలేదు. కాలువలో గల్లంతయినట్లు భావించి.. వారి కోసం దస్తురాబాద్, జన్నారం పోలీసులు గాలిస్తున్నారు. దీపావళి పండుగకు వచ్చి కాలువలో గల్లంతు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. శశాంక్ తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. ఇతను హైదరాబాద్‌లో ఉంటూ సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. సాయిసంగీత్ బీబీఏ చదువుతున్నాడు. ఇద్దరు దీపావళి సెలవుల కోసం స్వగ్రామమైన జన్నారం మండలం పొనకల్‌కు వచ్చి గల్లంతయ్యారు.

### బహిరంగ మూత్రవిసర్జన వీఆర్‌ఏకు జరిమానా

మహాముత్తారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం సింగారం గ్రామపంచాయతీ వీఆర్‌ఏ రాములు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న శిలాఫలకాల పక్కన శనివారం మూత్ర విసర్జన చేశాడు. దీంతో గ్రామ పంచాయతీ సిబ్బంది అతడికి రూ.200 జరిమానా విధించారు. ఎవరైనా బహిరంగ మూత్రవిసర్జన చేస్తే జనిమానాలు తప్పవని హెచ్చరించారు.



శ్రీనివాస్

### పంట నష్టంతో కౌలురైతు ఆత్మహత్య

కొడిమ్యాల: పంట నష్టంతో ఓ కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తిరుమలాపూర్‌కు చెందిన తైదల శ్రీనివాస్(36)కు వ్యవసాయ భూమి లేకపోవడంతో నాలుగేళ్లుగా నాలుగెకరాలను కౌలుకు తీసుకుంటూ వ్యవసాయం చేస్తున్నాడు. ఈ ఏడాది రూ.1.50 లక్షలు అప్పు చేసి రెండెకరాలలో వరి, మరో రెండెకరాలలో పత్తి సాగు చేశాడు. భారీ వర్షాలతో వరి పంట నీటమునిగిపోగా, పత్తి పంట దెబ్బతింది. దీంతో పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో శుక్రవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణం చెందాడు.

# శ్రీరాంసాగర్‌కు పోటెత్తిన వరద

**39 గేట్లు ఎత్తివేత.. 2 లక్షల క్యూసెక్కులు నీరు దిగువకు..**

- సాయంత్రం గేట్లన్నీ మూసివేత
- ఉధృతి పెరగడంతో రాత్రి మళ్లీ 16 గేట్ల ఎత్తివేత
- గోదావరి పాలవుతున్న మిగులు జలాలు
- మరింత ఉధృతి పెరిగే అవకాశం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి శనివారం 1.20 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అప్రమత్తమైన నీటి పారుదల శాఖ అధికారులు ఉదయం ప్రాజెక్టు 39 గేట్లను ఎత్తారు. సుమారు రెండు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సాయంత్రం వరద తగ్గుముఖం పట్టడంతో గేట్లన్నీ మూసేశారు. రాత్రి 9 గంటలకు వరద ఉధృతి పెరగడంతో మళ్లీ 16 గేట్లను ఎత్తి దిగువకు నీరు వదిలారు. కాకతీయ కాలువ ద్వారా 5,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువ ద్వారా 880 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా మరో 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 1,090 అడుగులు కాగా, ప్రస్తుతం 1,089.89 అడుగుల మేరకు నీటిని నిల్వ ఉంచారు. కాగా, రాత్రి వేళల్లో ప్రాజెక్టు నీటి మట్టం పెరిగితే మరింత నీటి విడుదలను గోదావరిలోకి పెంచుతామని అధికారులు తెలిపారు.

**మిగులు జలాలన్నీ గోదావరిపాలు**

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు మిగులు జలాలు గోదావరి పాలవుతున్నాయి. ఇటీవల ఈ జలాశయం పూర్తి స్థాయిలో నిండటంతో ఎగువ నుంచి వస్తున్న భారీ వరద జలాలు గోదావరిలోకి వదిలేస్తున్నారు. ఈ పక్షం రోజుల్లోనే 15.329 టీఎంసీలకు పైగా మిగులు జలాలు వృథా అయ్యాయి. ఈ ప్రాజెక్టుకు వచ్చే మిగులు జలాలను సద్వినియోగం చేసుకునేందుకు వరద కాలువ నిర్మించారు. ప్రాజెక్టులోకి భారీ ఎత్తున వరద పోటెత్తిన పక్షంలో ఈ వరద కాలువ గేట్లను ఎత్తి నీటిని మిడ్ మానేరుకు తరలించేలా వరద కాలువను 2010లో ప్రారంభించారు. ప్రస్తుతం ఈ వరద కాలువపై ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం పనులు కొనసాగుతున్నాయి. దీంతో వరద కాలువ ద్వారా నీటిని మిడ్‌మానేరుకు తరలించలేకపోతున్నామని నీటి పారుదలశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. వరద కాలువపై జీరో పాయింట్ (నిజామాబాద్ జిల్లా ముప్కాల్) వద్ద, జగిత్యాల జిల్లా రాజేశ్వర్‌రావుపేట్, రాంపూర్‌ల వద్ద మూడు పంప్‌హౌజ్‌ల పనులు కొనసాగుతున్నాయి. మరోవైపు మిడ్‌మానేరు కట్ట నిర్మాణంలో నాణ్యతా లోపాలు వెలుగు చూసిన నేపథ్యంలో ఈ కట్ట మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఎస్సారెస్పీకి వస్తున్న మిగులు జలాలను వరద కాలువ ద్వారా ఈ మిడ్‌మానేరుకు తరలించేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో వచ్చిన వరద జలాలన్నీ నదిలోకి వదులుతున్నారు.

**బాబ్లీ నీటి మట్టం అనుసరించి..**

నీటి పారుదలశాఖ అధికారులు ప్రాజెక్టు నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎస్సారెస్పీకి ఎగువన ఉన్న బాబ్లీ ప్రాజెక్టు హెడ్ లెవల్‌ను అనుసరించి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీటి మట్టాన్ని నియంత్రిస్తున్నారు. రెండ్రోజుల్లో బాబ్లీ ప్రాజెక్టు గేట్లు మూసివేసే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 39 గేట్లు ఎత్తి దిగువకు నీరు వదిలిన దృశ్యం

# బాహుబలులన్నీ సిద్ధం

- గాయత్రి పంపుహౌస్‌లో ఏడు మోటార్లకు వెట్‌రన్ పూర్తి
- తక్కువ సమయంలో పంప్‌హౌస్ సిద్ధం చేసి రికార్డు సృష్టించిన మేఘా ఇంజనీరింగ్ సంస్థ
- నందిమేడారం, పార్వతి పంప్‌హౌస్‌ల్లో ఒక్కో దానికి ఈ నెలాఖరుకు వెట్‌రన్ పూర్తి

సాక్షి, హైదరాబాద్/రామడుగు: కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులోని గాయత్రి (ప్యాకేజీ–8) పంప్‌హౌస్‌లోని బాహుబలి మోటార్లన్నింటికీ పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయి. నిర్ణీత రెండు టీఎంసీల మేర గోదావరి నీటిని ఎత్తిపోసేందుకు వీలుగా గాయత్రి పంపింగ్ కేంద్రం పూర్తిస్థాయిలో సిద్ధమైంది. అతితక్కువ సమయంలో పంపింగ్ కేంద్రాన్ని నిర్మించడంతో పాటు మోటార్లన్నింటికీ పరీక్షలు పూర్తి చేయడంతో మేఘా ఇంజనీరింగ్ సంస్థ కొత్త రికార్డు సృష్టించింది. కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగంగా ఎల్లంపల్లి దిగువన ఉన్న నందిమేడారం పంప్‌హౌస్ పరిధిలో 124.5 మెగావాట్ల విద్యుత్‌తో నడిచే మోటార్లను ఏర్పాటు చేస్తుండగా, దాని దిగువన గాయత్రి పంప్‌హౌస్‌లో మోటార్ల సామర్థ్యం మరో 15 మెగావాట్ల మేర ఎక్కువగా అంటే 139 మెగావాట్ల సామర్థ్యం ఉండే పంపులను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ మొత్తంగా 7 మోటార్లను ఏర్పాటు చేసి రోజుకు 2 టీఎంసీల నీటిని తరలించాల్సి ఉంది. ఒక్కో మోటారు సుమారు 15 మీటర్ల ఎత్తు అంటే 4 అంతస్తులు ఉంటుంది. వ్యాసం 22 మీటర్లు, బరువు 650 టన్నులుగా ఉంది. ఈ మోటార్లు 115 మీటర్ల లోతు నుంచి 3,200 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో నీటిని ఎత్తిపోస్తుంది. ఈ పంప్‌హౌస్‌లో మొదటి పంప్‌హౌస్‌కు ఈ ఏడాది ఆగస్టు 11న మొదటి మోటార్‌ను ప్రారంభించగా, అదేనెల 14న రెండు, 20న మూడు, 31న నాలుగు, సెప్టెంబర్ 18న ఐదు, అక్టోబర్ 19న ఆరు మోటార్లను ప్రారంభించారు. శనివారం మిగిలిన ఏడో మోటార్‌ను ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డి, ఎస్‌ఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ నూనె శ్రీధర్‌ల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ మోటార్ భూగర్భ పంపింగ్ స్టేషన్ నుంచి 111 మీటర్ల ఎత్తుకు నీటిని 1.40 గంటల పాటు నిరంతరాయంగా పంప్ చేసింది. మోటార్ దిగ్విజయంగా నడవడంతో ఇక్కడ నూటికి నూరు శాతం మోటార్లన్నీ సిద్ధమైనట్లయింది.





ఏడో బాహుబలి మోటారు వెట్‌రన్

**నెలాఖరుకు పూర్తి స్థాయిలో..**

ఇక ఇప్పటికే లక్ష్మి (మేడిగడ్డ), సరస్వతి(అన్నారం) లలో మోటార్లు వెట్‌రన్‌లు పూర్తి చేసుకుని రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటన్నింటినీ మేఘా ఇంజనీరింగ్ సంస్థే పూర్తి చేసింది. ఇక సుందిళ్ల (పార్వతి)లో తొమ్మిది మోటార్లలో ఎనిమిది మాత్రమే సిద్ధమయ్యాయి. దీన్ని ఈ నెలాఖరుకు పూర్తి చేయనున్నారు. ఇక ప్యాకేజీ–6లో మరో మోటార్‌కు వెట్‌రన్ నిర్వహించాల్సి ఉండగా, దానికి నెలాఖరున పూర్తి చేయనున్నారు. ఇవన్నీ పూర్తయితే తొలిదశలో కాళేశ్వరం ఎత్తిపోతలు పూర్తిస్థాయిలో సిద్ధమైనట్లే.

# కనురెప్పే కాటేసింది

- బాలుడికి యాసిడ్ తాగించి తనూ తాగిన తల్లి
- బాలుడి మృతి.. చికిత్స పొందుతున్న తల్లి
- కుటుంబ కలహాలే కారణం
- నల్లగొండ జిల్లా వర్కాలలో విషాదం



యశ్వంత్ మృతదేహం

చింతపల్లి: ఆడుతూ పాడుతూ హాయిగా ఉండాల్సిన ఆ బాలుడి నవ్వులు మూగబోయాయి. కుటుంబ కలహాలు ఆ బాలుడి పాలిట యమపాశాలయ్యాయి. కంటికి రెప్పలా కాపాడాల్సిన తల్లే ఘాతుకానికి పాల్పడింది. నాలుగేళ్ల బాలుడికి యాసిడ్ తాగించి.. తనూ తాగింది. దీంతో బాలుడు మృతి చెందగా..తల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని వర్కాల గ్రామానికి చెందిన సుమతమ్మ, శ్రీనివాస్‌రెడ్డి దంపతుల కూతురు శివరాణిని నాలుగేళ్ల క్రితం కల్వకుర్తి నియోజకవర్గం బెక్కర గ్రామానికి చెందిన పోతుల శివారెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. వారికి యశ్వంత్ అనే ఒక కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా ఈ దంపతులు ఒకరిపై ఒకరు అనుమానాలు పెంచుకోవడంతో మనస్పర్థలు వచ్చాయి. దీంతో తరచూ గొడవలు జరిగేవి. నాలుగు నెలల కిందట శివరాణి తన కుమారుడు యశ్వంత్‌తో కలసి తల్లిగారి ఊరు వచ్చేసి జీవిస్తోంది. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఉన్న యాసిడ్‌ను మొదట యశ్వంత్‌కు తాగించి తనూ తాగింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు గమనించి వచ్చేసరికి యశ్వంత్(4) మృతిచెందాడు. శివరాణిని చికిత్స నిమిత్తం దేవరకొండ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి అదుపులోనే ఉందని వైద్యులు చెప్పారు. చింతపల్లి ఎస్‌ఐ పచ్చిపాల పరమేశ్ ఆస్పత్రిలో శివరాణిని విచారించారు. కుటుంబ తగాదాలతో పాటు తన భర్తతో మనస్పర్థలు రావడంతో కుమారుడికి యాసిడ్ తాగించి తనూ తాగినట్లు తెలిపింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





దీపావళి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. - వేములవాడ



**చెరువు కాదు పాఠశాలే!**

జోగులాంబ గద్వాల జిల్లాలోని ధరూరు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణ చెరువును తలపించింది. శుక్రవారం రాత్రి కురిసిన కుండపోత వర్షంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎగువ నుంచి వచ్చే వర్షపు నీరంతా ఇక్కడికే చేరుతుండగా, దిగువకు నీరు వెళ్లే అవకాశమే లేదు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనంలేదని హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి వాపోయారు. - ధరూరు

# అంబులెన్స్‌ను ఢీకొట్టిన డీసీఎం

**అక్కాచెల్లెళ్ల మృతి**

- శవాన్ని తీసుకొస్తుండగా ప్రమాదం

సిద్దిపేట అర్బన్: హైదరాబాద్‌లోని అల్వాల్‌లో మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకువస్తూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కాచెల్లెళ్లు మృతి చెందారు. శనివారం ఉదయం సిద్దిపేట జిల్లా అర్బన్ మండలం పొన్నాల గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హుస్నాబాద్‌కు చెందిన అన్నాడి రవికుమార్ (45) అల్వాల్‌లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ఆయన గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఆయన మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం హుస్నాబాద్‌కు తీసుకువచ్చేందుకు శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో అల్వాల్ నుంచి బయలుదేరారు. మృతుడు రవికుమార్ భార్య జ్యోతి, గజ్వేల్‌కు చెందిన కూరెల్లి సునీత (35), తుర్కపల్లికి చెందిన మోకు రాణి (41)తో పాటు సింగిరెడ్డి గోపాల్‌రెడ్డి, మొర్సు జయమ్మ, అన్నాడి సోనియా, మొర్సు మంజుల అంబులెన్స్‌లో వస్తున్నారు. శనివారం ఉదయం 5 గంటల సమయంలో పొన్నాల గ్రామ శివారు వద్ద ఓ డీసీఎం వ్యాను వేగంగా వచ్చి వీరు ప్రయాణిస్తున్న అంబులెన్స్‌ను ఢీకొట్టింది. దీంతో అంబులెన్స్ బోల్తా పడింది. ఇదే సమయంలో అంబులెన్స్ డోర్ తెరుచుకోవడంతో అందులో ఉన్న కూరెల్లి సునీత, మోకు రాణిలు రోడ్డుపై పడిపోయారు. వీరి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. డీసీఎం వ్యాను డ్రైవర్ భాస్కర్‌రెడ్డి, క్లీనర్ అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న సింగిరెడ్డి గోపాల్‌రెడ్డి, మొర్సు జయమ్మ, అన్నాడి జ్యోతి, అన్నాడి సోనియా, మొర్సు మంజులకు గాయాలయ్యాయి. వీరిని మొదట సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. గోపాల్‌రెడ్డి, జయమ్మ, మంజులకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. రాణి భర్త మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి కేసు దర్యాప్తు ప్రారంభించారు.



రోడ్డుపై బోల్తా కొట్టిన అంబులెన్స్, డీసీఎం వ్యాను

## మేడారం జాతరకు 75 కోట్లు మంజూరు

**గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బెనహర్ మహేశ్ ఉత్తర్వులు**

ఏటూరునాగారం/ఎస్‌ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లాలో రెండేళ్లకు ఒకసారి జరిగే శ్రీసమ్మక్క–సారలమ్మ మహా జాతరకు ఎట్టకేలకు నిధులొచ్చాయి. ఈ మేరకు రూ.75 కోట్లు నిధులు కేటాయిస్తూ గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బెనహర్ మహేష్ దత్తాఎక్కా శనివారం జీఓ జారీ చేశారు. దీంతో బడ్జెట్ మంజూరుపై రెండు నెలల ఊగిసలాటకు తెరపడింది. 2020 ఫిబ్రవరి 5 నుంచి ప్రారంభం అయ్యే మహా జాతరకు కోటి మంది భక్తులు వస్తారనే అంచనాతో అందుకు తగినట్టుగా ఏర్పాట్లకు అధికారులు మొదటిసారి రూ.175 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. అందులో మార్పులు చేర్పులు చేసి బడ్జెట్‌ను కుదించాలని ప్రభుత్వం ఆయా శాఖల అధికారులను ఆదేశించింది. దీంతో మళ్లీ రూ.109 కోట్లతో ప్రతిపాదనలు పంపగా.. నెల రోజుల తర్వాత ఆ మొత్తాన్ని కుదించి రూ.75 కోట్లు కేటాయిస్తూ జీఓ జారీ చేసింది.

MARUTI SUZUKI

# భవిష్యత్తు ఇప్పుడు ప్రారంభమైంది.

## BS6 తో.

2 లక్షలకు పైగా BS6 అనుసరించే మారుతీ సుజుకి కార్లు ఇప్పటికే రోడ్డు పై ఉన్నాయి, భారతదేశం పరిశుభ్రమైన మరియు హరితదనపు మార్గం పై ఉంది. రండి మరియు ఈ మార్పులో భాగంగా ఉండండి.

ప్రయోజనాలు:

- నవీకరించబడిన ఇంజన్ మరియు ఎగ్జాస్ట్ వ్యవస్థ
- తగ్గించబడిన ఉద్గారాలు
- BS4 మరియు BS6 ఇంధనం రెండిటి పై పని చేస్తుంది
- పరిశుభ్రమైన వాతావరణానికి కట్టుబడింది

Now BS6 compliant

#BeTheChange




మన దేశాన్ని భవిష్యత్తులోకి నడిపించే విషయంలో నాయకత్వంవహించడమే మారుతి సుజుకిలో మాకు ఎల్లప్పుడూ లక్ష్యం. ఈసారి, BS6 నియమాల్ని ముందుగా అనుసరించడం ద్వారా మేము ఒక నమ్మకమైన చైతన్యంతో, పర్యావరణానుకూలమైన రేపటి కోసం ప్రయాణాన్ని ఆరంభించాము. ఎంతైనా, మారుతి సుజుకి ఎల్లప్పుడూ రాబోయే తరాల వారితో సహా తరతరాలు కారుగా కొనసాగుతోంది.

WAGONR ALTO DZIRE ERTIGA S-PRESSO XL6 SWIFT BALENO

మరింత సమాచారం కోసం సంప్రదించండి:
Arena: **1800 102 1800**
Nexa: **1800 102 6392 / 1800 200 6392**
లేదా సందర్శించండి www.marutisuzuki.com